



ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

తిరుగు ప్రయాణంలో తిప్పలు

సంక్రాంతి ప్రభావంతో రవాణా వ్యవస్థకు డిమాండ్

బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిట

- రేపు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు భారీగా పొదుపు సభ్యుల తరలింపు
- జిల్లా నుంచి 200 ఆర్టీసీ బస్సులు కేటాయింపు
- దూరప్రాంతాల వారికి తప్పని కష్టాలు

తిరుగు ప్రయాణంలో తిప్పలు తప్పడం లేదు. మూడు రోజులపాటు పండుగ సంబరాలలో మునిగి తేలిన ప్రజలు ఉద్యోగాలు, చదువుల కోసం నగరాలకు, ఇతర ప్రాంతాలకు బయల్దేరారు. బుధవారం నుంచి తిరుగు ప్రయాణాలు ప్రారంభమయ్యాయి. పిల్లా పాపలు ఉండటంతో రిజర్వేషన్ల కోసం ప్రయత్నించినా ఈనెల 19వ తేదీ వరకు లభించే పరిస్థితి లేదు. ఆర్టీసీతోపాటు ట్రావెల్స్ బస్సుల్లోనూ టికెట్లన్నీ ఫుల్ అయ్యాయి. దీంతో ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం విజయవాడలో జరగనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు జిల్లాలోని ఐదు డిపోల నుంచి 200 బస్సులు కేటాయించారు. వాటిని ఇప్పటికే గ్రామాలకు తరలించడంతో ప్రయాణికుల పాట్లు మరింత ఎక్కువయ్యాయి.

బస్సులు ఆగేచోట ప్రయాణికుల రద్దీ



ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 17 : సంక్రాంతి ప్రభావంతో రవాణా వ్యవస్థలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. పండుగ మూడురోజులు సొంతూర్లలో బంధువులు, తల్లిదండ్రులతో ఆనందంగా గడిపి, ఉద్యోగ, ఉపాధి, చదువుల నిమిత్తం తిరిగి ఊర్లకు వెళ్లేందుకు అందరూ సిద్ధమయ్యారు. అయితే తిరుగుప్రయాణంలో ఉద్యోగులు, విద్యార్థులు, యువతలకు కష్టాలు తప్పడం లేదు. గత పదిహేను రోజుల నుంచి రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ప్రైవేటు రవాణా సౌకర్యాలన్నింటిలో రిజర్వేషన్ నిల్.. బోర్డులు దర్శనమిస్తున్నాయి. రెండు రోజుల నుంచి ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. ప్రతి ఒక్కరూ పల్లెల నుంచి పట్టణాలకు పయనంకావడంతో ప్రధాన రహదారులన్నీ ట్రాఫిక్‌తో కిటకిటలాడుతున్నాయి.

ప్రైవేటుకు డిమాండ్

ఆర్టీసీలోని ఓల్వో, ఇంద్ర, సూపర్ లగ్జరీ, స్లీపర్, గరుడా వంటి బస్సుల్లో ఇప్పటికే రిజర్వేషన్ పూర్తికావడంతో ప్రైవేటు ప్రయాణం తప్పని పరిస్థితులయ్యాయి. రైలులో ప్రయాణించడానికి రిజర్వేషన్లు లేవు. ఆర్టీసీలో టికెట్లు దొరక్క తిరిగి నగరాలు, పట్టణాలకు వెళ్లేందుకు ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రైవేటు ట్రావెల్స్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇదే అవకాశంగా ట్రావెల్స్ వారు కూడా భారీగా ధరలు పెంచి టికెట్లు అమ్ముతున్నారు. కొందరైతే పాత బస్సులను సిద్ధం చేసి పంపుతున్నారు. రాత్రికి నగరాలకు పోవడం, ఉదయాన్నే ఖాళీగా తిరిగి రావడం కూడా చేస్తున్నారు. అలాగే హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం వంటి దూరప్రాంతాలకు వెళ్లేందుకు సౌకర్యవంతమైన ప్రయాణంగా ప్రైవేటు కార్లపై పలువురు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కార్ ట్రావెల్స్ వారు సైతం బాడుగలు భారీగా పెంచేశారు. ఫలితంగా ఒక కుటుంబం హైదరాబాద్ వెళ్లడానికి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది.

బస్సుల కోసం నిరీక్షణ

పల్లెల నుంచి పట్టణాలకు వెళ్లేందుకు జిల్లాలో అధికశాతం ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులే ఆధారం. అయితే పండుగ సందర్భంగా ఆర్టీసీ యంత్రాంగం కొన్ని ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో అప్పుడప్పుడూ వచ్చే పల్లెవెలుగు బస్సు కోసం జనం పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. అయితే జిల్లాకేంద్రమైన ఒంగోలుకు ఎలాగోలా చేరుకుంటే ప్రైవేటు ట్రావెల్స్ దొరుకుతాయన్న ఆశతో ఎదురుచూసే పల్లెల్లో ఉన్న జనానికి ప్రస్తుత పండుగ సీజన్‌లో నిరాశే ఎదురవుతోంది. కాస్త కండిషన్‌లో ఉండే బస్సులను అవసరం మేరకు గుంటూరు, నెల్లూరు, విజయవాడలకు నడుపుతున్న పరిస్థితి. దీంతో పల్లెలకు ట్రిప్పులు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న మొన్నటి వరకూ గ్రామీణ ప్రాంత ప్రయాణికులు లేక వెలవెలబోయిన బస్‌స్టాప్‌లు పండుగ ప్రభావంతో రద్దీగా కనిపిస్తున్నాయి.

పల్లెవెలుగులన్నీ విజయవాడకే

విజయవాడలో శుక్రవారం జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు భారీగా జనసమీకరణ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు పొదుపు సంఘాలను సిద్ధం చేశారు. అందులోభాగంగా ప్రతి పొదుపు సభ్యురాలు కచ్చితంగా పాల్గొనాలని హుకుం జారీ చేశారు. అందుకనుగుణంగా ఆర్టీసీ బస్సులు కేటాయించారు. దీంతో ఇప్పటికే 200 బస్సులు ఆయా గ్రామాలకు పంపించగా, గురువారం పొదుపు సంఘాలతో ముందస్తుగా సమావేశం ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ సభ విజయవంతం కోసం ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు హడావుడి చేస్తుండగా, ఇప్పటికే పండుగకు సొంతూరు వచ్చి తిరిగి వెళ్లే వారికి సరిపడినన్ని బస్సులు లేవు. దీంతో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. బోలెడంత లగేజీ, పిల్లలతో తల్లిదండ్రులు నానా అగచాట్లు పడుతున్నారు. ఈనెల 19వ తేదీ వరకు ఇదే పరిస్థితి ఉండటంతో దూరప్రాంత ప్రయాణికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.



ఒంగోలులో ఎన్టీఆర్ వర్ధంతి ఏర్పాట్లపై నేతలతో చర్చిస్తున్న జనార్దన్

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

- భారీగా నిర్వహణకు తెలుగు తమ్ముళ్ల సన్నాహాలు
- పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు, అన్నదానాలు



ఒంగోలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 28వ వర్ధంతి గురువారం జరగనుంది. జిల్లావ్యాప్తంగా భారీగా కార్యక్రమాల నిర్వహణకు తెలుగు తమ్ముళ్లు సన్నాహాలు చేస్తున్నారు. ఏటా తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు పెద్దఎత్తున జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈసారి పార్టీ నేతలు మరింత ఎక్కువగా వర్ధంతిపై దృష్టిసారించారు. నియోజకవర్గ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ముఖ్య నేతలంతా ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లాలో ఇంచుమించు అన్ని గ్రామాలతోపాటు పట్టణాల్లోని పలు వార్డులు, కాలనీల్లో ఇప్పటికే ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలతోపాటు చిత్రపటాలు ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించేలా సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు పెద్దఎత్తున అన్నదానాలతోపాటు రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి రాత్రి 10గంటల వరకు ఆయా ప్రాంతాల్లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు జరగనున్నాయి. ఒంగోలు నగరంలో దాదాపు పది, పన్నెండు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై ముఖ్యనేతలు బుధవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో సమావేశమై చర్చించారు. స్థానిక గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఈ సమావేశం జరగ్గా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించడంతోపాటు పార్టీ కార్యాలయం వద్ద జరిగే రక్తదాన శిబిరం, సభను విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఇతర నియోజకవర్గాల్లోనూ భారీగా ఈ విడత వర్ధంతి నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు.

అవ్వకు అవస్థ

- పింఛన్ కోసం పడిగాపులు
- 8 నెలలుగా తిరుగుతున్నా కనికరించని అధికారులు



కమల

కంభం, జనవరి 17 : ఇద్దరు కొడుకులు ఉన్నా ప్రయోజకులు కాలేదు. దీంతో ఎలాంటి ఆధారం లేక ఆమెకు నోటిలోకి ముద్ద వెళ్లడమే గగనమైంది. పింఛన్ కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇది ఒక దీనురాలి స్థితి. బుధవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి 65ఏళ్ల వృద్ధురాలు వస్తుండటం చూసి 'ఆంధ్రజ్యోతి' పలుకరించగా ఆమె తన గోడు వెళ్లబోసుకుంది. 'నా పేరు తరిట కమల. నాకు 65 సంవత్సరాలు. కంభం పంచాయతీ పరిధిలోని మేదరవీధిలో ఉంటున్నాను. ఇద్దరు కొడుకులున్నా వారు ప్రయోజకులు కాలేదు. బతుకు భారమై వృద్ధాప్య లేదా వితంతు పింఛన్ ఇప్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నాను. అటు సచివాలయానికి, ఇటు ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ కనికరించడం లేదు. నా భర్త పెద్దవెంకటేశ్వర్లు కూరగాయలు అమ్మి కుటుంబాన్ని పోషించేవారు. ఆయన 8 నెలలక్రితం మృతిచెందారు. దీంతో ఆయనకొచ్చే వృద్ధాప్య పింఛన్ నిలిచిపోయింది. అప్పటి నుంచి తనకు పింఛన్ ఇప్పించాలని కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కనికరించడం లేదు. ఆయన పోయాక పూట గడవడం కష్టమైంది. అధికారులను అడిగితే నీకు కచ్చితంగా పింఛన్ వస్తుందన్నారు. నేటికీ దిక్కులేదు. జనవరిలో కొత్త పింఛన్ల లిస్టులో నా పేరు లేదు. అధికారుల వద్ద సమాధానం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకుంటే పింఛన్ ఇస్తామని చెప్తున్న వైసీపీ పాలకులు తన కష్టం తెలుసుకొని పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని ఆ అవ్వ కోరింది.

వైద్యశాఖలో విచిత్ర పరిస్థితి

- ఇతరుల పేర్లతో ఆ శాఖ ఉద్యోగులే సమాచారం కోసం దరఖాస్తులు
- సరాసరిన నెలకు 35 నుంచి 40 వస్తున్నవైనం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 17 : జిల్లా వైద్యారోగ్యశాఖలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఇతర శాఖలకు భిన్నంగా ఆశాఖలో ఏ ఉద్యోగికి ఏ సమస్య వచ్చినా ఇతరుల పేర్లతో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకొని సమాచారం కోరుతున్నారు. సమాచార హక్కు చట్టం కింద ఆ కార్యాలయంలో ఏదైనా ఉద్యోగికి సంబంధించిన సమాచారం కానీ నిధుల దుర్వినియోగంతోపాటు ప్రజలకు ఉపయోగపడే అంశాలపై దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. కానీ అందుకు భిన్నంగా తమకు అవసరమైన సమాచారం కోసం ఇతరుల పేర్లతో ఉద్యోగులు దరఖాస్తు చేసుకొని, ఫోన్ నెంబర్ మాత్రం వారిదే ఇచ్చుకుంటున్నారు. ఇలా వైద్యశాఖలో ప్రతిరోజూ ఏదో ఒక అంశంపై



దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నారు. నెలకు సరాసరి 35 నుంచి 40 దరఖాస్తులు వస్తున్నాయి. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పరిస్థితి మరింత ఎక్కువైంది. ఆ శాఖలో గత కొన్నేళ్ల నుంచి జరుగుతున్న పరిణామాల నేపథ్యమే ఇందుకు కారణమన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వైద్యాఆరోగ్యశాఖలో ఇతర శాఖల కంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉంటారు. నియామకాలు కూడా అధికంగా ఉంటాయి. ప్రజాప్రతినిధుల సిఫార్సులతో డిప్యుటేషన్లు తదితర అంశాలు చోటుచేసుకొంటుంటాయి. ఈ కారణంగానే దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉందనేది బహిరంగ రహస్యం. ఇటీవల పశ్చిమప్రాంతంలో ఒక వైద్యశాలలో పనిచేసే ఉద్యోగి ఇతర వ్యక్తి పేరుతో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నారు. దానికి సంబంధించి సమాచారం ఇచ్చే సమయంలో ఒక ఉద్యోగి దరఖాస్తు చేసుకున్నట్లు గుర్తించారు. నిరంతరం ఇదే విధంగా పదుల సంఖ్యలో దరఖాస్తులు వస్తుండటంతో ఆ శాఖ అధికారులకు కూడా ఇబ్బందికరంగా మారింది.



పార్టీలో చేరిన వారితో డాక్టర్ ఉగ్ర

కనిగిరి అభివృద్ధే లక్ష్యం


- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర
- ఆయన సమక్షంలో హెచ్‌ఎంపాడు, కనిగిరి మండలాల నుంచి భారీ చేరికలు

వివరాలు లోపలి పేజీల్లో..

సగమే స్పష్టత

బాలినేనితో రాజీ

మాగుంటకు చెక్



- ఆ భూముల్లో అభివృద్ధి పనులకు ఉత్తర్వులు
- కొనుగోలుకు మాత్రం ఇంకా విడుదల కాని నిధులు
- ఎంపీ పేరెత్తనివ్వని జగన్
- వాసుతోపాటు కుమారుడి సీటు కోసం చర్చ?

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఎట్టకేలకు ముఖ్యమంత్రి జగన్‌కి జిల్లాలో ఆపార్టీ సీనియర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డికి మధ్య రాజీ కుదిరింది. మరో సీనియర్ నాయకుడు, ఒంగోలు ఎంపీ మాగుంటను మాత్రం పక్కకు నెట్టేశారు. బాలినేని కోరిక మేరకు ఇళ్లస్థలాల అభివృద్ధికి నిధుల విషయంలో హడావుడిగా ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం, కొనుగోలుకు మాత్రం నిధులు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. అదేసమయంలో బాలినేని రాజకీయ డిమాండ్లపై పూర్తి స్పష్టత రాలేదని తెలుస్తోంది. బాలినేనితోపాటు ఆయన కుమారుడు ప్రణీత్‌ను కూడా ఎన్నికల రంగంలోకి తెచ్చే ప్రయత్నం జరుగుతున్నదని, ఈ విషయమై రెండురోజుల్లో జగన్ తుది నిర్ణయం ప్రకటించబోతున్నారని సమాచారం. దీంతో తాత్కాలికంగా బాలినేని వ్యవహారం ఓ కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తున్నా ఇంకా వేచిచూడాల్సిన పరిస్థితులు మాత్రం నెలకొన్నాయి.

వచ్చి కలవండి

కొంతకాలం నుంచి రాజకీయంగా తనను పక్కనపెట్టారన్న భావనతో బాలినేని పార్టీ అధిష్ఠానంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న విషయం విదితమే. సంక్రాంతికి ముందు మూడురోజులు ఆయన విజయవాడలో మకాం వేసినా జగన్‌ను కలిసే భాగ్యం లభించక అలిగి వెళ్లిపోయారు. ఆతర్వాత జిల్లాలో జరిగిన కొండపి, ఎస్ఎన్‌పాడు సమావేశాలకు బాలినేని అనుచరులు గైర్హాజరు కాగా, ఇతర చోట్ల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మంత్రులు సురేష్, నాగార్జునలు సీఎం వద్దకెళ్లి బాలినేని విషయంపై ఒత్తిడి తేవడం తదితర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో మంగళవారం ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి స్వయంగా ఫోన్ చేసి వచ్చి కలవాలని ఆహ్వానించటంతో బుధవారం బాలినేని విజయవాడ వచ్చి ఆయనతో భేటీ అయ్యారు.

ఒంగోలులో కదిలిన ఫైలు

ఈనేపథ్యంలో ఒంగోలు నివేశన స్థల పట్టాల పంపిణీకి సంబంధించి కలెక్టర్ ఆగమేఘాలపై కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. భూమి కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా రూ.170 కోట్లు రావాల్సి ఉంది. ఆ నిధులను రెండు దఫాలుగా ఇవ్వాలని సీఎం ఆదేశించారని చెప్తున్నారు. అదేసమయంలో కలెక్టర్ 402 ఎకరాల భూమిలో మౌలిక వసతుల కల్పన కోసం రూ.21.33 కోట్ల విలువైన పనుల నిర్వహణకు అనుమతులిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తద్వారా బాలినేని డిమాండ్‌కు అనుగుణంగా సీఎం ఆదేశంతో ఈ విషయంలో కదలిక ప్రారంభమైనట్లు కనిపిస్తోంది. అయితే భూమి కొనుగోలు పూర్తికాకుండా మౌలిక సదుపాయాల కల్పన పనుల నిర్వహణకు భూయజమానులు సహకరించే అవకాశం లేదు. దీంతో ప్రభుత్వం నిధులిచ్చి వాటిని భూయజమానులకు చెల్లిస్తేనే పనుల్లో ముందడుగుకు అవకాశం ఉంది.

కాగా జనవరి నెలాఖరు సమీపిస్తుండటం, ప్రతినెలా చివర్లో ఇతరత్రా ఖర్చులను ఆపేసి ఉద్యోగుల జీతాలు, పింఛన్ల చెల్లింపునకు ప్రభుత్వం నిధులు సమకూర్చుకోవటం గత నాలుగున్నరేళ్లుగా జరుగుతున్న తంతు. ఈ స్థితిలో ఇప్పటికిప్పుడు ఈ భూమి కొనుగోలుకు ప్రభుత్వం నిధులు ఇవ్వగలిగేనా? అన్న సందేహాలు లేకపోలేదు.

మాగుంట విషయంలో కస్సుబుస్సు

బాలినేని సీఎంను కలవగానే ఆయన ఎంపీ మాగుంట విషయమై కస్సుబుస్సు లాడినట్లు తెలిసింది. 'ఆయన ఎప్పటి నుంచి తెలుసు నీకు. ఎప్పటి నుంచి బంధువు. ఏమి చేయగలడు. ఆ పార్టీలో (టీడీపీ) రెండు స్థానాల్లో పోటీ చేస్తాడట. చేయనివ్వండి చూద్దాం' అంటూ ఆయన పేరు ఎత్తవద్దని తెగేసి చెప్పినట్లు తెలిసింది. ఆ తర్వాత బాలినేని కూడా ఆ విషయాన్ని వదిలేసినట్లు సమాచారం. 'ఒంగోలులో ఇళ్లపట్టాల పంపిణీ జరిగితే పోటీ చేస్తావు. లేకపోతే గిద్దలూరులో పోటీచేస్తావు అంతేకదా. రెండురోజుల్లో నిధులొచ్చేస్తాయి. వెళ్లు ఆ తర్వాత మాట్లాడుకుందాం' అని కూడా సీఎం అన్నట్లు తెలిసింది. ఆ తర్వాత బాలినేని ఇటు ఐప్యాక్ ప్రతినిధి, అటు సీఎంవో ముఖ్యకార్యదర్శి ధనుంజయరెడ్డిని కలిసి నివాసస్థలాల పంపిణీ, తన రాజకీయ డిమాండ్లపై మాట్లాడినట్లు సమాచారం.

రాజకీయ డిమాండ్లపై తర్జనభర్జన

బాలినేని పెట్టిన రాజకీయ డిమాండ్లపై మాత్రం తర్జనభర్జన జరుగుతున్నట్లు తెలిసింది. ఆ విషయంలో తుది నిర్ణయం గురువారం జరిగే అవకాశం ఉంది. 'ఇళ్లపట్టాల పంపిణీ జరిగితే మీరు ఒంగోలులోనే పోటీచేస్తారు. ఇక ఎంపిక ఇప్పటి వరకూ పూర్తికాని నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై మీ అభిప్రాయాలపై విజయసాయితో కూర్చుని చర్చించండి. మార్పులుచేర్పులు అవసరం అనుకున్న చోట్ల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలను పిలిపించండి. గురువారం సాయంత్రం అన్నీ ఫైనల్ చేద్దాం' అని జగన్ అన్నట్లు సమాచారం. ఆ మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలు, మరికొందరు ఇన్‌చార్జిలకు గురువారం తాడేపల్లి రావాలని సమాచారం ఇస్తున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగా కనిగిరి, మార్కాపురం ఎమ్మెల్యేలను కూడా తాడేపల్లి రావాలని కోరినట్లు సమాచారం. అద్దంకి వైసీపీ మాజీ ఇన్‌చార్జి చైతన్య, దర్శి ఎమ్మెల్యే వేణుగోపాల్‌తోపాటు ఆశావహుల్లోని మరికొందరు బుధవారమే బాలినేనితోపాటు విజయ వాడలో ఉన్నారు. మాగుంటకు చాన్స్ లేదని చెప్పిన జగన్.. ఎంపీ అభ్యర్థి ఎంపికపై కూడా గురువారం లేదా శుక్రవారం నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది.

బెదిరింపులకు లొంగేది లేదు

- షోకాజ్ నోటీసులకు సమాధానమిచ్చిన అంగన్‌వాడీలు
- 37వ రోజుకు చేరిన సమ్మె



నోటీసులకు సమాధానాలను సీడీపీవోకు అందజేస్తున్న అంగన్‌వాడీలు

ఒంగోలు నగరం, జనవరి 17: ప్రభుత్వ బెదిరింపులకు లొంగేదే లేదని అంగన్‌వాడీలు తేల్చిచెప్పారు. వారి సమ్మె బుధవారానికి 37వ రోజుకు చేరింది. డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేపట్టిన కార్యకర్తలు ప్రభుత్వం దిగొచ్చే వరకు తమ పోరాటం ఆపేది లేదన్నారు. ఎస్మా ప్రయోగించినా భయపడబోమన్నారు. అంగన్‌వాడీ సేవలను అత్యవసర సేవల పరిధిలోకి తెచ్చిన ప్రభుత్వం వారిపై ఎస్మాను ప్రయోగించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారికి పదిరోజుల క్రితం స్త్రీ,శిశు సంక్షేమశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. వాటికి కార్యకర్తలు బుధవారం మూకుమ్మడిగా సమాధానాలు అందజేశారు. కలెక్టరేట్ వద్ద చేపట్టిన దీక్షా శిబిరం వద్ద నుంచి ర్యాలీగా ఐసీడీఎస్ కార్యాలయానికి వెళ్లి నోటీసులకు సమాధానాలను సీడీపీవో రాజకుమారికి అందజేశారు. మొత్తం 550మంది కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. బుధవారం నాటి 24 గంటల దీక్షా శిబిరాన్ని ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమానికి శేషయ్య మాస్టర్, మాఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు మద్దతు ప్రకటించారు. సీఐటీయూ నగర కార్యదర్శి మహేష్, అన్నపూర్ణ, సుబ్బమ్మ, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

నగరంలో భారీగా నిర్వహణకు ఏర్పాట్లు • అన్నదాన కార్యక్రమాలు • శ్రేణులకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల దిశానిర్దేశం





ఒంగోలులోని టీడీపీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, వేదిక వద్ద ఉంచిన కుర్చీలు

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 17 : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి వేడుకలు గురువారం ఒంగోలులో ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బుధవారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమై కార్యక్రమ విజయోత్సవానికి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. భారీగా కార్యక్రమాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. కాగా ఉదయం 8గంటలకు నగరంలోని 37వ డివిజన్‌లో చెన్నకేశస్వామి లే అవుట్‌పార్కులోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించడంతోపాటు, 8-30 గంటలకు గుంటూరురోడ్‌లోని టీడీపీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ప్రారంభం, అనంతరం అద్దంకిబస్టాండ్‌లోని ఎన్టీఆర్, పొనుగుపాటి కోటేశ్వరరావు, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు నివాళులర్పిస్తారు. అలాగే 5వ డివిజన్‌లోని గోపాలనగరంలో గల తిరుపతమ్మ గుడి వద్ద, తూర్పుకమ్మపాలెంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు, అనంతరం నల్లూరి నర్సింగ్‌హోమ్ ఎదురు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు, ఆ తర్వాత 15వ డివిజన్ కేటీ వద్ద శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి, నిర్మల్ పార్కువద్ద, కర్నూలు రోడ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు, తెలుగుతల్లి విగ్రహాలకు నివాళి, 60 అడుగల రోడ్డు వద్ద విగ్రహం వద్ద నివాళి, మధ్యాహ్నం నుంచి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగే వర్ధంతి సభ కార్యక్రమంతోపాటు భారీస్థాయిలో అన్నదానం ఏర్పాటు చేశారు. కాగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో కలిసి దామచర్ల జనార్దన్ పాల్గొంటారని నియోజకవర్గ టీడీపీ నాయకులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి రాదాడి పోటీల్లో
కడప ఎడ్లకు ప్రథమ బహుమతి

ఒంగోలు నగరం, జనవరి 17: కనుమ పండుగ సందర్భంగా కొత్తపట్నంలో నిర్వహించిన ఎడ్ల రాదాడి పోటీల్లో కడప జిల్లాకు చెందిన నారాయణరెడ్డి ఎడ్ల జతకు ప్రథమ బహుమతి దక్కింది. ఈ పోటీలను తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి తెలుగు రాష్ట స్థాయిలో మొత్తం 10 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో కడప ఎడ్ల జత 12 నిమిషాల్లో 3018 అడుగులు బండను లాగి మొదటిస్థానంలో నిలిచాయి. మొదటి బహుమతిగా రూ.లక్ష నగదును నారాయణరెడ్డి అందుకున్నారు. ద్వితీయ స్థానాన్ని కొత్తపట్నంకు చెందిన పల్లెకొండ సాయి ఎడ్ల జతకు దక్కింది. ఈ జత 12 నిమిషాల్లో 2423 అడుగులు బండను లాక్కెళ్ళి ద్వితీయ స్థానంలో నిలిచాయి. ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు బహుమతిని యజమాని సాయికి అందజేశారు.

ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణాల మంజూరు కోసం
దివ్యాంగులకు ఇంటర్వ్యూలు

ఒంగోలు నగరం, జనవరి 17: జాతీయ దివ్యాంగుల ఆర్థికాభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ) ద్వారా జిల్లాలోని దివ్యాంగులకు రుణాలను మంజూరు చేసేందుకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలను ప్రకాశం భవనంలోని స్పందన హాలులో నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రుణాలను మంజూరుకు దరఖాస్తు చేసుకున్న మొత్తం 56మంది దివ్యాంగులు ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు, ఏపీఎం ఆదిశేషు, మెప్మా ఏవో పూర్ణచంద్రరరావు, బీసీ కార్పొరేషన్ ఏఈవో చిట్టిబాబు తదితరులు ఈ ఇంటర్వ్యూలను నిర్వహించారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



శిబిరాన్ని ప్రారంభించిన జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

చీమకుర్తి, జనవరి 17: చీమకుర్తి పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోటరీక్లబ్ ఆఫ్ చీమకుర్తి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు ప్రారంభించారు. రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలను అభినందించారు. బత్తుల జవహర్‌రెడ్డి అందించిన మొక్కలను ఆసుపత్రి ఆవరణలో నాటి పండ్లను రోగులకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, క్లబ్ అధ్యక్షుడు గుండా చినవెంకటేశ్వర్లు, సెక్రటరీ అంబటి వీరారెడ్డి, గొల్లపూడి వెంకట్రావు, మన్నం నాగరాజు, పరాంకుశం శ్రీనివాసమూర్తి, తిరపతిరెడ్డి, దోమల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

21న అయోధ్యాదర్శిని



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), జనవరి 17: అయోధ్యలో ఈ నెల 22వ తేదీ బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా 21వ తేదీన ఒంగోలులో అయోధ్యాదర్శిని పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు తాతా బదరీనాథ్ తెలిపారు. బుధవారం స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థాన కళ్యాణమండపంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇతర హిందూ సంఘాల నేతలతో కలిసి ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం బదరీనాథ్ మాట్లాడుతూ 21వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు వెండిరథంలో సీతారామచంద్రుల విగ్రహాలను ఉంచి, 125 కలశాలతో స్థానిక గడియారంవారివీధి శ్రీఅనంత కోదండ రామస్వామి దేవస్థానం దగ్గర నుంచి శోభాయాత్ర జరుగుతుందన్నారు. ఈ శోభాయాత్ర నగరంలోని వివిధ దేవాలయాలను కలుపుతూ గాంధీరోడ్డులోని గీతామందిరం వరకు కొనసాగుతుంది. అదేవిధంగా హనుమాన్ చాలీసా పారాయణ, రామభజన కోలాట ప్రదర్శన, మార్వాడి మహిళల నృత్య ప్రదర్శన మొదలైనవి ఉంటాయన్నారు. అనంతరం గాంధీరోడ్డులో స్వామివారికి 125 కలశాలతో, పంచామృతాలతో అభిషేకం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలలో పాల్గొనదలచిన వారు కమిటీ వారిని సంప్రదించాలని కోరారు. సమావేశంలో వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు సోమా సుబ్బారావు, ఈమని బలరాం, బాలుజీ యోగాచార్య, గడియారం సుబ్బయ్యశర్మ, కె.వి.శేషారావు, అన్నం శ్రీను, బీఎంఆర్ రవికుమార్, బియ్యపు విజయ్, కోడూరి కిషోర్, ఈదుపల్లి గురునాథరావు తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే సమగ్రంగా చేపట్టాలి

• కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 17 : జిల్లాలో ఈ నెల 19నుంచి జరగనున్న కులగణన సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఈ సర్వే నిర్వహణపై బుధవారం మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ప్రజల సామాజిక, ఆర్థికస్థితిగతులపై సమగ్ర వివరాలు సేకరించాలన్నారు. సర్వే సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా వివరాలను నమోదు చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, ఈ దిశగా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు అవసరమైన సన్నాహక సమావేశాన్ని మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో గురువారం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నెల 19నుంచి 28వతేదీ వరకు పది రోజుల పాటు సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్ళి వివరాలు నమోదు చేయాలని, అనివార్య కారణాల వల్ల ఈ పదిరోజుల పాటు స్థానికంగా అందుబాటులో లేని ప్రజలు తమ వివరాలను ఈనెల 29నుంచి ఫిబ్రవరి 2 వరకు తమ పరిధిలోని సచివాలయంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. స్థానికంగా ఉంటున్న కుల సంఘాల నాయకులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మండల అధికారులందరూ తమకు కేటాయించిన గ్రామాలను ప్రతిరోజు సందర్శించాలని, సూపర్‌వైజర్లు కూడా ప్రతిరోజు ఫీల్డ్‌లో ఉండేలా పర్యవేక్షించాలని చెప్పారు. ఈనెల 19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రతి సచివాలయం నుంచి ప్రజలు తరలివేళ్ళేలా రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు ముగిసిన చోట ఘనంగా ముగింపు వేడుకలు నిర్వహించి విజేతలైన క్రీడాకారులను అభినందించి నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు బి.జాలిరెడ్డి, వసుంధర, రవికుమార్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నమ్మిన ప్రజలను నట్టేట ముంచిన జగన్

• కొండపి ఎమ్మెల్యే స్వామి ధ్వజం



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే స్వామి

టంగుటూరు, జనవరి 17 : నమ్మిన ప్రజలను ముఖ్యమంత్రి జగన్ నట్టేట ముంచారని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని పొందూరులో కనమర్లపూడి మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలుగు యువత వివిధ పోటీలు నిర్వహించింది. మంగళవారం రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే స్వామి పాల్గొని మాట్లాడారు. ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్ నిత్యావసరాల ధరలను ఆకాశానికి ఎక్కించారని విమర్శించారు. మద్యం, ఇసుక, మైనింగ్‌లో కోట్లు కొల్లగొట్టి ప్రజలను నిలువునా దగా చేశారని ఆరోపించారు. మద్యపాన నిషేధం తెస్తానని చెప్పి ఓట్లు దండుకొని అధికారం చేతికి రాగానే నాసిరకం మద్యం సరఫరా చేసి మందుబాబుల ప్రాణాలను హరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వమే ప్రజలతో వ్యాపారం చేసే స్థాయికి దిగజారిందన్నారు. అధికారం తలకెక్కి, దౌర్జన్యాలు, దోపిడీలు నిరంతరం కొనసాగిస్తున్నదన్నారు. జగన్ నిజ స్వరూపం తెలుసుకున్న ప్రజలు రానున్న ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించి ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పిల్లి కోట్లింగం, ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఏరువ ఆనందరావు, మాజీ సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేజండ్ల బలరాం, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అన్ని విధాలా సహకారం అందిస్తా

• మంత్రి నాగార్జున



మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

మద్దిపాడు, జనవరి 17: కిందిస్థాయి నుంచి రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలకు అన్నివిధాల సహకరిస్తానని సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెరుగ నాగార్జున పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మద్దిపాడులోని అంకమ్మతల్లి కల్యాణ మండపంలో వైసీపీ కార్యకర్తల పరిచయ వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ ప్రజలతో కలిసిమెలిసి నడుస్తానని, ఎవరినీ అగౌరవపరచకుండా అందరితో మమేకమవుతానని చెప్పారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పెండింగ్‌లో ఉన్న విషయాలను పరిష్కరిస్తానని చెప్పారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. మండలంలో పరిష్కారంకాని సమస్యలపై దృష్టి పెడతానన్నారు. వైసీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ, ఎంపీటీసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ విజయలక్ష్మి, గట్టినేని అయ్యన్న, వెంకట్రావు, ఎండీ.మజీద్, మోరబోయిన సంజీవరావు, నట్టే సంజీవరావు, బెజవాడు రాము, లింగా రామకృష్ణారెడ్డి, నందిపాడు సొసైటీ చైర్మన్ పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు



మద్దిపాడులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మద్దిపాడు, జనవరి 17: గ్రామ పంచాయతీల్లో సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని మండల పరిషత్ సూపరింటెండెంట్ చుండూరి వెంకటసుబ్బారావు పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడు మండల కార్యాలయంలో సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా అధ్యక్షత వహించిన ఎంపీపీ వాకా అరుణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ గ్రామపంచాయతీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. శిక్షకులు శ్రీకాంత్‌శిరీష్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పూనూరు వెంకటసుబ్బారావు, బెజవాడ శ్రీరామమూర్తి, వైస్ ఎంపీపీ వెంకట్రావు, నారా సుబ్బారెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

సంతనూతలపాడు: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో 2024-25కు సంబంధించి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామపంచాయతీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో వెంకటేశ్వరరావు, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

గోనుగుంటలో
జనసేన జెండా ఆవిష్కరణ



జెండాను ఆవిష్కరిస్తున్న రియాజ్

చీమకుర్తి, జనవరి17 : మండలపరిధిలోని గోనుగుంట గ్రామంలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జనసేన అభ్యర్థుల గెలుపుకోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆమంచి స్వాములు, రాయపాటి అరుణ, కందుకూరి బాబు, పల్లపు శివప్రసాద్, చిట్యం ప్రసాద్, రాజేష్, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

నేడు 'భారతరత్నమా' ప్రత్యేక గీతం ఆవిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 17: విజయవాడలో ఈనెల 19న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో ఒంగోలు మండల విద్యాధికారి కిషోర్‌బాబు సమర్పకుడిగా అంబేడ్కర్‌పై రూపొందించిన భారత రత్నమా- జాతికి దీపమా ప్రత్యేక గీతాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం ఆవిష్కరించనున్నారు. డీఈవో వీఎస్.సుబ్బారావు ఆధ్వర్యంలో రూపొందించిన గీతాన్ని బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో ఆ పాటను విని అభినందించారు. ప్రముఖ రచయిత్రి జ్యోతిర్మయి రచించిన ఈ గీతాన్ని జిల్లాకు చెందిన గాయకుడు శరత్‌బాబు ఆలపించారు. ఖాసీం సంగీతం అందించారు.

విప్లవ వీరుడు అల్లూరికి ఘన నివాళి



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాఘవరెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 17: ఒంగోలు నగరం గుంటూరు రోడ్డులోని నూతనంగా ఏర్పాటు చేసిన విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి యువపారిశ్రామికవేత్త మాగుంట రాఘవరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. క్షత్రియ సంఘం, అల్లూరి సీతారామరాజు సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాఘవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నగరంలో అల్లూరి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రంగా సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు రావూరి బుజ్జి, సూపర్‌బజారు మాజీ చైర్మన్ తాతా ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ బెల్లం సత్యనారాయణ, సీహెచ్.నాగరాజు, షాజహాన్, పెండ్యాల శ్రీను, సుధారెడ్డి, సాయిచందు, దిలీప్, బ్రహ్మం, ఖాదర్, సాయి, వెంకీ, సుకుమార్ పాల్గొన్నారు.

గెస్ట్ అధ్యాపకులకు ఇంటర్వ్యూలు రేపు

ఒంగోలు(విద్య), జనవరి 17: ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యూజీ కామర్స్ సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ అధ్యాపకులను నియమిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న గెస్ట్ అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికలో మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. నెట్/స్లెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుంది. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు జరిగే డెమో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆమె కోరారు.

లారీ డ్రైవర్‌కు ఐదేళ్లు జైలు

ఒంగోలు(క్రైం), జనవరి17: నిర్లక్ష్యంగా లారీ నడిపి ఆరుగురు మృతికి, 12 మందికి గాయాలు అయ్యేందుకు కారణమైయిన డ్రైవర్ విన్నకోట రమేష్‌కు ఐదేళ్లు జైలు, రూ.1000లు జరిమానా విధిస్తూ అదనపు జిల్లా న్యాయాధికారి శివకుమార్ బుధవారం తీర్పునిచ్చారు. ఈపూరుపాలెంనకు చెందిన లారీ డ్రైవర్ రమేష్ 2013 ఆగస్టు 18న చీరాల నుంచి ఒంగోలు వైపు లారీ నడుపుతూ ఘోర ప్రమాదానికి కారణమయ్యాడు. తొలుత ఓ మోటర్ సైకిల్‌ను ఢీకొట్టి రెండు ఆటోలను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆరుగురు చనిపోయారు. 12 మంది గాయపడ్డారు. ఈమేరకు నాగులుప్పలపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పదేళ్ల తరువాత నిందితుడుకి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వచ్చింది. ప్రాసిక్యూషన్ తరుపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్వాలా జాస్మిన్ తమ వాదనలు వినిపించారు.

దొడ్డవరప్పాడు క్రీడాకారిణి ప్రతిభ



ఉమన్ ఆఫ్‌ది సిరీస్‌తో మైథిలీ

మద్దిపాడు, జనవరి 17: ఇండియన్ డెఫ్ క్రికెట్ అసోసియేషన్ ఐడీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి టీ20 మహిళల బధిరుల ప్రీమియం లీగ్‌లో విజేతగా హైదరాబాద్ ఈగల్స్ నిలిచింది. ఈ టోర్నీలో మద్దిపాడు మండలం దొడ్డవరప్పాడుకు చెందిన క్రీడాకారిణి బొమ్మల మైథిలి సత్తా చాటారు. యూపీ వారియర్స్‌తో జరిగిన ఫైనల్స్ మ్యాచ్‌లో ఐదు వికెట్ల తేడాతో హైదరాబాద్ ఈగల్స్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో బొమ్మల మైథిలి బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించి ఉమన్ ఆఫ్‌ది సిరీస్ అవార్డును, రూ.లక్ష ప్రైజ్ మనీని అందుకున్నారు. ఈ సందర్భంగా మైథిలీని బుధవారం దొడ్డవరప్పాడు గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

బీచ్ కబడ్డీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న మారం వెంకారెడ్డి

సంతనూతలపాడు, జనవరి 17: జాతీయస్థాయి బీచ్‌కబడ్డీ పోటీలను మండలంలోని మంగమూరు గ్రామంలో మాజీ ఏఎంసీ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు మారం వెంకారెడ్డి బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ పోటీలు సంక్రాంతిని పురస్కరించుకుని అంబేద్కర్‌యువ జనసంఘం ఆధ్వర్యంలో ఘనంగా మొదలయ్యాయి. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు కొండసింగ్‌రాజు, యుగంధర్, గోపీకృష్ణ, అశోక్, ధనుంజయ్, తిరుపతిస్వామి, శివ, నాగేశ్వరరావు, రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయ చైర్మన్ మృతి

సంతనూతలపాడు, జనవరి 17: సంతనూతలపాడు కోదండరామస్వామి ఆలయం ట్రస్టు బోర్డు చైర్మన్ కాశీవిశ్వనాథం (67)బుధవారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా సర్పంచ్ డి.నాగమణి, జడ్పీటీసీ డి.రమణమ్మ, వైస్‌ఎంపీపీ రాగమ్మ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శరత్‌బాబు, వాసవిక్లబ్ అధ్యక్షుడు వి.శేషారావు, ఆర్యవైశ్యకళ్యాణమండపం అధ్యక్షులు వి.మల్లేశ్వరరావు తదితరులు ఘనంగా నివాళులర్పించారు.

చిన్నారులకు గాలిపటాల పంపిణీ



గాలిపటాలను పంపిణీ చేస్తున్న భవానీ

సింగరాయకొండ, జనవరి 17 : పంచాయతీ పరిధి రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద బుధవారం వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు గాలిపటాలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనిత క్లబ్ అధ్యక్షురాలు ఏల్చూరి భవాని మాట్లాడుతూ క్లబ్ తరఫున సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ ఉదయలక్ష్మి, కోశాధికారి శ్రీరామ్, సుశీల పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

టంగుటూరు, జనవరి 17 : విజయవాడలో ఈనెల 19న జరిగే 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని దళిత ఫెడరేషన్ రాష్ట్ర నేత తుల్లిబిల్లి అశోక్‌బాబు కోరారు. టంగుటూరులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ భారీ విగ్రహం రాష్ట్రానికి గుర్తుగా మిగిలిపోతుందన్నారు.

ట్రాన్స్‌జెండర్ల మధ్య ఘర్షణ..పలువురికి గాయాలు

ఒంగోలు(రూరల్), జనవరి 17: ఒంగోలు నగరం కొప్పోలురోడ్డులో ట్రాన్స్‌జెండర్ల మధ్య గత కొన్నిరోజులు నుంచి చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఈ గొడవలను పరిష్కరించుకునేందుకు బుధవారం ఒకచోటకు చేరారు. మరలా ఒకరునొకరు ఘర్షణ పడ్డారు. దీంతో పలువురికి గాయాలు కాగా రిమ్స్‌లో చేరారు. మరో ఇద్దరిని రక్షక పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఒంగోలు నగరానికి చెందని వారు రావటం గొడవలకు కారణమని తెలుస్తోంది.

నవాబుపేటలో కుక్కల బెడద



రోడ్డుపై కుక్కల సమూహం

చీమకుర్తి, జనవరి 17 : చీమకుర్తి పట్టణంలోని నవాబుపేట, జవహర్ ఆసుపత్రి వెనుక వైపున్న వీధులు, కుమ్మరిపాలెం తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని ఆయా ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. కుక్కలు వాహనదారులను, పాదచారుల వెంటపడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గత నాలుగురోజుల్లో ఇద్దరి పిల్లలను, మరో ఇద్దరు మహిళలు కుక్కకాటుకు గురయ్యారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి కుక్కల బెడద తప్పించాలని స్థానికులు కోరుతున్నారు.

కనిగిరి అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు

మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర

హెచ్‌ఎంపాడు, కనిగిరి మండలాల నుంచి భారీ చేరికలు



డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన నేతలు, కార్యకర్తలు

కనిగిరి, జనవరి 17 : కనిగిరి అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. కనిగిరిలోని అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం కనిగిరి, హనుమంతునిపాడు మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర వారి మెడల్లో టీడీపీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం ఉగ్ర మాట్లాడుతూ పార్టీలో చేరిని ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి భారీ మెజార్టీ రాబట్టేందుకు కృషి చేయాలని కోరారు. తానెప్పుడూ పదవి కోసం పాకులాడలేదని, నిజాయితీగా కనిగిరి అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో జరిగిన అభివృద్ధికి సాక్ష్యాలున్నాయన్నారు. వైసీపీ వస్తే కనిగిరి మరింత అభివృద్ధి చెందుతుందని భావించి ఓట్లేసిన ప్రజానీకం నిలువునా మోసపోయిందని చెప్పారు. స్థానికేతరులకు అవకాశం ఇచ్చి గెలిపించినందుకు కనిగిరి ప్రాంతం అభివృద్ధిపై నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కనిగిరి మండలంలోని దిరిశవంచ గ్రామంలోని దళితకాలనీకి చెందిన 50 మంది వైసీపీని వీడి టీడీపీ నాయకులు నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారిలో కోలా కొండయ్య, వంగేపురం అంకయ్య, ప్రభుదాసు, చిన్నయ్య, రవి, సలోమన్, సంతోష్, మనోజ్‌లతోపాటు మరికొన్ని కుటుంబాలవారు చేరగా, బ్రహ్మయ్య, గారపాటి సుబ్బారావు, కోటయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా హనుమంతునిపాడు మండలంలోని లింగంగుట్ల గ్రామంలోని 41 కుటుంబాలు వైసీపీని వీడి మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బూచి బాలకోటిరెడ్డి, మాజీ సర్పంచ్ కాశమ్మ, చెన్నయ్య, ఓబులయ్య, బోజ్యం వెంకటేశ్వర్లు, కేతిరెడ్డి కొండారెడ్డి, అప్పిచెర్ల కొండారెడ్డి, శ్రీనివాసులు, బాలఅంకయ్య, కాశయ్య, వెంకటరెడ్డి, రామకోటిరెడ్డి, బాలకొండారెడ్డి, మీరావలి, జక్రయ్య, సిద్ధయ్య, ఖాజావలి, మీరావలి, నాగార్జున, వెంకట్రావు, సాల్మన్‌రాజు, ఎలబినైజర్ చేరారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొమరోలు, జనవరి 17: కొమరోలు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే దారిలోని దుకాణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సుబ్బరాజు తెలిపారు. దుకాణంపై దాడులు నిర్వహించి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, పక్కన డిప్యూటీ కలెక్టర్ రమేష్ నాయుడు

సమాజ చైతన్యంలో

నాటక రంగ పాత్ర కీలకం

• ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

వీరన్నపాలెం(పర్చూరు), జనవరి 17: సమాజ చైతన్యంలో నాటక రంగ పాత్ర కీలకమని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామంలో కళానికేతన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి నాటక పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. పోటీల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతోపాటు, డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏలూరి మాట్లాడుతూ కళలను, కళారంగాన్ని ప్రోత్సహించాలన్న సంకల్పంతో వ్యయ ప్రయాసలను ఓర్చి గ్రామీణ ప్రాంతంలో జాతీయస్థాయిలో నాటిక పోటీలను ఏర్పాటు చేయటం హర్షించదగ్గ విషయమన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా గ్రామస్థులు కలసి కట్టుగా ఇలాంటి పోటీలను ఏర్పాటు చేయటం సంతోషదాయకం అన్నారు. డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘటనలను కళాకారులు తమ కళాప్రదర్శన ద్వారా కళ్ళకు కట్టినట్లు చూపటం ఇందుకు నిదర్శనమన్నారు. అనంతరం నాలుగు రోజుల నుంచి నిర్వహించిన నాటిక పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కొల్లా శివరాంప్రసాద్, గోరంట్ల రమేష్, రజని, చిట్టినేని సాయిబాబు, చిట్టినేని రామకృష్ణ, కొల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

దొనకొండ, జనవరి 17 : మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో సోమవారం నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌బుధవారం ఇండ్లచెరువు గ్రామంలో విచారణ చేపట్టారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు... ఇండ్లచెరువు ఎస్సీ కాలనీకి చెందిన పైడిపోగు మోషే గ్రామానికి చెందిన జి. అల్లూరయ్య వద్ద పదేళ్ల క్రితం అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు చెల్లించకపోవటంతో వడ్డీతో కలిపి రూ.1.50 లక్షకు గత ఏడాది నోటు రాసి ఇచ్చాడు. ప్రస్తుతం అల్లూరయ్య కుమారుడు శ్రీను మోషేకు ఫోన్‌చేసి డబ్బులు చెల్లించాలని అడిగే క్రమంలో ఇద్దరి మధ్య దుర్భాష జరిగింది. సాయంత్రం మోషే, అతని పిల్లలు వచ్చి శ్రీను కుటుంబ సభ్యులతో వాగ్వివాదం చేశారు. మరుసటిరోజు మోషే కుమారులు కిరణ్, రాజులు మోటార్ సైకిల్‌పై వస్తుండగా శ్రీను వారిని ఆపి మాట్లాడే క్రమంలో ఘర్షణ జరిగింది. శ్రీను, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు ముగ్గురు కిరణ్‌పై దాడి చేసి కులం పేరుతో తిట్టారన్న ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ కేసు నమోదైందని ఎస్సై సైదుబాబు తెలిపారు.

నేడు సెయింట్‌ఆన్స్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

చీరాల, జనవరి 17: చీరాలలోని సెయింట్‌ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో డిప్లమా 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వాల్యూ ఫ్రిక్షన్ మెటీరియల్ ఇండియా కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలునిర్వహించనున్నట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఐక్యంగా ముందుకు సాగాలి

వైసీపీ కేడర్‌కు మంత్రి సురేష్ పిలుపు • సింగరాయకొండలో కార్యకర్తలతో సమావేశం • సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు డుమ్మా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

సింగరాయకొండ, జనవరి 17 : వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగి వచ్చే ఎన్నికల్లో కొండపి నియోజకవర్గంలో పార్టీ జెండాను ఎగురవేయాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను 2008లో ఐఆర్‌ఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. 2009లో ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేగా చట్టసభలో అడుగుపెట్టానని గుర్తుచేశారు. ప్రజల దీవెనలతో వరుసగా మూడు పర్యాయాలు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యానన్నారు. నాల్గోసారి కొండపి నియోజవర్గానికి జగన్ పంపించారన్నారు. రాబోయే ఎన్నికలు వైసీపీ భవిష్యత్‌ను నిర్దేశించేవన్న విషయాన్ని నేతలు గుర్తించి పనిచేయాలని సూచించారు. నియోజకవర్గానికి సింగరాయకొండ గుండెకాయలాంటిదని ఇక్కడ వచ్చే మెజారిటీపైనే అభ్యర్థుల జయాపజయాలు ఆధారపడి ఉంటాయని తెలిపారు. ఈ నాలుగున్నరేళ్లలో గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు చేసిన కాంట్రాక్టు పనులకు సకాలంలో బిల్లులు రాక కొంతమేర ఇబ్బంది పడ్డారన్నారు. రాబోయే జగన్ ప్రభుత్వంలో ఇబ్బందులు లేకుండా చూస్తారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కొండపిలో తాను విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వైసీపీ వైద్యవిభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణమ్మ, ఎంపీపీ కట్టా శోభారాణి, వైసీపీ మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, శ్రీశైలం ట్రస్టుబోర్డు సభ్యుడు తన్నీరు ధర్మరాజు, నేతలు యన్నాబత్తిన చిన్న, శీలం రాము తదితరులు పాల్గొన్నారు.

మెజారిటీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గైర్హాజరు

మండలంలోని 10 పంచాయతీల్లో 9మంది వైసీపీ మద్దతు సర్పంచ్‌లు ఉండగా కేవలం శానంపూడి సర్పంచ్ మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. అలాగే వైసీపీ నుంచి 19 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా నలుగురు మాత్రమే వచ్చారు. మాగుంట వర్గానికి చెందిన కొందరు నాయకులు కూడా ముఖం చాటేశారు. సమావేశానికి హాజరైన నాయకులు కూడా పైకి మేమంతా ఒకటేనని చెప్పే ప్రయత్నం చేయగా వారి మధ్య అనైక్యత స్పష్టంగా కనిపించింది. యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శీలం రామును వేదికపైకి ఆహ్వానించినా వెళ్లకుండా ముభావంగా కిందే కుర్చున్నారు.

బహుమతుల ప్రదానం

టంగుటూరు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. టంగుటూరులో వైసీపీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ముగిశాయి. స్థానిక సొసైటీ ఆఫీస్ వద్ద మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవంలో మంత్రి సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పరిపాలన ప్రజలకు అనుకూలంగా ఉంది కనుకే ప్రజలు సంక్రాంతి వేడుకలను మరింత ఆనందంగా జరుపుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంబీసీ రాష్ట్ర డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, వైసీపీ నాయకులు బీనీడి ఉదయ్‌కుమార్, చిడిపోతు సుబ్బారావు, పమిడి హరికృష్ణ, అలెగ్జాండర్, ఎంపీటీసీ సభ్యుడు కొమ్ము ప్రభుదాస్, ఆదుదాం ఆంధ్ర కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి తుల్లిబిల్లి అశోక్‌బాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి





టంగుటూరు, మద్దిపాడులో ధర్నాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, మద్దతు తెలుపుతున్న నాయకులు

• కొనసాగుతున్న సమ్మె

టంగుటూరు, జనవరి 17: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రాము డిమాండ్ చేశారు. 37 రోజులుగా కార్యకర్తలు, ఆయాలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు కొనసాగిస్తున్న నిరసన శిబిరాన్ని రాము బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పండుగ రోజు అంగన్‌వాడీలను ప్రభుత్వం రోడ్డున పడేసిందన్నారు. వారిపై కనికరం చూపడం లేదన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరడమే తప్పా? ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేయడమే నేరమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మోజస్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు బి.శేషమ్మ, పి.క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని సీఐటీయూ నాయకుడు బంకా సుబ్బారావు పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడులో జరిగిన ధర్నాలో మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీలపై చిన్నచూపు చూస్తుందన్నారు. ఉబ్బా ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వంలో చలనం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో నాతాని ధనలక్ష్మి, లక్ష్మి, సుజాత, నాగలక్ష్మి, రజని తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ప్రైవేట్ బస్సు

- మార్టూరు సీఐకు తీవ్ర గాయాలు
- కారు డ్రైవరుకు స్వల్పగాయాలు
- నాయుడుపేట మండలం గుర్రప్పతోట వద్ద ప్రమాదం



నాయుడుపేట సమీపంలోని గుర్రప్పతోట వద్ద కారును ఢీకొన్న ప్రైవేట్ బస్సు (ఇన్‌సెట్లో) తీవ్రంగా గాయపడి కారులో చిక్కుకుపోయిన సీఐ అక్కేశ్వరరావు

మార్టూరు, జనవరి 17: అనంతపురం జిల్లాలో మంగళవారం జరిగిన ప్రధానమంత్రి మోదీ సభకు బందోబస్తుకు వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మార్టూరు సీఐ అక్కేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. కారు డ్రైవరు సర్దార్ అనే యువకుడు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం తిరుపతి జిల్లా నాయుడుపేట సమీపంలోని పెళ్లకూరు మండలం గుర్రప్పతోట గ్రామం సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ప్రధానమంత్రి సభ కార్యక్రమంలో బందోబస్తు ముగించుకొని మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఇన్నోవా కారులో మార్టూరుకు బయలుదేరిన సీఐ వాహనాన్ని ఎదురుగా ప్రయివేటు ట్రావెల్ బస్సు ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతినగా, కారులో ఉన్న సీఐ, కారు డ్రైవరు గాయాలకు గురయ్యారు. ఈ ప్రమాదంలో సీఐ ఎడమకాలు, కుడి చేతికి గాయాలయ్యాయి. అనంతరం ఈ ప్రమాదంలో గాయపడిన వారిద్దరిని నెల్లూరులోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. తరువాత మార్టూరు ఎస్సై ఎం. శ్రీనివాసరావు అపోలో ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. ప్రధానమంత్రి సభకు మార్టూరు స్టేషన్ నుంచి సీఐతో పాటు ఏఎస్ఐ బాషా, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హోం గార్డు బందోబస్తు నిమిత్తం వెళ్లారు.

కలవరపాటులో పోలీసులు

బందో బస్తుకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో సీఐ అక్కేశ్వరరావు గాయపడిన విషయం తెలియగానే మార్టూరు స్టేషన్‌లో పోలీసులు కలవరపాటుకు గురయ్యారు. వెంటనే ఎస్సై ఎం. శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి నెల్లూరు లోని అపోలో హాస్పిటల్‌కు వెళ్లారు. అదేవిధంగా స్టేషన్‌లోని మిగిలిన సిబ్బంది కూడా సీఐ ప్రమాదానికి గురయ్యారని ఆందోళనకు గురయ్యారు. రెండు నెలలు క్రితం సీఐగా అక్కేశ్వరరావు జాయిన్ అయ్యారు. అంతకు ముందు సీఐగా పని చేసిన ఫిరోజ్‌తో పాటు ఎస్సై కె. కమలాకర్, యద్దనపూడి ఎస్సై అనూక్, పర్చూరు ఎస్సై ప్రసాద్‌లు ఫాం 7 ఓట్లకు సంబంధించిన ఎన్నికల నిబంధనను అతిక్రమించారనే కారణంగా పోలీసు ఉన్నతాధికారులు వారిని సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈ సంఘటన జరిగిన తర్వాత కొత్త సీఐగా అక్కేశ్వరరావు, ఎస్సైగా శ్రీనివాసరావు జాయిన్ అయ్యారు. ఇపుడు సీఐ రోడ్డు ప్రమాదానికి గురవడంతో స్టేషన్ సిబ్బంది ఉలిక్కి పడుతున్నారు.

ఫణీంద్రాదేవికి ఎమ్మెల్యే బలరాం నివాళి

అద్దంకి, జనవరి17: మహిళాన్యాయవాది చిట్టాబత్తిన ఫణీంద్రాదేవికి పలువురు నివాళులు అర్పించారు. ఫణీంద్రాదేవి మంగళవారం విజయవాడలోని వైద్యశాలలో మృతి చెందగా బుధవారం అద్దంకిలో అంత్యక్రియలు జరిగాయి. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి బుధవారం ఉదయం ఫణీంద్రాదేవి మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఫణీంద్రాదేవి భర్త కనకసేనరావుతో ఉన్న సంబంధాలను గుర్తు చేశారు. టీడీపీ బాపట్ల జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు బత్తుల రామకోటయ్య, బొడ్డపాటి రవికుమార్,పెంట్యాల గంగాధర్, అడుసుమల్లి కిషోర్, కూరపాటి రామకోటేశ్వరరావు తదితరులు నివాళులు అర్పించారు. బార్ అసోసియేషన్ హాల్‌లో ఫణీంద్రాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, సుభాష్‌బాబు పాల్గొన్నారు.

వేమవరంలో పోలీస్ పికెట్

• తనిఖీ చేసిన సీఐ



పోలీస్ పికెట్‌ను తనిఖీ చేస్తున్న సీఐ నరసింహారావు

బల్లికురవ. జనవరి 17 : సార్వత్రిక ఎన్నికలు దగ్గరలో ఉన్నాయని, గ్రామాలలో కొత్త వ్యక్తులు ప్రవేశించి అలజడులు సృష్టించే ప్రమాదం ఉందని, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సంతమాగులూరు సీఐ నరసింహారావు సూచించారు. బుధవారం రాత్రి ఫ్యాక్షన్ గ్రామం అయిన వేమవరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం అక్కడ గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న పోలీస్ పికెట్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మద్యం అమ్మకాలు చేపట్టినా, జూదం నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించా రు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా పెంచుతామన్నారు. అలానే గ్రామాలలో రోడ్ల వెంబడి పెట్రోల్ అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. అలానే గ్రానైట్, మెటల్ క్వారీలలో బ్లాస్టింగ్‌లు అనుమతులు లేకుండా చేపడితే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అనంతరం బల్లికురవ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో ఎస్ఐ వి.వేమన పాల్గొన్నారు.



సంజాయిషీ నోటీసుల అందజేత



ఐసీడీఎస్ అధికారులకు సంజాయిషీ నోటీసులను అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

గిద్దలూరు, జనవరి 17 : అంగన్‌వాడీల సమ్మెను నిషేధిస్తూ వైసీపీ ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించిన విషయం తెలిసిందే. దానికి సంబంధించి సంజాయిషీ నోటీసులను ఐసీ డీఎస్ అధికారులకు అందచేశారు. ప్రభుత్వం ఎంత మొండిగా వ్యవహరించినా ఎస్మా లాంటి చట్టాలు ఎన్ని చేసినా సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెను వీడబోమని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వర్ణకుమారి, మున్నా స్పష్టం చేశారు. కార్యక్రమం లో సీఐటీయూ నాయకులు ఆవులయ్య, నరసింహులు పాల్గొన్నారు.

ఉప్పలపాడు పీహెచ్‌సీ సందర్శన

పొదిలి, జనవరి 17 : ఉప్పలపాడు పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మీ బుధవారం సందర్శించారు. ప్రసవాలు ఎక్కువగా జరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ టీకాలు సరైన సమయంలో వేయాలని సూచించారు. సిబ్బంది గ్రామాల్లో తిరుగుతూ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రస్తుతం జులుబు, అక్కడక్కడా జ్వరాలు ఉన్నాయని వారిని గుర్తించి వెనువెంటనే వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి ఆదేశించారు.

నీళ్ల ట్యాంకులు శిథిలం..!

- ప్రారంభానికి నోచుకోకుండానే కూలేందుకు సిద్ధం
- పథకం అమలులో వైసీపీ పాలకుల నిర్లక్ష్యం

పెద్ద దోర్నాల, జనవరి 17: ప్రారంభానికి నోచుకోకుండానే నీళ్ల ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పథకం అమలులో వైసీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా అవి నేల కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని జమ్మిదోర్నాల, చిన్నదోర్నాల, దోర్నాలలో కూరగాయల మార్కెట్ వద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో నిర్మించిన వాటర్ ట్యాంకులు పూర్తిగా పాడైపోయాయి.



కాంక్రీటు పోవడంతో కన్పిస్తున్న ఇనుపచువ్వలు

రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన నీళ్ల ట్యాంకులు కింది భాగంలోని పిల్లర్లు సిమెంటు కాంక్రీటు పోయి ఇనుపచువ్వలు బయట పడ్డాయి. ఎప్పుడు నేల కూలుతాయోనన్నట్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ప్రధానంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని నీళ్లట్యాంకు నిర్మాణం భయాందోళనలు కలిగిస్తోంది. విద్యార్థులు ఆ ట్యాంక్ వైపు ఏదో కారణంతో వెళ్లే అవకాశం మెండుగా ఉంది.

దూపాడు నుంచి సాగర్ జలాల కోసం నిర్మాణం

మండలంలోని ప్రజలను ఫ్లోరోసిస్ బారి నుంచి రక్షించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం 1996లో దూపాడు నుంచి దోర్నాలకు సాగర్ నీటిని అందించాలనే లక్ష్యంతో కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. ఈ పథకంలో భాగంగా చిన్నదోర్నాల, జమ్మిదోర్నాల, దోర్నాలలో ఈ నిర్మాణాలు చేశారు. కానీ పథకం లోపభూయిష్టంగా మారడంతో చుక్క నీటిని అందించలేదు. దీంతో ఏళ్లు గడిచాయే గాని ఆ పథకం అమలులోకి రాకపోవడంతో ప్రారంభించకుండానే నీళ్ల ట్యాంకులు పాడైపోయాయి. దొంగలు విలువైన ఇనుప చువ్వలను దోచుకెళ్లారు. గ్రామం బయట ఉన్న నీళ్లట్యాంకులు కూలితే కూలాయి. హైస్కూలులోని నిర్మాణం పడితే ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



దోర్నాల హైస్కూలులో కూలేందుకు సిద్ధంగా ఉన్న నీళ్ల ట్యాంక్



వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు

టీడీపీతోనే సంక్షేమం..అభివృద్ధి

- నల్లగుంట్లలో ఇంటింటి ప్రచారంలో ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, జనవరి 17 : అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ వైపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఎరిక్షన్‌బాబు ఇంటింటికీ తిరిగి ప్రజలకు టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. గతంలో చంద్రబాబు పాలనలో చేసిన అభివృద్ధి, పథకాల లబ్ధిని చెప్తూనే ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర అభివృద్ధి నాశనం అవడంతోపాటు ప్రజలు కష్టాలకోరల్లో చిక్కుకున్నారని తెలిపారు. పేదలకు మేలు చేసే అన్ని పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకొని చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవడం ద్వారా రాష్ట్రాన్ని బాగు చేసుకోవాలని, ప్రజలంతా సంతోషాలతో ఉండేలా చూడాలని కోరారు. ప్రధానంగా మహిళలకు పెద్దపీట వేస్తూ ఏడాదికి 3గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆడబిడ్డ ఉన్న ప్రతి కుటుంబంలో రూ.1500 ఇవ్వనున్నట్లు చెప్పారు. పేద మహిళలను ఆర్థికంగా బలవంతులను చేయాలన్నదే చంద్రబాబు లక్ష్యమన్నారు. రైతులకు ఏడాదికి పెట్టుబడి సాయంగా రూ.20వేలు, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు, ఇంటింటికీ కుళాయి, ఏటా ఉద్యోగావకాశాల కల్పనతో అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు నడిపేందుకు చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయనున్నారని తెలిపారు.

టీడీపీలోకి వైసీపీ మాజీ సర్పంచ్

ఎరిక్షన్‌బాబు క్లస్టర్ స్థాయిలో గ్రామ, భూత్ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వైసీపీ మాజీ సర్పంచ్ రామాంజనేయులు, పలువురు కార్యకర్తలు బుధవారం టీడీపీలో చేరారు. వైసీపీ పాలనలో ఐదేళ్లుగా ఎటువంటి అభివృద్ధి పనులు నిర్వహించకపోవడంతో మనస్తాపం చెంది టీడీపీలో చేరుతున్న ట్లు రామాంజనేయులు తెలిపారు. కార్యక్రమం లో నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, దేసు నాగేంద్రబాబు, ఎలకపాటి చంచయ్య, చల్లా వెంకటేశ్వర్లు,షేక్ బాషా, ఇస్మాయిల్, బట్టు సుధాకర్ రెడ్డి, ఆర్ సుబ్బరత్నం,శేఖర్, రామకృష్ణయ్య, మౌలాలి పాల్గొన్నారు.



ట్రాక్టర్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

కరోనాపై అప్రమత్తం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 17: ప్రజలు కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రజల సౌకర్యార్థం నూతనంగా మంజూరైన పారిశుధ్య వాటర్ ట్యాంకర్‌ను నాగార్జునరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, కొవిడ్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సాయం పొందాలన్నారు. రూ.20.80 లక్షలతో మంజూరైన ట్రాక్టర్, వాటర్ ట్యాంకు ద్వారా ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ ఇస్మాయిల్, అంజమ్మ, కమిషనర్ డి.రవీంద్ర, డీఈ షేక్ సుభానీ, ఏఈ ఆదినారాయణ, మేనేజర్ శ్రీనివాసన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రసూల్ పాల్గొన్నారు.

రోగులకు సురక్ష వైద్య పరీక్షలు

గిద్దలూరు, జనవరి 17 : పట్టణంలోని కోటగడ్డ ఆరోగ్య ప్రాథమిక వైద్యశాల ఆవరణలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. ప్రతి పేద కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకే పథకం లక్ష్యం అని పేర్కొన్నారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందచేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆర్.డి.రామక్రిష్ణ, దీపిక, కమిషనర్ రామక్రిష్ణయ్య, డాక్టర్ షరీఫ్, డాక్టర్ భార్గవరెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త ఆశయాలను కొనసాగించాలి

రాచర్ల, జనవరి 17 : ఇహ లోకంలో చిట్టచివరి ప్రవక్త అయిన మహమ్మద్ చెప్పిన విషయాలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉందని ముస్లిం మత గురువు మౌలానామహబూబ్ రెహమాన్ అన్నారు. మండలంలోని గుడిమెట్ట గ్రామంలో నూతన మసీద్‌ను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి నంద్యాల, కర్నూలు, ప్రకాశం జిల్లాల నుంచి ముస్లింలు పాల్గొన్నారు. రెహమాన్ మాట్లాడుతూ ప్రతి ముస్లిం మసీద్‌లలో 5 పూటలా నమాజ్ విధిగా చదవాలని, ఖురాన్ పఠించాలని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ ఖాశింబీ, షేక్ ఇస్మాయిల్, మౌలానాజవల్‌సాబ్, మౌలానా మహబూబ్ బాషా, ముత్తిరఫి, షఫీవుల్లా, అబ్దుల్‌హక్, అబ్దుల్‌రషీద్, షేక్ మహమ్మద్‌రఫి, షేక్ పల్నాటి మహబూబ్‌పీరా, షేక్ సలీమ్, షేక్ పటేల్, అబ్దుల్‌గని, షేక్ నాయబ్‌రసూల్, షేక్ ఇబ్రహీం, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొమరోలు, జనవరి 17: ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే దారిలోని దుకాణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ సుబ్బరాజు తెలిపారు. దుకాణంపై దాడులు నిర్వహించి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిర్వాహకుడిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

వైసీపీ పాలనలో రైతు కంట కన్నీరు

- టీడీపీ రాగానే అన్నదాతకు ఏటా రూ.20వేలు
- చిన్న ఓబినేనిపల్లెలో అశోక్‌రెడ్డి



బాబు ష్యూరిటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, జనవరి 17 : రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు జగన్‌రెడ్డి చేసిందేమీలేదని, వైసీపీ పాలనలో రైతు కంట కన్నీరే మిగిలిందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం బేస్తవారపేట మండలంలోని చిన్న ఓబినేనిపల్లె గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా చిన్న ఓబినేనిపల్లె గ్రామంలో అశోక్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తామన్నారు. అబద్ధపు హామీలతో వచ్చిన జగన్‌రెడ్డి రైతును నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొలాలకు ఉన్న మోటార్లకు మీటర్లు బిగించి అన్నదాత మెడలకు ఉరితాళ్లు బిగించారన్నారు. పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయా రన్నారు. చంద్రబాబు పాలనలో రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నట్లు అశోక్‌రెడ్డి గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు అధికారంలోకి రాగానే రైతులకు ప్రతి సంవత్సరం పెట్టుబడి సాయంగా రూ.20వేలను అందజేస్తామని అశోక్‌రెడ్డి తెలిపారు. టీడీపీ హయాంలో తలపెట్టిన నీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రతి రైతుకూ తాగునీటి కష్టాన్ని తీరుస్తామని తెలిపారు. నియోజకవర్గంలో నన్ను ఆశీర్వదించి టీడీపీ గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి,గుంటక నరశింహ యాదవ్,పూనూరు భూపాల్‌రెడ్డి, చెట్టిచెర్ల మాజీ స ర్పంచ్ తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి, బోయిళ్ల శ్రీనివాసరెడ్డి, బోయిళ్ల పరమేశ్వరరెడ్డి, సిద్దారెడ్డి వెంకటరామిరెడ్డి, దామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొంగలవీటి లక్ష్మీరెడ్డి, గోపు వెంకటరెడ్డి, పల్లెబోయిన కాటమరాజు పాల్గొన్నారు.

కోనపల్లె శ్రీలక్ష్మీతిరుమలనాథ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం సింగసానిపల్లెలో స్వామి ఊరేగింపు ఉత్సవంలో అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక కృషి అమోఘం

మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



డైరీని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జనవరి 17 : సమాజంలో తత్వాన్ని పరిశీలించే గుణాన్ని, ఆలోచించే శక్తిని పెంపొందించడంలో జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అమోఘమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక 2024 డైరీని ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా జేవీవీ రాష్ట్ర నాయకుడు స్వరూపారెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణం లక్ష్యంగా జేవీవీ పని చేస్తుందని, మూఢనమ్మకాలను నిరోధించడంలో, పర్యావరణ పరిరక్షణ, విద్య, ఆరోగ్యం, సామాజిక న్యాయం లాం టి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మం డ్ల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఎ.విశ్వరూపం, డివిజన్ నాయకులు డీజీ బ్రహ్మానందరెడ్డి, పి.సుధీర్‌కుమార్‌రెడ్డి, ఈశ్వర్‌కుమార్, వై.లక్ష్మీరెడ్డి, ఎస్.జయచంద్రరెడ్డి, ఈదుల వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

పుల్లలచెరువు, జనవరి 17 : వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పార్టీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ కోరారు. బుధవారం పుల్లలచెరువులో కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం ఏర్పా టు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చే స్తానని హామీ ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీరు ఇచ్చేది వైసీపీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనరు రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ కందుల వెంకటయ్యామాజీ ఎంపీపీ మర్తాల సుబ్బారెడ్డి, జేడ్పీటీసీ రామావత్ వాగ్యానాయక్, కె.రఘు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలిగొండపై వైసీపీకి చిత్తశుద్ధి లేదు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 17: వైసీపీ ప్రభుత్వానికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి చిత్తశుద్ధి లేదని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీ సుదర్శన్ విమర్శించారు. ఆప్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వెలిగొండపై జగన్‌రెడ్డితో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్తున్న అబద్ధపు మాటలు, చేతగాని హా మీలు ఇక చెల్లవన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.1000 కోట్లు కేటాయించాలన్నారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చే ర్చాలని, మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు చేయాలన్నా రు. ఈనెల 25 నుంచి 12 రోజుల పాటు పాదయాత్ర చేస్తామన్నారు. సమావేశంలో రమణయ్య, నవీన్ కుమార్ పాల్గొన్నారు.



శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

ఘనంగా శ్రీ కృష్ణదేవరాయల జయంతి

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 17: దేశ భాషలందు తెలుగు లెస్స అని చెప్పిన మహాత్ముడు శ్రీ కృష్ణదేవరాయలు అని ఏపీ యాదవ జేఏసీ కమిటీ చైర్మన్ పిన్నిక లక్ష్మీప్రసాద్ అన్నారు. బీసీ భవన్‌లో శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంఘం నాయకులు పా ల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతలు

రాచర్ల, జనవరి 17 : అయోధ్య రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని అక్కడి నుంచి వ చ్చిన అక్షతలను రాచర్లలో శంకర్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ నెల 22న ప్రతి ఇంట్లో దీపం వెలిగించి శ్రీ రామునికి పూజలు నిర్వహించి అక్షతలు తలపై వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అలిశెట్టి వెంకటేశ్వర్లు, తిరుమలశెట్టి వెంకటరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ జావీద్ అన్వర్

రైతు వ్యతిరేకి వైసీపీ

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 17: రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఇది రైతు వ్యతిరేకి పార్టీ అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సయ్యద్ జావీద్ అన్వర్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలిగా షర్మిలను నియమించటం పై హర్షం వ్యక్తం చేశారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలను నిర్వీర్యమయ్యాయన్నారు. వెలిగొండ ప్రా జెక్టు వెంటనే పూర్తి చేయాలని, మార్కాపురంను జిల్లా చేయాలని, వెంటనే రై తులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వెంకటరామిరెడ్డి, రామయ్య, రామిరెడ్డి, ఇస్మాయిల్, న్యాయవాదులు మతీన్ బాషా, దేవరాజ్, చక్రవర్తి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం

గిద్దలూరు, జనవరి 17 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి షర్మిల రాకతో పూర్వవైభవం రానున్నదని పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ కన్వీనర్ పగడాల రంగస్వామి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల పగ్గాలు తీసుకోనున్నదని కాంగ్రెస్ పథకాలే గెలిపిస్తాయని, రాబోయే రోజుల్లో పార్టీ మరింత పుంజుకుంటుందని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన



అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 17: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చే స్తున్న సమ్మె బుధవారం 37వ రోజు సాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు చెవులు మూ సుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. అంగన్‌వాడీలకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో వైసీపీ పాలకుల నిర్లక్ష్యాన్ని తూర్పారబట్టారు. సమ్మెలో వామపక్ష నాయకు లు, కాంగ్రెస్ నాయకులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

అఖిలపక్ష పార్టీల సంతకాల సేకరణ

పెద్ద దోర్నాల, జనవరి 17: సమస్యల పరిష్కారాన్ని కోరుతూ నిర్వహిస్తున్న సమ్మె బు ధవారం కొనసాగింది. ఈ క్రమంలో తమ న్యా యమైన సమస్యలు, ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు, గ్రాట్యుటీ, బీమా సౌకర్యం, 62 ఏళ్లకు ఉద్యోగ విరమణ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు సంతకాల సేకరణ చేపట్టారు. దీంతో టీడీపీ, జనసేన పార్టీలతోపాటు అఖిలపక్షాలు సంఘీభావం తెలియజేస్తూ సంతకాలు చేశారు. సంతకాలు చేసిన వారిలో దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, దేసు నాగేంద్రబాబు, ఎలకపాటి చెంచయ్య, బట్టు సుధాకర్ రెడ్డి, ఆర్.సుబ్బరత్నం, మౌ లాలి, షేక్ వలి తదితరులున్నారు.



సంతకాలను సేకరిస్తున్న అంగన్‌వాడీలు

దీక్షలో అం గన్‌వాడీలు సుబ్బమ్మ, ముంతాజ్‌బేగం, వెంకటరత్నం, వెంకటలక్ష్మి, రాణి, సుహాసిని, కుమారి పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు) : సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు అధికారులు నోటీసులు ఇవ్వడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ అన్నారు. బుధవారం పట్టణంలో ర్యాలీ చేశారు. సంతకాలను సేకరించి సీడీపీవో పద్మావతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు మల్లేశ్వరి, సుభాషిణి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బులు పాల్గొన్నారు.

పొదిలి : జగన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న 37వ రోజుకు చేరింది. ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అం గన్‌వాడీలు మా ట్లాడుతూ ఇంతదుర్మార్గంగా వ్యవహరించడం వైసీపీ పా లకులకు తగదన్నారు. వైసీపీ బెదిరింపు పాలనకు ఇంకెన్ని రోజులూ లేవన్నారు. ఒక్కచాన్స్‌తో వచ్చి అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులను జగన్‌రెడ్డి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పండగకూడా చేసుకోకుండా మా బిడ్డలను ఇ బ్బందులకు గురిచేసిన జగన్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్తా మన్నారు. అధికారం ఉందకదాని ఎస్మా ప్రయోగిస్తే మాకూ సమయం వచ్చినప్పుడు సత్తా చూపిస్తామన్నారు. ఇచ్చిన హామీల పరిష్కారం దిశగా వైసీపీ ప్రభుత్వం ముందుకు సాగకుండా బెదిరింపులకు దిగుతుందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కూడా లెక్కచేయకుండా వైసీపీ ప్రభుత్వం పాలన సాగిసుందని విమర్శించారు. హామీలు అమలు చేయాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీ సభ్యులకు మద్దతుగా, సీఐటీయూ, యూటీఎఫ్, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కనిగిరి అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు

మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

హెచ్‌ఎంపాడు, కనిగిరి మండలాల నుంచి భారీ చేరికలు

కనిగిరి, జనవరి 17 : కనిగిరి అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం కనిగిరి, హనుమంతునిపాడు మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర వారి మెడల్లో టీడీపీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం ఉగ్ర మాట్లాడుతూ పార్టీలో చేరిని ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి భారీ మెజార్టీ రాబట్టేందుకు కృషి చేయాలని కోరారు. తానెప్పుడూ పదవి కోసం పాకులాడలేదని, నిజాయితీగా కనిగిరి అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో జరిగిన అభివృద్ధికి సాక్ష్యాలున్నాయన్నారు. వైసీపీ వస్తే కనిగిరి మరింత అభివృద్ధి చెందుతుందని భావించి ఓట్లేసిన ప్రజానీకం నిలువునా మోసపోయిందని చెప్పారు. స్థానికేతరులకు అవకాశం ఇచ్చి గెలిపించినందుకు కనిగిరి ప్రాంతం అభివృద్ధిపై నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కనిగిరి మండలంలోని దిరిశవంచ గ్రామంలోని దళితకాలనీకి చెందిన 50 మంది వైసీపీని వీడి టీడీపీ నాయకులు నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారిలో కోలా కొండయ్య, వంగేపురం అంకయ్య, ప్రభుదాసు, చిన్నయ్య, రవి, సలోమన్, సంతోష్, మనోజ్‌లతోపాటు మరికొన్ని కుటుంబాలవారు చేరగా, బ్రహ్మయ్య, గారపాటి సుబ్బారావు, కోటయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా హనుమంతునిపాడు మండలంలోని లింగంగుట్ల గ్రామంలోని 41 కుటుంబాలు వైసీపీని వీడి మండల పార్టీ అధ్యక్షుడు సాని కొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బూచి బాలకోటిరెడ్డి, మాజీ సర్పంచ్ కాశమ్మ, కాట్నేని చెన్నయ్య, రాపతాటి ఓబులయ్య, బోజ్యం వెంకటేశ్వర్లు, కేతిరెడ్డి కొండారెడ్డి, అప్పిచెర్ల కొండారెడ్డి, శ్రీనివాసులు, బాలఅంకయ్య, కాశయ్య, వెంకటరెడ్డి, రామకోటిరెడ్డి, బాలకొండారెడ్డి, మీరావలి, జక్రయ్య, సిద్ధయ్య, ఖాజావలి, మీరావలి, నాగార్జున, వెంకట్రావు, రంగనాయకులు, సాల్మన్‌రాజు, ఎలబినైజర్, గురవయ్య పార్టీలో చేరారు.



టీడీపీలోకి చేరిన వారితో డాక్టర్ ఉగ్ర

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ



విచారణ నిర్వహిస్తున్నడీఎస్పీ

దొనకొండ, జనవరి 17 : మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో సోమవారం నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ బుధవారం ఇండ్లచెరువు గ్రామంలో విచారణ చేపట్టారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు... ఇండ్లచెరువు ఎస్సీ కాలనీకి చెందిన పైడిపోగు మోషే గ్రామానికి చెందిన జి. అల్లూరయ్య వద్ద పదేళ్ల క్రితం అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు చెల్లించకపోవటంతో వడ్డీతో కలిపి రూ.1.50 లక్షకు గత ఏడాది నోటు రాసి ఇచ్చాడు. ప్రస్తుతం అల్లూరయ్య కుమారుడు శ్రీను మోషేకు ఫోన్ చేసి డబ్బులు చెల్లించాలని అడిగే క్రమంలో ఇద్దరి మధ్య దుర్భాష జరిగింది. సాయంత్రం మోషే, అతని పిల్లలు వచ్చి శ్రీను కుటుంబ సభ్యులతో వాగ్వివాదం చేశారు. మరుసటిరోజు మోషే కుమారులు కిరణ్, రాజులు మోటార్ సైకిల్‌పై వస్తుండగా శ్రీను వారిని ఆపి మాట్లాడే క్రమంలో ఘర్షణ జరిగింది. శ్రీను, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు ముగ్గురు కిరణ్‌పై దాడి చేసి కులం పేరుతో తిట్టారన్న ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ కేసు నమోదైందని ఎస్సై ఎం సైదుబాబు తెలిపారు.

సంక్రాంతి క్రీడలతో యువకుల్లో మైత్రీభావం

పామూరు, జనవరి 17 : సంక్రాంతి సంబరాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆటల పోటీల నిర్వహణ ద్వారా క్రీడాకారుల మధ్య మైత్రీ భావం ఏర్పడుతుందని ఆర్గనైజింగ్ వ్యవస్థాపకులు ఆరేకొండ సురేష్ చెప్పారు. మండలంలోని నుచ్చుపొద గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా వివేకానంద యువ చైతన్య ఫోర్స్ ఆధ్వర్యంలో సభ్యులు పోకా హరికృష్ణ నేతృత్వంలో పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు పారిశ్రామికవేత్త దేవరపు హనుమంతరావు, గ్రామ ఉపసర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు, శీలం మాలకొండారెడ్డి, పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం రామస్వామిలు బుధవారం బహుమతులు అందజేశారు. లోకా పోకనాథం, కె.శ్రీనివాసులరెడ్డి, కె.రామకృష్ణ, కౌలూరి ఖాజారహంతుల్లా, ఆరేకొండ హరిప్రసాద్, జి. సురేంద్ర, కె. హజరత్, సూర్య, ఏ రమేష్‌బాబు, ఎం శ్రీహరి, బీ దిలీప్ పాల్గొన్నారు.

టీడీపీ నూతన కార్యాలయం ప్రారంభం



టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నేతలు

దొనకొండ, జనవరి 17 : దొనకొండలోని ప్రధాన రహదారిలోని బిల్డింగ్‌లో మండల టీడీపీ నాయకుడు వీవీకే చౌదరి, కామేపల్లి చెంచయ్యల నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు పార్టీ కార్యకలాపాల నిర్వహణకు ఉపయోగకరంగా ఉండేందుకు అనుకూలమైన ప్రాంతంలో కార్యాలయం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, నాయకులు తోటా కోటేశ్వరరావు, ఫణిదపు వీరాంజినేయులు, వేగినాటి అల్లూరయ్య, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, పురుషోత్తం సత్యానందం, మోడి అంజనేయులు, షేక్ సుభాని, జనసేన పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎం షఫీఉల్లాఖాన్(బాజి) పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పాత జ్ఞాపకాలను నెమరేసుకున్న

ప్రభుత్వ హైస్కూల్ 1984 టెన్త్ విద్యార్థులు



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కనిగిరి, జనవరి 17 : స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం 1984 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. తమ పాత జ్ఞాపకాలను, అనుభవాలను అందరూ నెమరేసుకున్నారు. దేశ, విదేశాల్లో ఉన్న అందరూ స్నేహితులు కనిగిరిలో కలసి తమ చిన్ననాటి సంఘటనలను గుర్తుకు తెచ్చుకుని గడిపారు. అమెరికాలో ఉన్న చలువాది మధు, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవోలు సుకుమార్, రమణారెడ్డి, రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ మాఘం శ్రీను, ఉడుముల వేణుగోపాల్‌రెడ్డి, భాషా, లతీఫ్, జహీర్, న్యాయవాది నాయబ్‌రసూల్, ఎలక్ట్రికల్ డీఈ ఖాజావలి, స్టేట్‌బ్యాంకు మేనేజర్ కే శ్రీను, డాక్టర్ విజయ్‌కుమార్, కే పెద్దన్న, తదితరులు తమ అభిమానాన్ని పంచుకున్నారు. పంచాయతీ అధికారి వేమూరి రామమోహన్, ఉపాధ్యాయులు పరశు సత్యగోపాల్, ఈదర శంకర్, తీట్ల నారాయణ, హరిబాబు, రమణ, మెడికల్ అధికారి మతుకుమల్లి భాస్కర్, జెరాక్స్ సెంటర్ నరసారెడ్డి వంటి మిత్రులు 60మంది వారి కుటుంబ సభ్యుల రాకతో ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నిండింది. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ రైతు జిల్లా అధికార ప్రతినిధి రాచమల్ల శ్రీనివాసులురెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లో సమావేశ మందిరానికి అవసరమైన సామగ్రిని అందిస్తామని ప్రస్తుత హెచ్‌ఎం, ఎంఈవోలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్తలు బాదం సత్యనారాయణ, బాలాజీ, బచ్చు శేఖర్, పార్థసారథి, సాంబశివరావు, శివశంకర్, ఫొటోగ్రాఫర్ గోపీకృష్ణ, బాంబ్‌స్కాడ్ ఆఫీసర్ మల్లికార్జున, కేఎంఆర్‌కే ప్రసాద్, గుజ్జుల బాలిరెడ్డి, గంగవరపు కిరణ్‌కుమార్, అన్నపరెడ్డి రమణారెడ్డి, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ గులాం, వెంకటేశ్వర్లు, పల్లి జగ్గయ్య, మీగడ వెంకటేశ్వర్లు, ఆర్‌టీసీ కొండయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అధికసంఖ్యలో తరలిరావాలి



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి, జనవరి 17 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. దర్శిలోని వారి స్వగృహంలో బుధవారం నియోజకవర్గ వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడలో ఈనెల 19వ తేదీన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన పార్టీలకు ఎన్నికల్లో విడిగా పోటీ చేసే దమ్ము, ధైర్యం లేకనే పొత్తులు పెట్టుకుంటున్నాయని విమర్శించారు. వైసీపీలో ఎలాంటి వర్గాలు లేవని, నాయకులు, కార్యకర్తలు అందరూ సీఎం వైఎస్ జగన్ వర్గమేనని చెప్పారు. దర్శి ఎంపీపీ సుధారాణి, ముండ్లమూరు, కురిచేడు జడ్పీటీసీ సభ్యులు ఆర్ రత్నంరాజు, నుసుం నాగిరెడ్డి, మాజీ ఎంపీపీలు వీరగంధం కోటయ్య, ఇత్తడి దేవదానం, మధుసూధన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు వెంకటరెడ్డి, కేవీ రెడ్డి, ఎస్సీసెల్ నాయకులు దేవప్రసాద్, పోలయ్య పాల్గొన్నారు.

తూర్పుగంగవరం టీడీపీ ఆధ్వర్యంలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు

తాళ్లూరు, జనవరి 17 : టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ 28వ వర్థంతి సందర్భంగా మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో బుధవారం ట్రాక్టర్ రివర్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మండల జనసేన అధ్యక్షుడు కూటాల ప్రసాద్‌లు ప్రారంభించారు. మొత్తం 48 మంది పాల్గొన్నారు. దోసకాయలపాడు గ్రామానికి చెందిన యండ్రపల్లి కృష్ణారెడ్డి(ప్రథమ స్థానం) రూ.8116, శివరాంపురం గ్రామానికి చెందిన వేమిరెడ్డి సుబ్బారెడ్డి (ద్వితీయస్థానం)రూ.6116, తాళ్లూరుకు చెందిన ఇడమకంటి రామిరెడ్డి(తృతీయస్థానం)రూ.4116లు దక్కించుకున్నారు. విజేతలకు మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ప్రోత్సాహక నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు కనిశెట్టి రామలక్ష్మయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కార్యనిర్వాహక సభ్యులు వల్లభనేని సుబ్బయ్య, శాగం కొండారెడ్డి, నేతలు గొల్లపూడి వేణుబాబు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, షేక్ మీరామొహిద్దీన్, కొత్తమారం పేరారెడ్డి, ఎమ్.వెంకటేశ్వరరెడ్డి, నుసుం ఆదిరామానారాయణరెడ్డి, జలాలుద్దీన్, అన్వర్, రావినూతల పరిశుద్ధరావు, పాలెపోగు రాజు, ఎబ్రాయిమ్, యాతం శ్రీనివాసరెడ్డి, గిరిబాబు పాల్గొన్నారు.

నేడు సాయిబాబా మందిరంలో అఖండ జ్యోతి ప్రజ్వలన

పామూరు, జనవరి 17 : స్థానిక పాత పోస్టాఫీస్ ఎదురుగల శ్రీషిరిడి సాయిబాబా మందిరంలో శ్రీగురురాం రతన్‌జీ బాబా ఆశీస్సులతో (దత్త కారుణ్యట్రస్ట్) ఆధ్వర్యంలో గురువారం అఖండజ్యోతి ప్రజ్వలన, మహాయజ్ఞం, జరుగుతుందని దేవస్థాన కమిటీ చైర్మన్ పబ్బత్తి వెంకటసుబ్బయ్య చెప్పారు. సాయినాథుని సచ్చరిత్ర, పారాయణం, సప్తసప్తాహ(49) రోజులు మహాయజ్ఞాన్ని శ్రీ సిద్ధయోగిని గురుమాతాజీ ప్రారంభిస్తారని తెలిపారు. మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డితో పాటు పుర ప్రముఖులు పాల్గొంటున్నారని వివరించారు.

డిమాండ్లు నెరవేర్చే వరకూ పోరాటమే



దర్శిలో ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర నేత వెంకటేశ్వరరెడ్డి

దర్శి, జనవరి 17 : న్యాయమైన డిమాండ్లు అమలు చేసే వరకు పోరాటం కొనసాగుతోందని సీఐటీయూ దర్శి నియోజకవర్గ కార్యదర్శి టి. రంగారావు స్పష్టం చేశారు. ఆందోళనలో భాగంగా కార్యకర్తలు బుధవారం 37వ రోజు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు తిరుపతమ్మ, అజిత, ప్రశాంతి, బాలమ్మ, నిర్మల, నాగమణి, మల్లేశ్వరి రంగమ్మ, లక్ష్మీదేవి, సుబ్బమ్మ, వెంకటరమణ, సీఐటీయూ నాయకులు సందు వెంకటేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి

కనిగిరి, జనవరి 17 : అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు కొనసాగిస్తున్న రిలే దీక్షలకు ఆయన మద్దతు ఇస్తూ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అంగన్వాడీలపై ఎస్మా చట్ట ప్రయోగం చట్ట విరుద్ధమని చెప్పారు. ఎన్నికలకు ముందు సీఎం జగన్‌రెడ్డి ఇచ్చిన హామీల ప్రకారం వేతనాల పెంపుతో పాటు, ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీసీ కేశవరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, భాగ్యలక్ష్మీ, సీత, రజని, రామసుబ్బులు, సౌందర్య, సుజాత, ఐద్వా మహిళలు ప్రసన్న, శాంతకుమారి, జేవీవీ నాయకులు జీ శ్రీనివాసులు, నరేంద్రలు పాల్గొన్నారు.

కిరాణామర్చంట్, సంతూర్ సౌజన్యంతో ముత్యాల ముగ్గుల పోటీలు



బహుమతులు అందజేస్తున్న ఎస్సై రమణయ్య,సెబ్ఎస్సై ఆంజనేయులు

తాళ్లూరు, జనవరి 17 : సంక్రాంతి సందర్భంగా మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో సంతూర్, కిరాణామర్చంట్ సౌజన్యంతో బుధవారం ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ఎస్సై వై.వి.రమణయ్య అద్దంకి సెబ్ఎస్సై ఎస్.ఆంజనేయులు, కిరాణమర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సోమా ప్రసాద్‌లు బహుమతులను అందజేశారు. గ్రామంలోని బొద్దికూరపాడు రహదారిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 52 మంది మహిళలు పాల్గొని ముగ్గులను తీర్చిదిద్దారు. సోమా నాగమణి, ఊటుకూరి సుకన్యలు(ప్రథమ స్థానం), ఆరుగురు(ద్వితీయ స్థానం), 9మంది(తృతీయస్థానాలను)సాధించారు. సంతూర్‌వారు ప్రథమ స్థానం పొందిన విజేతలకు గ్రైండర్, సఫారి సూట్‌కేస్‌లను, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంతూర్ డిస్ట్రిబ్యూటర్ మణికంఠ, కిరాణమర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు సోమా ప్రసాద్ పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతీక సంక్రాంతి



బహుమతులు అందచేస్తున్న టీడీపీ రాష్ట్ర నేత అడుసుమల్లి

పామూరు. జనవరి 17 : సంస్కృతి, సంప్రదాయాలకు సంక్రాంతి ఆటల పోటీలు ప్రతీక అని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల కమిటీ రాష్ట్ర కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి చెప్పారు. మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో సంక్రాంతి ఆటలపోటీల్లో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ విజేతగా నిలిచిన అనపర్తి శ్రీనివాస్, పోలినేని తిరుపతయ్య, రన్నర్‌గా రాధాకృష్ణ, తిరుపతిలు నిలిచారు. విజేతలకు గ్రామానికి చెందిన డీఎంకే రాయుడు, పీ బాలమురళికృష్ణ, కేఎల్ చౌదరి, కమ్మ లక్ష్మణ్‌లు బహుమతులు అందజేశారు.

ఎలాంటి లోపాలు లేకుండా కులగణన సర్వే చేపట్టాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 17 : జిల్లాలో ఈ నెల 19నుంచి జరగనున్న కులగణన సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఈ సర్వే నిర్వహణపై బుధవారం మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ప్రజల సామాజిక, ఆర్థికస్థితిగతులపై సమగ్ర వివరాలు సేకరించాలన్నారు. సర్వే సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా వివరాలను నమోదు చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, ఈ దిశగా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు అవసరమైన సన్నాహక సమావేశాన్ని మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో గురువారం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈనెల 19నుంచి 28వతేదీ వరకు పది రోజుల పాటు సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయాలని, అనివార్య కారణాల వల్ల ఈ పదిరోజుల పాటు స్థానికంగా అందుబాటులో లేని ప్రజలు తమ వివరాలను ఈ నెల 29నుంచి ఫిబ్రవరి 2 వరకు తమ పరిధిలోని సచివాలయంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కుల సంఘాల నాయకులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

ప్రణాళికలు తయారు చేయాలి

ముండ్లమూరు, జనవరి 17 : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నివేదికలు తయారు చేయాలని ఎంపీడీవో బీ శంకరరావు చెప్పారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో ప్రణాళికలు తయారు చేసి ఈనెలాఖరు కల్లా అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీదేవి పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ వర్ధంతికి భారీగా ఏర్పాట్లు

ముండ్లమూరు, జనవరి 17 : టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముండ్లమూరు, ఉల్లగల్లు, బొప్పూడివారిపాలెం, తూర్పుకంభంపాడు, సింగనపాలెం, శంకరాపురం తదితర గ్రామాల్లో ఆ వేడుకలు నిర్వహించేందుకు నేతలు తలమునకలయ్యారు.

అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి

పొదిలి, జనవరి 17 : అందరి భాగస్వామ్యంతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో శ్రీకృష్ణ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో 2024-2025 సంవత్సరానికి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులతోపాటు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పంచాయతీలు అభివృద్ధి పథంలో నడవాలంటే ప్రజలు భాగస్వాములు కావాలన్నారు.





● నరసరావుపేట ప్రాంతంలో అధిక వర్షాలకు దెబ్బతిన్న మిరప పంట



ప్రయోగాలు ప్రహసనం

ఇంటర్ కళాశాలల్లో అరకొరగానే ల్యాబులు

- సౌకర్యాలు, పరికరాలపై పట్టించుకోని బోర్డు
- ల్యాబు ఫీజు పేరుతో ప్రైవేటు యాజమాన్యాల దోపిడీ
- ప్రయోగ పరీక్షా కేంద్రాల్లో తూతూమంత్రంగా వార్షిక తనిఖీలు



గుంటూరు(విద్య), జనవరి 17: ఇంటర్ మీడియట్ సైన్సు గ్రూపుల విద్యార్థులకు ఆయా సబ్జెక్టులతో పాటు ప్రయోగ పాఠాలు కూడా ముఖ్యమే. అయితే పలు కళాశాలల్లో ల్యాబులు, పరీక్షలు ఓ ప్రహసనంగా మారాయి. మొదటి సంవత్సరం నుంచి కళాశాలల్లో ప్రయోగాలకు సంబంధించి బోధన చేయాలి. ద్వితీయ సంవత్సరంలో వాటికి సంబంధించి పరీక్షలు ఉంటాయి. ఇందులో భాగంగా ఇంటర్ మీడియట్ కళాశాలల్లో ప్రత్యేకంగా ల్యాబులు, ప్రయోగ రసాయనాలు, పరికరాలు, బోధకులు తప్పనిసరి. అయితే అరకొర కళాశాలల్లోనే ఇంటర్ బోర్డు నిబంధనలకు అనుగుణంగా ల్యాబులు ఉంటున్నాయి. అనేక ప్రైవేటు కళాశాలల్లో ల్యాబులే ఉండవు. ఆయా కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రయోగాలు అంటే ఏమిటో కూడా తెలియదంటే ఆశ్చర్యం కాదు. ఒకవేళ ఏదైనా కళాశాలలో పేరుకే ల్యాబు ఉంటుంది.. అందులో అవసరమైన పరికరాలు ఉండవు.. ఇక బోధకలు అసలే ఉండరు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో వారంలో ఒక రోజు ల్యాబుల్లో ప్రయోగాలు చేయించాలని నిబంధనలు ఉన్నా యాజమాన్యాలు మాత్రం సంవత్సరం చివర వరకు ల్యాబుల్లో వారిని అడుగుపెట్టనీయడం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లోని ల్యాబుల్ని వార్షికంగా తనఖీ చేయాల్సిన ఇంటర్ బోర్డు మిన్నకుండి పోతున్నదనే ఆరోపణలున్నాయి. ల్యాబుల్లో సరైన పరికరాలు ఉన్నాయా? ఉంటే వాటి పనితీరు ఎలా ఉంది? విద్యార్థులు ఉపయోగించాల్సిన రసాయనాలు, వాటిని ఎలా ఎంత మోతాదులో ఉపయోగించాలి. వచ్చిన ఫలితాన్ని ఎలా నమోదు చేయాలి అనే విషయాలు స్పష్టంగా రికార్డుల్లో నమోదు చేయాలి. ఇందుకోసం కెమిస్ట్రీ, ఫిజిక్స్, బోటనీ తదితర సబ్జెక్టుల్లో నిష్ణాతులైన అధ్యాపకుల్ని ఓ కమిటీగా నియమించి పరిశీలన చేయించాలి. అయితే ఇవేమి పట్టించుకోకుండానే ఇంటర్ బోర్డు పరీక్షలు నిర్వహిస్తుందనే ఆరోపణలున్నాయి.

వచ్చే నెలలో ప్రయోగ పరీక్షలు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దాదాపు 48 వేల మంది ఉన్నట్లు సమాచారం. ఇంటర్ బోర్డు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి రెండోవారం నుంచి ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి. ఇందు కోసం మొత్తం 140పైగా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు షెడ్యూల్ వారీగా పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించడం లేదనే ఆరోపణలున్నాయి. అసలు ప్రయోగాలు అంటే ఏమిటో తెలియకుండా సైన్సు గ్రూపుల విద్యార్థులు ఏమి పరీక్షలు రాస్తారో ఎవరికీ తెలియదు.

ఇక్కడ వసూళ్లు.. అక్కడ చెల్లింపులు..

ఇంటర్ బోర్డు నిర్వహించే ప్రయోగ పరీక్షలకు ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు భారీగానే ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఇంటర్ బైపీసీ విద్యార్థుల నుంచి రూ.1500, ఎంపీసీ విద్యార్థుల నుంచి రూ.1000 చొప్పున కొన్ని కళాశాలలు వసూలు చేస్తున్నాయి. ల్యాబ్ ఫీజు పేరుతో వసూలు చేసే ఈ మొత్తంలో సగం ఇంటర్ బోర్డుకు అనధికారికంగా చెల్లించి, మరికొంత పరీక్షల సమయంలో వచ్చే ఇన్విజిలేటర్లకు చెల్లిస్తారనే ఆరోపణలున్నాయి. ఫలితంగా ప్రయోగ పరీక్షల్లో ఇన్విజిలేషన్ చూసీ చూడనట్లు ఉంటారనే ఆరోపణలున్నాయి. ఇలా ఏటా ప్రయోగ పరీక్షలు ఓ ప్రహసనంగా నిర్వహిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ధీమా ఇవ్వని బీమా

ప్రకృతి పంటల సాగుకు సహకరించడంలేదు. తీవ్ర వర్షాభావం.. కుండపోత వర్షాలు ఇలా అతి వృష్టి, అనావృష్టి రైతులను దారుణంగా దెబ్బతీశాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట డిసెంబరు నెలలో కురిసిన అతి భారీ వర్షాలకు వర్షార్పణం అయింది. సాధారణం కన్నా వెయ్యింతల అధిక వర్షపాతం పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో నమోదైంది. మిరప పంటకు అపార నష్టం వాటిల్లింది. ఈ తరుణంలో రైతులకు వాతావరణ ఆధారిత బీమా పథకం నుంచి పరిహారం అందించాలి. అయితే అధికారులు కానీ, ప్రభుత్వం కానీ బీమా విషయంలో పట్టీపట్టనట్లు వ్యవహ రిస్తున్నారు. పల్నాడు జిల్లాలో సాధారణ వర్షపాతం కన్నా 4969.88 శాతం, బాపట్ల జిల్లాలో 3348.35 శాతం, గుంటూరు జిల్లాలో 6567.86 శాతం అత్యధికంగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ నివేదికలు తెలియజేస్తున్నాయి.

- తీవ్రంగా నష్టపోయిన మిర్చి రైతులు
- బీమా గురించి పట్టించుకోని అధికారులు
- డిసెంబరు నెలలో రెట్టింపు వర్షపాతం నమోదు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని ప్రవేశ పెట్టింది. దానిలో మిర్చి పంటను కూడా చేర్చింది. సాధారణ పంటల బీమాకు, వాతావరణ ఆధారిత బీమాకు పూర్తిగా వ్యత్యాసం ఉంది. సాధారణ పంటల బీమా అమలులో సాగు చేసిన పంటలో 33 శాతం పూర్తిగా పంట దెబ్బతింటేనే నష్ట పరిహారం చెల్లిస్తారు. వాతావరణ ఆధారిత బీమ పథకం అలా ఉండదు. ఈ బీమా పథకం కింద అధిక వర్షపాతం, అధిక ఉష్ణోగ్రత, అధిక గాలి, సాధారణం కంటే తక్కువ వర్షపాతం, తేమ వంటి ప్రతికూల పరిస్థితుల కారణంగా కలిగే పంట నష్టాలకు బీమా వర్తిస్తుంది. వాతావరణ శాఖ వర్షపాతం నివేదికల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేస్తారు. అధిక వర్షాలు కురిసి పంటలు దెబ్బతింటే పరిహారం చెల్లిస్తారు. తీవ్ర వర్షాభావం వలన కలిగే నష్టాలకూ పరిహారం అందిస్తారు. పంట వివిధ స్టేజ్‌లలో అధిక వర్షాలు, వర్షాభావం వలన కలిగే నష్టాన్ని నమోదు చేయాల్సి ఉంది. పంటకు బీమా ప్రీమియం చెల్లించే ప్రతి రైతు ఈ పథకం కింద అర్హులే. రైతుల తరుపున తామే బీమా ప్రీమియం చెల్లిస్తున్నామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అంతే కాకుండా ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ చేయించుకున్న ప్రతి రైతు పంటల బీమాకు అర్హుడని ప్రకటించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు మిరప సాగు చేసిన రైతులందరికీ ఈకేవైసీ పూర్తి చేసినట్లు ఉద్యాన శాఖ అధికారులు ప్రకటించారు. అంటే మిర్చి సాగు చేసిన రైతులందరికీ బీమా వర్తించినట్లే. అధికారిక లెక్కల ప్రకారం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 1,89,770 ఎకరాల్లో మిరప సాగైంది. అత్యధికంగా పల్నాడు జిల్లాలో 1,25,881 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో 25,337 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 38,550 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ సంవత్సరం మిరప మొక్కలు నాటిన నాటి నుంచి తీవ్ర వర్షాభావం నెలకొంది. అంతే కాకుండా డిసెంబరు నెలలో అతి భారీ వర్షాలు కురిశాయి. ఇలా రెండు విధాలా మిరప రైతులు నష్టపోయారు. మిరప తొలికాపు దశలో అధిక వర్షాలు కురిశాయి. దీని వలన దిగుబడులను కోల్పోయారు. ఎకరాకు సగటున 30 శాతంకు పైగా మొక్కలు ఎండి పోయి ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ళ వరకు దిగుబడులను రైతలు కోల్పోయారు.

అతి భారీ వర్షాలు.. తీవ్ర వర్షాభావం

డిసెంబరు 5,6 తేదీల్లో అతి భారీ వర్షాలు కురిశాయి. ఈ రెండు రోజుల్లో పల్నాడు జిల్లాలో సాధారణ వర్షపాతం 3.22 మీ.మీ కాగా 163.25 మీ.మీ వర్షపాతం నమోదైంది. 4969.88 శాతం అధికంగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. బాపట్ల జిల్లా సాధారణ వర్షపాతం 5.77 మీమీ కాగా 198.97 మీమీ వర్షపాతం నమోదైంది. 3348.35 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. గుంటూరు జిల్లాలో సాధారణ వర్షపాతం 2.52 మీమీ కాగా168.03 వర్షపాతం నమోదైంది. 6567.86 శాతం అధికంగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అక్టోబరు నెలలో తీవ్ర వర్షాభావం నెలకొంది. పల్నాడు జిల్లాలో సాధారణ వర్షపాతం 118.21 మీమీ కాగా 22.34 మీ.మీ వర్షపాతం నమోదైంది. 81.1 శాతం లోటు వర్షపాతం నెలకొంది. బాపట్ల జిల్లాలో సాధారణ వర్షపాతం 171.92 మీ.మీ కాగా 34.43 మీ.మీ వర్షపాతం నమోదైంది 79.97 శాతం లోటు వర్షపాతం నమోదైంది. గుంటూరు జిల్లాలో సాధారణ వర్షపాతం 128.8 మీ.మీ కాగా 25.9 మీ.మీ వర్షపాతం నమోదు కావడంతో 79.89 శాతం లోటు వర్షపాతం నెలకొంది. అక్టోబరులో తీవ్ర లోటు వర్షపాతం, డిసెంబరు నెలలో వేల రెట్ల అధిక వర్షపాతం నమోదు కావడంతో మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇలా జరిగిన పంట నష్టం వాతావరణ ఆధారిత బీమా కిందకు వస్తుంది. వాతావరణ శాఖ వర్షపాతం నివేదికలు ఆధారంగా, పంట నష్టం కోసం మిరపకు ఉద్యాన శాఖ నివేదికలు పంపించాల్సి ఉంటుంది. ఈ దిశగా సదరు శాఖ స్పందిస్తున్న దాఖలాలు లేవు. వాతావరణ బీమా పథకం కింద పరిహారం అందుతుందా లేదా అన్న ఆందోళన బాధితుల రైతుల నుంచి వ్యక్తమవుతున్నది. అధిక వర్షాల వలన పంటలను కోల్పోయిన రైతులకు బీమా ఆదుకునే అవకాశం ఉన్నా ఈ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. వాతావరణ బీమా కింద మిరపకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

సున్నా వడ్డీకి.. సున్నాయేనా..?

- ఖరీఫ్ ముగిసినా కరుణించని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 54 వేల మందికి శఠగోపం
- ఎన్నికల కోడ్ సమీపిస్తోన్నా నిధుల విడుదలపై మౌనం
- రైతులకు దక్కాల్సిన రూ.16 కోట్లకు పంగనామాలు



గుంటూరు సిటీ, జనవరి 17: ఆరుగాలం రెక్కల కష్టంపై ఆధారపడుతూ.. ప్రకృతి వైపరీత్యాలను.. అతి వృష్టి.. అనావృష్టిలని ఎదుర్కొని అందరికీ అన్నం పెడుతున్న రైతులపై వైసీపీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. అన్నదాతలకు కల్పించే చిన్నా చితక ప్రయోజనాలపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. సున్నా వడ్డీ పథకానికి నాలుగేళ్లకే నూరేళ్లు నిండినట్లు కనిపిస్తోంది. ఖరీఫ్ సీజన్ దాటిపోయినా వడ్డీ రాయితీ సొమ్మును రైతుల ఖాతాల్లో ఇంతవరకు జమ చేయలేదు. నేడో రేపో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నప్పటికీ సున్నా వడ్డీ నిధులపై ప్రభుత్వం మితిమీరిన మౌనాన్ని ప్రదర్శిస్తుంది. ఆయా జిల్లాల నుంచి సున్నా వడ్డీ రాయితీ పొందేందుకు అరులైన రైతుల వివరాలు అధికార యంత్రాంగం సిద్ధం చేసి పంపింది. అయినా నిధుల విడుదల విషయాన్ని ఉన్నతాధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 54 వేల మంది రైతుల రాయితీ ప్రయోజనంపై దెబ్బపడింది. రైతులు తీసుకున్న పంట రుణాల పై పూర్తిగా వడ్డీ మాఫీ చేయడం సున్నా వడ్డీ పథకం ముఖ్య ఉద్దేశం. రైతు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గొప్పగా ప్రకటించారు. 2020లో సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభించారు. ప్రారంభించిన రెండేళ్లు హడావుడి చేశారు. మూడో ఏడాది నుంచి నిధుల విడుదల నత్తనడకన సాగగా, నాలుగో ఏట అసలు నిధుల విడుదల ప్రస్తావనే లేకుండా పోయింది. ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తుందన్న ఆశతో రైతులు పంటలు పండినా పండక పోయినా అప్పు చేసి మరీ బ్యాంకులకు రుణాలు చెల్లించారు. గుంటూరు జిల్లాలో 12,208 మంది, పల్నాడు జిల్లాలో 23,271 మంది, బాపట్ల జిల్లాలో 18,227 మంది రైతులు సకాలంలో రుణాలను బ్యాంకులు, సహకార సంఘాలకు చెల్లించారు. వీరంతా సున్నా వడ్డీ కింద లబ్ధి పొందేందుకు అర్హులేనని వ్యవసాయ శాఖ జాబితా సిద్ధం చేసింది. ప్రతి ఏటా పంట సీజన్ ముగిసే నాటికి రైతుల ఖాతాల్లో వడ్డీ డబ్బులు జమవుతాయని అప్పట్లో ముఖ్యమంత్రి బహిరంగంగా ప్రకటించారు. రైతులు సకాలంలో రుణం చెల్లిస్తే సరిపోతుంది వడ్డీ సొమ్ము ఖాతాల్లో జమ అవుతుందని బీరాలు పలికారు. లక్ష రూపాయల వరకు రుణాలు తీసుకున్న వారికి వడ్డీ మొత్తం ప్రభుత్వం చెల్లిస్తుందని ఊదరగొట్టారు. ఈ లెక్కన 2022 -2023 ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులకు అక్షరాల రూ.16 కోట్లు ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. గుంటూరు జిల్లాలో రూ.3 కోట్ల 40 లక్షలు, పల్నాడు జిల్లాలో రూ.7 కోట్ల 19 లక్షలు, బాపట్ల జిల్లాలో రూ.5 కోట్ల 20 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంది. సీజన్ ముగిసినా ఏ ఒక్క రైతు ఖాతాలో రూపాయి కూడా జమ కాలేదు.

'కోడ్' కూస్తే అనుమానమే

సున్నా వడ్డీ నిధులపై అధికార యంత్రాంగం ఏమీ చెప్పలేక పోతుంది. ఇప్పటికే జాబితాలు పంపినప్పటికీ వాటిని పూర్తిగా పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు కనిపించటం లేదని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ వస్తే సున్నా వడ్డీ నిధుల విడుదల అనుమానమేనని అంటున్నారు.

ఓటర్ల జాబితాల విడుదలకు చర్యలు

- పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన
- రాజకీయ నేతలతో కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, జనవరి 17: ఓటర్ల తుది జాబితా విడుదలకు యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 22న తుది ఓటర్ల జాబితాలను విడుదల చేస్తామన్నారు. అన్ని నియోజకవర్గాలలో వచ్చిన 2,06,672 దరఖాస్తులను పరిశీలించామని, 1,69,644 దరఖాస్తులను విచారించామన్నారు.. 30,699 దరఖాస్తులను తిరస్కరించగా 6,329 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నూతన ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, సవరణల కొరకు వచ్చిన దరఖాస్తులను అత్యంత పారదర్శకతతో పరిశీలిస్తున్నామన్నారు. రాజకీయపార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దివ్యాంగులు, వృద్ధుల కొరకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంప్‌లు నిర్మిస్తున్నామని చెప్పారు. సమావేశంలో డీఆర్వో పి.వెంకటరమణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్, బీజేపీ నాయకులు రామకృష్ణ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు దోనేపూడి రవి, వైసీపీ నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, టీడీపీ నాయకులు గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



రాజకీయపార్టీల నాయకులతో సమావేశమైన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

జిల్లావ్యాప్తంగా గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఏఎస్పీ పి.మహేష్‌కు చెప్పారు. పరేడ్‌గ్రౌండ్, కలెక్టరేట్‌లో సుందరీకరణ పనులకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌ను ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలియజేసే స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులకు, ఉద్యోగులకు సేవా పతకాలు, అవార్డులు ప్రదానం జరుగుతుందన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈవో రామారావుకు సూచించారు. సమావేశంలో జేసీ శ్రీధర్, డీఆర్వో వెంకటరమణ, డీఆర్‌డీఏ పీడీ సి.కృష్ణ, డ్వామా పీడీ డాక్టర్ బి.అర్జునరావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, వ్యవసాయశాఖ జేడీ షేక్.అబ్దుల్ సత్తార్, పశుసంవర్థక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్యశాఖ జేడీ పి.సురేష్, పౌరసరఫరాలశాఖ అధికారి విలియమ్స్, జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు రైల్వే పశ్చిమ టెర్మినల్ ప్రారంభం

ఇక అరండల్‌పేట వైపు నుంచి కూడా రాకపోకలు

గుంటూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే స్టేషన్ వెస్టు టెర్మినల్ ప్రయాణికులకు అందు బాటులోకి వచ్చింది. నూతనంగా నిర్మించిన ఈ టెర్మినల్‌ని ఎలాంటి హంగు, ఆర్భాటం లేకుండా రైల్వే శాఖ ప్రారంభించింది. దీంతో ప్రయాణికులకు రెండు వైపుల నుంచి ప్రవేశించే సదుపాయం కల్పించినట్లైంది. అన్‌రిజర్వుడ్ టిక్కెట్ల జారీకి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. అలానే ఇప్పటి వరకు అరండల్‌పేట ఒకటో లైనులో బుక్ స్టాల్స్ మధ్య ఉన్న ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ కౌంటర్లని వెస్టు టెర్మినల్‌లోకి తీసుకొచ్చేశారు. దీంతో ప్రయాణికులు రిజర్వేషన్ టిక్కెట్ల బుకింగ్ కోసం వెస్టు టెర్మినల్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది. దాదాపుగా రూ.29 కోట్ల వరకు వెచ్చించి అధునాతన సౌకర్యాలను వెస్టు టెర్మినల్ వైపు కల్పించారు. లిఫ్టులు, ఎస్కలేటర్ల ఏర్పాటుతో ప్రయాణికులు సులభతరంగా ప్లాట్‌ఫాంల పైకి చేరుకోవచ్చు. అలానే సువిశాలమైన పార్కింగ్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అమరావతి సంస్కృతి ఉట్టిపడేలా స్టేషన్ పశ్చిమ వైపు భవనాన్ని తీర్చిదిద్దారు. వెస్టు టెర్మినల్ ప్రయాణికులకు కొత్త అనుభూతిని పంచుతుందని రైల్వే డివిజనల్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు.

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

భారీగా నిర్వహణకు తెలుగు తమ్ముళ్ల సన్నాహాలు

పలు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు, అన్నదానం ఏర్పాటు



నేతలతో సమావేశమైన జనార్దన్

ఒంగోలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 28వ వర్ధంతి గురువారం జరగనుంది. జిల్లావ్యాప్తంగా ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు భారీగా నిర్వహణకు తెలుగు తమ్ముళ్లు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతి ఏటా తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు పెద్దఎత్తున జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న తరుణం కావడంతో ఈసారి పార్టీ నేతలు మరింత ఎక్కువగా వర్ధంతి కార్యక్రమంపై దృష్టిసారించారు. జిల్లావ్యాప్తంగా నియోజకవర్గ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ముఖ్య నేతలు అంతా ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లాలో ఇంచుమించు అన్ని గ్రామాలతోపాటు పట్టణాల్లోని పలు వార్డులు, కాలనీల్లో ఇప్పటికే ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలతో పాటు చిత్రపటాలు ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించేలా సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలతోపాటు రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఆయా ప్రాంతాల్లో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు జరగనున్నాయి. ఒంగోలు నగరంలో దాదాపు పది, పన్నెండు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరగనుండగా ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై ముఖ్యనేతలు బుధవారం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జీ, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో సమావేశమై చర్చించారు. స్థానిక గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఈ సమావేశం జరగ్గా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులతో పాటు పార్టీ కార్యాలయం వద్ద జరిగే రక్తదాన శిబిరం, సభలు విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఇతర నియోజకవర్గాల్లోనూ భారీగా ఈ విడత వర్ధంతి నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు.

అవ్వకు అవస్థ

పింఛన్ కోసం పడిగాపులు

8 నెలలుగా తిరుగుతున్నా కనికరించని అధికారులు



తరిట కమల

కంభం, జనవరి 17 : ఇద్దరు కొడుకులు ఉన్నా ప్రయోజకులు కాలేదు. దీంతో ఎలాంటి ఆధారం లేక నోటిలోకి ముద్ద వెళ్లడమే గగనమైంది. పింఛన్ కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇది ఒక దీనురాలి స్థితి. బుధవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి 65ఏళ్ల వృద్ధురాలు వస్తుండటం చూసి ఆంధ్రజ్యోతి పలుకరించింది. నా పేరు తరిట కమల. నాకు 65 సంవత్సరాలు. కంభం పంచాయతీ పరిధిలోని నేదరవీధిలో ఉంటున్నాను. ఇద్దరు కొడుకులున్నా వారు ప్రయోజకులు కాలేదు. బతుకు భారమై వృద్ధాప్య, లేదా వితంతు పింఛన్ ఇప్పించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నాను. అటు సచివాలయానికీ, ఇటు ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ కనికరించడం లేదు. నా భర్త పెద్దవెంకటేశ్వర్లు కూరగాయలు అమ్ముతూ పోషించేవారు. ఆయన 8 నెలలక్రితం మృతిచెందారు. దీంతో ఆయనకొచ్చే వృద్ధాప్య పింఛన్ నిలిచిపోయింది. అప్పటి నుంచి తనకు పింఛన్ ఇప్పించాలని కాళ్లరిగేలా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కనికరించడం లేదు. ఆయన పోయాక పూట గడవడం కష్టంగా మారింది. అధికారులను అడిగితే నీకు కచ్చితంగా పింఛన్ వస్తుందన్నారు. నేటికీ దిక్కులేదు. జనవరిలో కొత్త పింఛన్ల లిస్టులో నా పేరు లేదు. అధికారుల వద్ద సమాధానం లేదని ఆవేదనతో చెప్పారు. దరఖాస్తు చేసుకుంటే పింఛన్ ఇస్తామని చెప్తున్న వైసీపీ పాలకులు తన కష్టం తెలుసుకొని పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని అవ్వ కోరుతున్నది.

లారీ డ్రైవర్‌కు ఐదేళ్లు జైలు

ఒంగోలు(క్రైం), జనవరి17: నిర్లక్ష్యంగా లారీ నడిపి ఆరుగురు మృతికి, 12 మందికి గాయాలు అయ్యేందుకు కారణమైయిన డ్రైవర్ విన్నకోట రమేష్‌కు ఐదేళ్ల జైలు, రూ.1000లు జరిమానా విధిస్తూ అదనపు జిల్లా న్యాయాధికారి శివకుమార్ బుధవారం తీర్పునిచ్చారు. ఈపూరుపాలెంనకు చెందిన లారీ డ్రైవర్ రమేష్ 2013 ఆగస్టు 18న చీరాల నుంచి ఒంగోలు వైపు లారీ నడుపుతూ ఘోర ప్రమాదానికి కారణమయ్యాడు. తొలుత ఓ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టి రెండు ఆటోలను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆరుగురు చనిపోయారు. 12 మంది గాయపడ్డారు. ఈమేరకు నాగులుప్పలపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పదేళ్ల తరువాత నిందితుడుకి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వచ్చింది. ప్రాసిక్యూషన్ తరుపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్వాలా జాస్మిన్ తమ వాదనలు వినిపించారు.

కనిగిరి అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు

మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్చార్జి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

హెచ్ఎంపాడు, కనిగిరి మండలాల నుంచి భారీ చేరికలు



టీడీపీలోకి చేరిన వారితో డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 17 : కనిగిరి అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం కనిగిరి, హనుమంతునిపాడు మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర వారి మెడల్లో టీడీపీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం ఉగ్ర మాట్లాడుతూ పార్టీలో చేరిని ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి భారీ మెజార్టీ రాబట్టేందుకు కృషి చేయాలని కోరారు. తానెప్పుడూ పదవి కోసం పాకులాడలేదని, నిజాయితీగా కనిగిరి అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో జరిగిన అభివృద్ధికి సాక్ష్యాలున్నాయన్నారు. వైసీపీ వస్తే కనిగిరి మరింత అభివృద్ధి చెందుతుందని భావించి ఓట్లేసిన ప్రజానీకం నిలువునా మోసపోయిందని చెప్పారు. స్థానికేతరులకు అవకాశం ఇచ్చి గెలిపించినందుకు కనిగిరి ప్రాంతం అభివృద్ధిపై నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కనిగిరి మండలంలోని దిరిశవంచ గ్రామంలోని దళితకాలనీకి చెందిన 50 మంది వైసీపీని వీడి టీడీపీ నాయకులు నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారిలో కోలా కొండయ్య, వంగేపురం అంకయ్య, ప్రభుదాసు, చిన్నయ్య, రవి, సలోమన్, సంతోష్, మనోజ్‌లతోపాటు మరికొన్ని కుటుంబాలవారు చేరగా, బ్రహ్మయ్య, గారపాటి సుబ్బారావు, కోటయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా హనుమంతునిపాడు మండలంలోని లింగంగుట్ల గ్రామంలోని 41 కుటుంబాలు వైసీపీని వీడి మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బూచి బాలకోటిరెడ్డి, మాజీ సర్పంచ్ కాశమ్మ, కాట్నేని చెన్నయ్య, రాపతాటి ఓబులయ్య, భోజ్యం వెంకటేశ్వర్లు, కేతిరెడ్డి కొండారెడ్డి, అప్పిచెర్ల కొండారెడ్డి, శ్రీనివాసులు, బాలఅంకయ్య, కాశయ్య, వెంకటరెడ్డి, రామకోటిరెడ్డి, బాలకొండారెడ్డి, మీరావలి, జక్రయ్య, సిద్ధయ్య, ఖాజావలి, మీరావలి, నాగార్జున, వెంకట్రావు, రంగనాయకులు, సాల్మన్‌రాజు, ఎలబినైజర్, గురవయ్య పార్టీలో చేరారు.

బాలినేనితో రాజీ.. మాగుంటకు చెక్

ఆ భూముల్లో అభివృద్ధి పనులకు ఉత్తర్వులు

కొనుగోలుకు మాత్రం ఇంకా విడుదల కాని నిధులు

ఒంగోలు ఎంపీ పేరెత్తనివ్వని జగన్

బాలినేనితో పాటు కుమారుడి సీటు కోసం చర్చ?

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఎట్టకేలకు ముఖ్యమంత్రి జగన్‌కి జిల్లాలో ఆ పార్టీ సీనియర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డికి మధ్య రాజీ కుదిరింది. ఈ ఇద్దరి రాజీలో మరో సీనియర్ నాయకుడు, ఒంగోలు ఎంపీ మాగుంటను పక్కకు నెట్టేశారు. బాలినేని కోరిక మేరకు ఇళ్లస్థలాల పంపిణీకి అవసరమైన భూమి కొనుగోలుకు హామీ ఇచ్చారు. అంతేగాక ఆ భూముల అభివృద్ధికి నిధుల విషయంలో హడావుడిగా ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం నిధులు మంజూరుకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. అదే సమయంలో బాలినేని రాజకీయ డిమాండ్లపై పూర్తి స్పష్టత రాలేదని తెలుస్తోంది. బాలినేనితో పాటు ఆయన కుమారుడు ప్రణీత్‌ను కూడా ఎన్నికల రంగంలోకి తెచ్చే ప్రయత్నం జరుగుతుందని ఈ వ్యవహారంపై కిందిస్థాయిలో కసరత్తు అనంతరం రెండురోజుల్లో జగన్ తుదిరూపు ఇవ్వబోతున్నారని సమాచారం. దీంతో తాత్కాలికంగా బాలినేని వ్యవహారం ఓ కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తున్నా ఇంకా వేచి చూడాల్సిన పరిస్థితులు మాత్రం నెలకొన్నాయి.

వచ్చి కలవండి

గత కొంతకాలంగా రాజకీయంగా తనను పక్కనపెట్టారన్న భావనతో బాలినేని పార్టీ అధిష్ఠానంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. సంక్రాంతికి ముందు మూడురోజులు ఆయన విజయవాడలో మకాం వేసినా జగన్‌ను కలిసే భాగ్యం లభించక అలిగి వెళ్లిపోయాడు. అయితే ఆ తర్వాత జిల్లాలో జరిగిన కొండపి, ఎస్ఎన్‌పాడు సమావేశాలకు ఆయన అనుచరులు గైర్హాజరు కావటం ఇతర చోట్ల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మంత్రులు సురేష్, నాగార్జునలు సీఎం వద్దకెళ్లి బాలినేని విషయంపై వత్తిడి తేవటం తదితర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి స్వయంగా ఫోన్ చేసి వచ్చి కలవాలని ఆహ్వానించటంతో బుధవారం బాలినేని విజయవాడ వచ్చి కలిశారు.

మాగుంట విషయంలో కస్సుబుస్సు

బాలినేని సీఎంను కలవగానే ఆయన ఎంపీ మాగుంట విషయమై కస్సుబుస్సు లాడినట్లు తెలిసింది. 'ఆయన ఎప్పటి నుంచి తెలుసు నీకు, ఎప్పటి నుంచి బంధువు, ఏమి చేయగలడు ఆ పార్టీలో (టీడీపీ) రెండు స్థానాల్లో పోటీ చేస్తాడట. చేయనివ్వండి చూద్దాం' అంటూ ఆయన పేరెత్త అని తెగేసి చెప్పినట్లు తెలిసింది. ఆ తర్వాత బాలినేని కూడా ఆ విషయాన్ని వదిలేసినట్లు సమాచారం. 'ఒంగోలులో ఇళ్లపట్టాల పంపిణీ జరిగితే పోటీ చేస్తావు, లేకపోతే గిద్దలూరులో పోటీచేస్తావు అంతేకదా రెండురోజుల్లో నిధులొచ్చేస్తాయి వెళ్లు ఆ తర్వాత మాట్లాడుకుందాం' అని కూడా సీఎం అన్నట్లు తెలిసింది. ఆ తర్వాత బాలినేని ఇటు ఐప్యాక్ ప్రతినిధి అటు సీఎంఓ ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డిలను కలిసి నివాసస్థలాల పంపిణీ, తన రాజకీయ డిమాండ్లపై మాట్లాడినట్లు సమాచారం.

ఒంగోలులో కదిలిన ఫైలు

ఈ నేపథ్యంలో నివాసస్థల పట్టాల పంపిణీకి సంబంధించి ఒంగోలులో కలెక్టరు ఆగమేఘాలపై కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. భూమి కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా రూ.170 కోట్లు రావాల్సి ఉంది. ఆ నిధులను రెండు దఫాలుగా ఇవ్వమని సీఎం ఆదేశించారని చెప్తున్నారు. అదేసమయంలో కలెక్టరు 402 ఎకరాల భూమిలో మౌలిక వసతుల కల్పన కోసం రూ.21.33 కోట్ల విలువైన పనుల నిర్వహణకు అనుమతులిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. తద్వారా బాలినేని డిమాండ్‌కనుగుణంగా సీఎం ఆదేశంతో ఈ విషయంలో కదలిక ప్రారంభమైనట్లు కనిపిస్తోంది. అయితే భూమి కొనుగోలు పూర్తికాకుండా మౌలిక సదుపాయాల కల్పన పనుల నిర్వహణకు భూయజమానులు సహకరించే అవకాశం లేదు. దీంతో ప్రభుత్వం నిధులిచ్చి వాటిని భూయజమానులకు చెల్లిస్తేనే పనుల్లో ముందడుగుకు అవకాశం ఉంది. కాగా జనవరి నెలాఖరు సమీపిస్తుండటం ప్రతినెలా చివర్లో ఇతరత్రా ఖర్చులను ఆపేసి ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పింఛన్ల చెల్లింపుకు ప్రభుత్వం నిధులు సమకూర్చుకోవటం గత నాలుగున్నరేళ్లగా జరుగుతున్న తంతు. ఈ స్థితిలో ఇప్పటికిప్పుడు ఈ భూమి కొనుగోలుకు ప్రభుత్వం నిధులు ఇవ్వగలిగేనా? అన్న సందేహాలు లేకపోలేదు.

రాజకీయ డిమాండ్లపై తర్జనభర్జన

బాలినేని పెట్టిన రాజకీయ డిమాండ్లపై మాత్రం తర్జనభర్జన జరుగుతున్నట్లు తెలిసింది. ఆ విషయంలో తుదినిర్ణయం గురువారం జరిగే అవకాశం ఉంది. ఇళ్లపట్టాల పంపిణీ జరిగితే మీరు ఒంగోలులోనే పోటీచేస్తారు. ఇక ఎంపిక ఇప్పటికీ పూర్తికాని నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై మీ అభిప్రాయాలపై విజయసాయితో కూర్చుని చర్చించండి. మార్పులు చేర్పులు అవసరం అనుకున్న చోట్ల ఎమ్మెల్యేలు, ఇన్చార్జిలను పిలిపించండి, గురువారం సాయంత్రం అన్నీ ఫైనల్ చేద్దామని జగన్ అన్నట్లు సమాచారం. ఆ మేరకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలు, మరికొందరు ఇన్చార్జిలకు గురువారం తాడేపల్లి రావాలని సమాచారం ఇస్తున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగా కనిగిరి, మార్కాపురం ఎమ్మెల్యేలను కూడా తాడేపల్లి రావాలని కోరినట్లు సమాచారం. అద్దంకి వైసీపీ మాజీ ఇన్చార్జి చైతన్య, దర్శి ఎమ్మెల్యే వేణుగోపాల్‌లతోపాటు ఆశావహుల్లోని మరికొందరు బుధవారమే బాలినేనితో పాటు విజయవాడలో ఉన్నారు. మాగుంటకు చాన్స్ లేదని చెప్పిన జగన్ ఎంపీ అభ్యర్థి ఎంపికపై కూడా గురువారం లేదా శుక్రవారం నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. అయితే రెడ్డి సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని భావించినట్లు సమాచారం.

తిరుగు ప్రయాణంలోనూ తిప్పలే..!

సంక్రాంతి ప్రభావంతో రవాణా వ్యవస్థకు డిమాండ్

కిటకిటలాడుతున్న బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు

రేపు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు భారీగా పొదుపు

సభ్యులు తరలింపు

జిల్లా నుంచి 200 ఆర్టీసీ బస్సులు అంబేడ్కర్ సభకు కేటాయింపు

దూరప్రాంతాల వారికి తప్పని ప్రయాణ కష్టాలు

తిరుగు ప్రయాణంలోనూ తిప్పలు తప్పడం లేదు. మూడు రోజులపాటు పండుగ సంబరాలలో మునిగి తేలిన ప్రజలు ఉద్యోగాలు, చదువుల కోసం నగరాలకు, ఇతర ప్రాంతాలకు బయలుదేరారు. బుధవారం నుంచి తిరుగు ప్రయాణాలు ప్రారంభమయ్యాయి. పిల్లా పాపలు ఉండటంతో రిజర్వేషన్ల కోసం ప్రయత్నించినా ఈనెల 19వ తేదీ వరకు లభించే పరిస్థితి లేదు. ఆర్టీసీతో పాటు ట్రావెల్స్‌లోనూ టిక్కెట్లన్నీ ఫుల్. దీంతో ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారు. ఇదిలా ఉండగా, రేపు విజయవాడలో జరగనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు జిల్లాలోని ఐదు డిపోల నుంచి 200 బస్సులు కేటాయించారు. ఇప్పటికే గ్రామాలకు తరలించడంతో ప్రయాణికుల పాట్లు మరింత ఎక్కువ కానున్నాయి.

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 17 : సంక్రాంతి ప్రభావంతో రవాణా వ్యవస్థలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. పండుగ మూడు రోజులు సొంతూర్లలో బంధువులు, తల్లిదండ్రులతో ఆనందంగా గడిపి, ఉద్యోగ, ఉపాధి, చదువుల నిమిత్తం తిరిగి ఊర్లకు వెళ్లేందుకు అందరూ సిద్ధమయ్యారు. అయితే తిరుగుప్రయాణంలో ఉద్యోగులు, విద్యార్థులు, యువతలకు కష్టాలు తప్పడం లేదు. గత పదిహేను రోజుల నుంచి రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ప్రైవేటు రవాణా సౌకర్యాలన్నింటిలో రిజర్వేషన్ నిల్.. బోర్డులు దర్శనమివ్వగా వారంరోజుల నుంచి ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. ప్రతి ఒక్కరు పల్లెల నుంచి పట్టణాలకు పయనం కావడంతో ప్రధాన రహదారులన్నీ ట్రాఫిక్‌తో కిటకిటలాడగా, గ్రామాలు బోసిబోతున్నాయి.

ప్రైవేటుకు డిమాండ్

అయితే ఆర్టీసీలోని ఓల్వో, ఇంద్ర, సూపర్ లగ్జరీ, స్లీపర్, గరుడా వంటి బస్సుల్లో ఇప్పటికే రిజర్వేషన్ పూర్తికావడంతో ప్రైవేటు ప్రయాణం తప్పని పరిస్థితులయ్యాయి. రైలు ప్రయాణించడానికి రిజర్వేషన్లు లేవు. ఆర్టీసీలో ప్రయాణించేందుకు టిక్కెట్లు దొరక్క తిరిగి నగరాలు, పట్టణాలకు వెళ్లేందుకు ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రైవేటు ట్రావెల్స్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇదే అవకాశంగా ట్రావెల్స్ వారు కూడా భారీగా ధరలు పెంచి టిక్కెట్లు అమ్ముతున్నారు. కొందరైతే పాత బస్సులను సిద్ధం చేసి పంపుతున్నారు. రాత్రికి నగరాలకు పోవడం, ఉదయాన్నే ఖాళీగా తిరిగి రావడం కూడా చేస్తున్నారు. అలాగే హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం వంటి దూరప్రాంతాలకు వెళ్లేందుకు సౌకర్యవంతమైన ప్రయాణంగా ప్రైవేటు కార్లపై పలువురు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కార్ ట్రావెల్స్ వారు సైతం భారీగా బాడుగులు పెంచేశారు. ఫలితంగా ఒక కుటుంబం హైదరాబాద్ వెళ్లడానికి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు వ్యయం చేయాల్సి వస్తుంది.

పల్లె వెలుగుల కోసం పడికాపులు

పల్లెల నుంచి పట్టణాలకు వెళ్లేందుకు జిల్లాలో అధికశాతం ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులే ఆధారం. అయితే పండుగ సందర్భంగా ఆర్టీసీ యంత్రాంగం కొన్ని ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో అప్పుడప్పుడు వచ్చే పల్లెవెలుగు బస్సు కోసం జనం పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. జిల్లాకేంద్రమైన ఒంగోలుకు ఎలాగోలా చేరుకుంటే ప్రైవేటు ట్రావెల్స్ దొరుకుతాయన్న ఆశతో ఎదురు చూసే పల్లెల్లో ఉన్న జనానికి ప్రస్తుత పండుగ సీజన్‌లో నిరాశే ఎదురవుతోంది. కాస్త కండిషన్‌లో ఉండే బస్సులను అవసరం మేరకు గుంటూరు, నెల్లూరు, విజయవాడలకు నడుపుతున్న పరిస్థితి. దీంతో పల్లెలకు ట్రిప్పులు తగ్గిపోతున్నాయి. దీంతో నిన్న మొన్నటి వరకు గ్రామీణ ప్రాంత ప్రయాణికులు లేక వెలవెలబోయిన బస్‌స్టాప్‌లు పండుగ ప్రభావంతో రద్దీగా కనిపిస్తున్నాయి.

పల్లెవెలుగు బస్సులన్నీ విజయవాడకే

రేపు విజయవాడలో జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభకు ప్రభుత్వం భారీగా జనసమీకరణ చేయాలని ప్రభుత్వ ఆదేశాలతో మెప్మా, డీఆర్‌డీఏ, పొదుపు సంఘాలను సిద్ధం చేశారు. అందులోభాగంగా ప్రతి పొదుపు సభ్యురాలు ఖచ్చితంగా పాల్గొనాలని హుకుం జారీ చేయడంతోపాటు అందుకనుగుణంగా ఆర్టీసీ బస్సులు కేటాయించాలని అధికారులకు ఆదేశాలు అందాయి. ఇప్పటికే 200 బస్సులు ఆయా గ్రామాలకు పంపించగా, గురువారం పొదుపు సంఘాలతో ముందస్తుగా సమావేశం ఏర్పాటు చేశారు.



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

విగ్రహావిష్కరణ సభ విజయవంతం కోసం ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు హడావుడి చేస్తుండగా, ఇప్పటికే పండుగకు సొంతూరు వచ్చి తిరిగి వెళ్ళే వారికి సరిపడినన్ని బస్సులు లేవు. దీంతో ప్రయాణికులుకు పాట్లు తప్పడం లేదు. బోలెడంత లగేజి, పిల్లలతో తలిదండ్రులు నానాఅగచాట్లు పడుతున్నారు. ఈనెల 19వ తేదీ వరకు ఇదే పరిస్థితి ఉండటంతో దూరప్రాంత ప్రయాణికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

ఎలాంటి లోపాలు లేకుండా కులగణన సర్వే చేపట్టాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 17 : జిల్లాలో ఈనెల 19నుంచి జరగనున్న కులగణన సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఈ సర్వే నిర్వహణపై బుధవారం మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ప్రజల సామాజిక, ఆర్థికస్థితిగతులపై సమగ్ర వివరాలు సేకరించాలన్నారు. సర్వే సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా వివరాలను నమోదు చేయడంలో క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, ఈ దిశగా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు అవసరమైన సన్నాహక సమావేశాన్ని మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో గురువారం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈనెల 19నుంచి 28వతేదీ వరకు పది రోజుల పాటు సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్ళి వివరాలు నమోదు చేయాలని, అనివార్య కారణాల వల్ల ఈ పదిరోజుల పాటు స్థానికంగా అందుబాటులో లేని ప్రజలు తమ వివరాలను ఈనెల 29నుంచి ఫిబ్రవరి 2 వరకు తమ పరిధిలోని సచివాలయంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. స్థానికంగా ఉంటున్న కుల సంఘాల నాయకులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మండల అధికారులందరూ తమకు కేటాయించిన గ్రామాలను ప్రతి రోజు సందర్శించాలని, సూపర్‌వైజర్లు కూడా ప్రతిరోజు ఫీల్డ్‌లో ఉండేలా పర్యవేక్షించాలని చెప్పారు. ఈనెల 19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రతి సచివాలయం నుంచి ప్రజలు తరలివెళ్ళేలా రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు ముగిసిన చోట ఘనంగా ముగింపు వేడుకలు నిర్వహించి విజేతలైన క్రీడాకారులను అభినందించి నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు బి.జాలిరెడ్డి, వసుంధర, రవికుమార్, ఉషారాణి పాల్గొన్నారు.

నమ్మిన ప్రజలను నట్టేట ముంచిన జగన్

కొండపి ఎమ్మెల్యే స్వామి ధ్వజం

పొందూరు (టంగుటూరు), జనవరి 17 : నమ్మిన ప్రజలను ముఖ్యమంత్రి జగన్ నట్టేట ముంచారని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. సంక్రాం తి సంబరాల్లో భాగంగా మండలంలోని పొందూరులో కనమర్లపూడి మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలుగు యువత వివిధ పోటీలు నిర్వహించింది. మంగళవారం రాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే స్వామి పాల్గొని మాట్లాడారు. ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్ నిత్యావసరాల ధరలను ఆకాశానికి ఎక్కించారని విమర్శించారు. మద్యం, ఇసుక, మైనింగ్‌లో కోట్లు కొల్లగొట్టి ప్రజలను నిలువునా దగా చేశారని ఆరోపించారు. మద్యపాన నిషేధం తెస్తానని చెప్పి ఓట్లు దండుకొని అధికారం చేతికి రాగానే నాసిరకం మద్యం సరఫరా చేసి మందుబాబుల ప్రాణాలను హరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వమే ప్రజలతో వ్యాపారం చేసే స్థాయికి దిగజారిందన్నారు. అధికారం తలకెక్కి దౌర్జన్యాలు, దోపిడీలు నిరంతరం కొనసాగిస్తున్నదన్నారు. జగన్ నిజస్వరూపం తెలుసుకున్న ప్రజలు రానున్న ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించి ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సర్పంచ్ పిల్లి కోటిలింగం, ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఏరువ ఆనందరావు, మాజీ సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేజండ్ల బలరాం, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలో విజేత నంద్యాల ఎడ్లజత



ఎడ్లను అదిలిస్తున్న జనార్దన్, పక్కన ఎంఎం కొండయ్య, ఎమ్మెల్సీ శ్రీకాంత్, బాలాజీ, నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, జనవరి 17 : మండలంలోని కాకుటూరు బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలో నంద్యాల జిల్లా డోన్ గ్రామానికి చెందిన ధర్మవరం వెంకటసుబ్బారెడ్డికి చెందిన ఎడ్లజత విజేతగా నిలిచి మొదటి బహుమతి రూ.1,10,000 సాధించాయి. ఈ పోటీలలో జూనియర్, సీనియర్ విభాగాలలో 25 ఎడ్లజతలు పాల్గొన్నాయి. కృష్ణా జిల్లాకు చెందిన మేకా కృష్ణమోహన్‌కు చెందిన ఎడ్లజత ద్వితీయ స్థానంలో నిలిచి రూ.90 వేలు బహుమతి సాధించాయి. బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి చౌదరికి చెందిన ఎడ్లజత తృతీయ స్థానంలో నిలిచి మూడవ బహుమతి రూ.70 వేలు దక్కించుకున్నాయి. విజేతలకు ఇంటూరి నాగేశ్వరావు బహుమతులు అందజేశారు. టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, దివి శివరాం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చీరాల ఇన్చార్జి ఎంఎం కొండయ్య ఉన్నం నళినీదేవి పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో ట్రాక్టర్ రివర్స్ పోటీలు

తాళ్లూరు, జనవరి 17 : టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో బుధవారం ట్రాక్టర్ రివర్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మండల జనసేన అధ్యక్షుడు కూటాల ప్రసాద్‌లు ప్రారంభించారు. మొత్తం 48 మంది పాల్గొన్నారు. దోసకాయలపాడు గ్రామానికి చెందిన యండ్రపల్లి కృష్ణారెడ్డి(ప్రథమ స్థానం) రూ.8116, శివరాంపురం గ్రామానికి చెందిన వేమిరెడ్డి సుబ్బారెడ్డి (ద్వితీయస్థానం)రూ.6116, తాళ్లూరుకు చెందిన ఇడమకంటి రామిరెడ్డి(తృతీయస్థానం)రూ.4116లు దక్కించుకున్నారు. విజేతలకు మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ప్రోత్సాహక నగదును అందజేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షులు కనిశెట్టి రామలక్ష్మయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కార్య నిర్వాహక సభ్యులు వల్లభనేని సుబ్బయ్య, శాగం కొండారెడ్డి, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు, పక్కన డిప్యూటీ కలెక్టర్ రమేష్ నాయుడు

సమాజ చైతన్యంలో నాటక రంగ పాత్ర కీలకం

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

వీరన్నపాలెం(పర్చూరు), జనవరి 17: సమాజ చైతన్యంలో నాటక రంగ పాత్ర కీలకమని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామంలో కళానికేతన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి నాటక పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. పోటీల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు, డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏలూరి మాట్లాడుతూ కళలను, కళారంగాన్ని పోత్సహించాలన్న సంకల్పంతో వ్యయ ప్రయాసలను ఓర్చి గ్రామీణ ప్రాంతంలో జాతీయస్థాయిలో నాటిక పోటీలను ఏర్పాటు చేయటం హర్షించదగ్గ విషయం అని అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా గ్రామస్థులు కలసి కట్టుగా ఇలాంటి పోటీలను ఏర్పాటు చేయటం సంతోషదాయకం అన్నారు. డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘటనలను కళాకారులు తమ కళాప్రదర్శన ద్వారా కళ్ళకు కట్టినట్లు చూపటం ఇందుకు నిదర్శనమన్నారు. ఆనంతరం నాలుగు రోజుల నుంచి నిర్వహించిన నాటిక పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో కొల్లా శివరాంప్రసాద్, గోరంట్ల రమేష్, రజని, చిట్టినేని సాయిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టినేని రామకృష్ణ, కొల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ద్రోణాదుల చెరువులో స్వామి వారి తెప్పోత్సవం (ఇన్‌సెట్లో) విద్యుత్ వెలుగుల్లో ప్రభ

ద్రోణాదులలో పండుగ కోలాహలం

● వైభవంగా స్వామి వారి తెప్పోత్సవం
● విద్యుత్ ప్రభలు.. సాంస్కృతిక కార్యక్రమాలు

మార్టూరు, జనవరి 17: సంక్రాంతి పండుగ కనుమ మరుసటి రోజు మండలంలోని ద్రోణాదుల గ్రామంలో తిరునాళ్ల సందడి కనిపించింది. ఇతర ప్రాంతాలకు, పట్టణాలకు వెళ్లిన వారు సంక్రాంతి పండుగకు ఇంటికి వచ్చారంటే తప్పని సరిగా ఈ తిరునాళ్ల రోజు వరకు సందడి చేసి వెళుతుంటారు. అదేవిధంగా బుధవారం ఈ గ్రామంలో సంక్రాంతి సందడి ప్రతి ఇంట కనిపించింది. మధ్యాహ్నం గ్రామంలోని కోదండరామస్వామి, వీరభద్రస్వామి, సోమేశ్వరస్వామి దేవస్థానంలోని ఉత్సవ విగ్రహాలకు పూజా కార్యక్రమాలను నిర్వహించి ఆలయ అర్చకులు నగరోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రజలందరూ వెంట రాగా మచ్చ కుంట చెరువులో స్వామి వారి విగ్రహాలతో తెప్పోత్సవం చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి గ్రామస్థులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల వాసులు కూడా రావడం విశేషం. సాయంత్రం ప్రధాన సెంటర్‌లో చేసిన కోలాటం, భజన కార్యక్రమాలను ప్రజలు ఆశేషంగా తిలకించారు. గ్రామంలోని బొబ్బేపల్లి రోడ్‌లో, ప్రధాన సెంటరులో ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ప్రభలు అలరించాయి. గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



మహిళా న్యాయవాది చిట్టాబత్తిన ఫణీంద్రాదేవి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

ఫణీంద్రాదేవికి నివాళులు అర్పించిన కరణం

అద్దంకి, జనవరి17: మహిళాన్యాయవాది చిట్టాబత్తిన ఫణీంద్రాదేవికి పలువురు నివాళులు అర్పించారు. ఫణీంద్రాదేవి మంగళవారం విజయవాడలోని వైద్యశాలలో మృతి చెందగా బుధవారం అద్దంకిలో అంత్యక్రియలు జరిగాయి. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి బుధవారం ఉదయం ఫణీంద్రాదేవి మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఫణీంద్రాదేవి భర్త కనకసేనరావుతో ఉన్న సంబంధాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. టీడీపీ బాపట్ల జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు బత్తుల రామకోటయ్య, బొడ్డపాటి రవికుమార్,పెంట్యాల గంగాధర్, అడుసుమల్లి కిషోర్, కూరపాటి రామకోటేశ్వరరావు తదితరులు నివాళులు అర్పించారు. అద్దంకి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ హాల్‌లో ఫణీంద్రాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, సుబాష్ బాబు, వీరనారాయణ, పీఎల్ఎస్ ప్రసాద్, వెంకటరావు, ఉదయభాస్కర్, హరిబాబు, మహిళా న్యాయవాదులు గృహలక్ష్మి, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

దూషించిన వ్యక్తుల అరెస్ట్

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 17 : ఏసు క్రీస్తు పుట్టుకను అవహేళన చేస్తూ దూషణకు పాల్పడిన ఇరువురిని ఎట్టకేలకు ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. చీరాల మండల పరిధిలోని గవినివారిపాలెంకు చెందిన మిండా వెంకటరావు, గవిని అయ్యప్ప సువార్త ప్రకటిస్తున్న వారి మధ్యలోకి చొరబడి క్రీస్తు పుట్టుకను దూషించారు. దీంతో ఆగ్రహించిన క్రైస్తవులు మంగళవారం ఉదయం స్టేషన్ ముందు రాత్రి సమయంలో 216 జాతీయ రహదారి ఈపూరుపాలెం వద్ద సుమారు గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. అయితే నిందితులను పట్టుకునేందుకు బుధవారం ఉదయం వరకు పోలీసులు గడువు కోరారు. ఈనేపథ్యంలో పోలీసులు గాలింపు చర్యలు వేగవంతం చేసి బుధవారం ఉదయానికి వారిని పట్టుకున్నారు. దీంతో పరిస్థితులు చక్కబడ్డాయి. అయితే పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన పలువురు ఎస్సీ సామాజికవర్గంపై కూడా కేసులు నమోదయ్యాయి. వీటిపై పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

నేడు సెయింట్‌ఆన్స్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

చీరాల, జనవరి 17 : సెయింట్‌ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో డిప్లమా 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వాల్యూ ఫ్రిక్షన్ మెటీరియల్ ఇండియా కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

భవనాసి రిజర్వాయర్ పర్యాటక కేంద్రంగా మారేనా?

జరగని భూసేకరణ పనులు

అభివృద్ధి చేయలేదని వైసీపీపై భక్తుల పెదవివిరుపు

అద్దంకి, జనవరి 17: రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న ప్రసిద్ధ దేవాలయాలలో అద్దంకి మండలంలోని శింగరకొండ కూడా ఒకటి. శింగరకొండ వద్ద ఉన్న భవనాసి చెరువు కు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. 2009 లో భవనాసి చెరువును రిజర్వాయర్‌గా మార్చే పనులు ప్రారంభమయ్యాయి. నిర్మాణ పనులు అత్యధిక శాతం పూర్తయినప్పటికీ భూసేకరణ పనులు జరగకపోవటంతో ఇంకా పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. శింగరకొండలో కూడా దశాబ్దన్నర కాలంలో దాతల సహకారంతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయి. అయితే భవనాసి రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే పనులకు మాత్రం అంకురార్పణ జరగలేదు. భవనాసి రిజర్వాయర్ మధ్యలో ఐ ల్యాండ్ ఏర్పాటు చేసి ఎత్తైన ఆంజనేయస్వామి లేదా బుద్ధుడి విగ్రహం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు వచ్చాయి. అదే సమయంలో భవనాసి రిజర్వాయర్ విశాలంగా ఉన్నందున బోట్ షికారుకు కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉంది. బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో శింగరకొండ కు వస్తుంటారు. శింగరకొండ వచ్చిన భక్తులు రోజంతా హాయిగా గడిపేందుకు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. భక్తులు కుటుంబసభ్యులతో వచ్చినా దేవాలయం గదులతో పాటు అన్ని సామాజిక వర్గాల అన్న దాన సత్రాలు, గదులు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. కనీసం ప్రవేటు భాగస్వామ్యంతో బోటు షికారు ఏర్పాటు చేసినా కొంత మేర అభివృద్ధికి అవకాశం ఉంటుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీలో కీలక పదవిలో మేదరమెట్లకు చెందిన వైవీ సుబ్బారెడ్డి ఉండటంతో భవనాసి రిజర్వాయర్ టూరిజం సెంటర్‌గా అభివృద్ధి చెందుతుందని పలువురు భావించినప్పటికీ పుణ్యకాలం మొత్తం పూర్తయ్యిందని భక్తులు పెద్దవి విరుస్తున్నారు.



రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసిన భవనాసి చెరువు (ఇన్‌సెట్లో) శింగరకొండ వ్యూ



అనంతవరం గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

సంప్రదాయాలను గౌరవించాలి

అనంతవరంలో మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 17: సంక్రాంతి పండుగ సంప్రదాయాలను తప్పని సరిగా పాటించాలని, ఆహ్లాదకరమైన వాతావరణంలో అందరూ పండుగను జరుపుకోవాలని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని అనంతవరం గ్రామంలో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి పుల్లారావు, టీడీపీ బాపట్ల పార్ల మెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు పాల్గన్నారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే కుటుంబం అంతా కలిసి మెలిసి ఆనందంగా గడిపే రోజు అన్నారు. ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో సంక్రాంతి పండుగ ఆనందాన్ని నింపాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. వచ్చే సంక్రాంతి నాటికి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో చంద్రబాబు సారధ్యంలో సరి కొత్తగా మేనిఫెస్టోను ప్రకటించారన్నారు. రాబోయే కాలంలో ఏటా సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలంటే మళ్లీ చంద్రబాబును ముఖ్య మంత్రిగా చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గుదే తారక రామారావు, నిమ్మల సాంబశివరావు, కోయ సతీష్, కొరటాల వంశీ, పెదవల్లి కల్యాణ చక్రవర్తి, పెదవల్లి వెంకటేశ్వర్లు, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ప్రైవేట్ బస్సు

● మార్టూరు సీఐకు తీవ్ర గాయాలు
● కారు డ్రైవరుకు స్వల్పగాయాలు
● నాయుడుపేట మండలం గుర్రప్పతోట వద్ద ప్రమాదం

మార్టూరు, జనవరి 17: అనంతపురం జిల్లాలో మంగళవారం జరిగిన ప్రధానమంత్రి మోదీ సభకు బందోబస్తుకు వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మార్టూరు సీఐ అక్కేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డారు. కారు డ్రైవరు సర్దార్ అనే యువకుడు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం తిరుపతి జిల్లా నాయుడుపేట సమీపంలోని పెళ్లకూరు మండలం గుర్రప్పతోట గ్రామం సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ప్రధానమంత్రి సభ కార్యక్రమంలో బందోబస్తు ముగించుకొని మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఇన్నోవా కారులో మార్టూరుకు బయలుదేరిన సీఐ వాహనాన్ని ఎదురుగా ప్రయివేటు ట్రావెల్ బస్సు ఢీ కొన్నది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతినగా, కారులో ఉన్న సీఐ, కారు డ్రైవరు గాయాలకు గురయ్యారు. ఈ ప్రమాదంలో సీఐ ఎడమకాలు, కుడి చేతికి గాయాలయ్యాయి. అనంతరం ఈ ప్రమాదంలో గాయపడిన వారిద్దరిని నెల్లూరులోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. తరువాత మార్టూరు ఎస్సై ఎం. శ్రీనివాసరావు అపోలో ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. ప్రధానమంత్రి సభకు మార్టూరు స్టేషన్ నుంచి సీఐతో పాటు ఏఎస్ఐ బాషా, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక హోం గార్డు బందోబస్తు నిమిత్తం వెళ్లారు.



నాయుడుపేట సమీపంలోని గుర్రప్పతోట వద్ద కారును ఢీకొన్న ప్రైవేట్ బస్సు (ఇన్‌సెట్లో) తీవ్రంగా గాయపడి కారులో చిక్కుకుపోయిన సీఐ అక్కేశ్వరరావు

కలవరపాటులో పోలీసులు

బందో బస్తుకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో సీఐ అక్కేశ్వరరావు గాయపడిన విషయం తెలియగానే మార్టూరు స్టేషన్‌లో పోలీసులు కలవరపాటుకు గురయ్యారు. వెంటనే ఎస్సై ఎం. శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి నెల్లూరు లోని అపోలో హాస్పిటల్‌కు వెళ్లారు. అదేవిధంగా స్టేషన్‌లోని మిగిలిన సిబ్బంది కూడా సీఐ ప్రమాదానికి గురయ్యారని ఆందోళనకు గురయ్యారు. రెండు నెలలు క్రితం సీఐగా అక్కేశ్వరరావు జాయిన్ అయ్యారు. అంతకు ముందు సీఐగా పని చేసిన ఫిరోజ్‌తో పాటు ఎస్సై కె. కమలాకర్, యద్దనపూడి ఎస్సై అనూక్, పర్చూరు ఎస్సై ప్రసాద్‌లు ఫాం 7 ఓట్లకు సంబందించిన ఎన్నికల నిబంధనను అతిక్రమించారనే కారణంగా పోలీసు ఉన్నత అధికారులు వారిని సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఈ సంఘటన జరిగిన తర్వాత కొత్త సీఐగా అక్కేశ్వరరావు, ఎస్సైగా శ్రీనివాసరావు జాయిన్ అయ్యారు. ఇపుడు సీఐ రోడ్డు ప్రమాదానికి గురవడంతో స్టేషన్ సిబ్బంది ఉలిక్కి పడుతున్నారు.

ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేద్దాం..

వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల, జనవరి 17 : 'జనం గుండెల్లో ఉన్నాం.. విజయం మనదే.. వచ్చే ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేద్దాం.. భావసారూప్యం ఉన్న అందరిని కలుపుకుపోదాం'.. అని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. ఒంగోలులోని వారి నివాసంలో చీరాల నియోజకవర్గ వైసీపీ ముఖ్య నాయకులతో వెంకటేష్ కొలుకున్న అనంతరం తొలిసారిగా బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరాం మాట్లాడుతూ వెంకటేష్ బాధ్యత నాది, నాకు అప్పగించండి, అన్నీ నేను చూసుకుంటానని సీఎం జగన్ చెప్పారు. అతన్ని గెలిపించుకోవటం మనందరి బాధ్యత అన్నారు. వెంకటేష్ మాట్లాడుతూ తమను చీరాల నియోజకవర్గ ప్రజలు ఆదరించిన, ఆదరిస్తున్న తీరును ఎన్నటికి మర్చిపోలేమన్నారు. 22వ తేదీ సాధికారబస్సు యాత్రను విజయవంతంగా నిర్వహించటంపై పలు సూచనలు చేశారు. సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు చీరాల నియోజకరవ్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

కలసి నడుద్దాం .. కలుపుకొని పోదాం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండయ్య

చీరాల, జనవరి 17 : టీడీపీలో రోజు, రోజుకు చేరికలు పెరుగుతున్నాయి. కలసి నడుద్దాం. అందరిని కలుపుకు పోదామని ఆ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.ఎం కొండయ్య అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కొండయ్య సమక్షంలో వాడరేవుకు చెందిన ధోని కనకరాజు ఆధ్వర్యంలో పలువురు మత్స్యకారులు బుధవారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా కొండయ్య వారికి టీడీపీ కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి భవిష్యత్ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న అరాచకాలను వివరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాశిక వీరభద్రయ్య, నాయకులు బుద్ది బస్వాచారి, కూరపాటి పూర్ణ, కౌతవరపు జనార్దనరావు, గుర్రం మల్లేశ్వరరావు, కర్పూరపు సుబ్బలక్ష్మి, యర్రా శివనాగమల్లేశ్వరి, తెలప్రోలు నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండయ్యకు మద్దతు తెలుపుతున్న వాడరేవుకు చెందిన మత్స్యకారులు

కొత్త వ్యక్తుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

వేమవరంలో పోలీస్ పికెట్‌ను తనిఖీ చేసిన సీఐ

బల్లికురవ, జనవరి 17 : సార్వత్రిక ఎన్నికలు దగ్గరలో ఉన్నాయని, గ్రామాలలో కొత్త వ్యక్తులు ప్రవేశించి అలజడులు సృష్టించే ప్రమాదం ఉందని, పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు సూచించారు. బుధవారం రాత్రి ఫ్యాక్షన్ గ్రామం అయిన వేమవరాన్ని సీఐ పరిశీలించారు. అనంతరం అక్కడ గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న పోలీస్ పికెట్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మద్యం అమ్మకాలు చేపట్టినా, జూదం నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నారు. ఘర్షణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచుతామన్నారు. అలానే గ్రామాలలో రోడ్ల వెంబడి పెట్రోల్ అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. అలానే గ్రానైట్, మెటల్ క్వారీలలో బ్లాస్టింగ్‌లు అనుమతులు లేకుండా చేపడితే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అనంతరం బల్లికురవ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలో ఎస్ఐ వి. వేమన పాల్గొన్నారు.



పోలీస్ పికెట్‌ను తనిఖీ చేస్తున్న సీఐ నరసింహారావు



పర్చూరు సీడీపీవో కార్యాలయం వద్ద వరుసలో వేచిఉన్న అంగన్‌వాడీలు

సీడీపీవో కార్యాలయానికి అంగన్‌వాడీల క్యూ

● షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు కార్యాలయానికి..

పర్చూరు, జనవరి 17: అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెను అణచివేసేందుకు ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని తెరమీదకు తెచ్చింది. అందులో భాగంగా ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ప్రభుత్వం షోకాజ్ నోటీలను జారీచేసింది. 10 రోజుల లోపు వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొంది. దీంతో గడువు ముగియనుండటంతో బుధవారం షోకాజ్ నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు సీడీపీవో కార్యాలయానికి అంగన్‌వాడీలు క్యూకట్టారు. పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు కార్యాలయానికి చేరుకోటంతో అధికారులు సైతం ఉక్కిరి బిక్కిరి అయ్యారు.

బల్లికురవలో..

బల్లికురవ : అంగన్‌వాడీ కార్యకర్తలకు పది రోజుల క్రితం పంపిన నోటీసులపై వివరణ ఇచ్చేందుకు మండలంలోని 64 కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి వెళ్లి రాత పూర్వకంగా వివరణ ఇచ్చారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీ మేరకు జీతాలు పెంపుదల చేయాలని లేకుంటే సమ్మెలోనే ఉంటామని వారు తెలిపారు. అంగన్ వాడీ కార్యకర్తలకు సీఐటీయు నేతలు సంఘీభావం ప్రకటించారు.



ప్రాజెక్టు కార్యాలయానికి తరలి వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన

యద్దనపూడి (మార్టూరు) జనవరి 17: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎం లను వినియోగించే విధానంపై బుధవారం మండలంలో రెవెన్యూ అధికారులు ఓటర్లకు అవగాహన కలిగించారు. మండలంలోని అనంతవరం, సూరారపల్లి, యనమదల గ్రామాలలో అధికారులు ఓటర్లకు ఈవీఎంలలో ఏవిధంగా ఓటు వేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కె రవికుమార్, డీటీ విష్ణు, ఎస్ఏ భాస్కరరావు, వీఆర్‌వోలు శేషుబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఈవీయంల వినియోగంపై అవగాహన కలిగిస్తున్న రెవెన్యూ అధికారులు

30 నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు

చీరాల, జనవరి 17 : స్థానిక సాంస్కృతిక సమితి, చైతన్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ నుంచి త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఉమామోహన్, భాగి నారాయణశాస్త్రిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంతావారిసెంటర్లోని ఎస్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ కల్యాణమండపంలో జరిగే ఉత్సవాలకు అందరూ ఆహ్వానితులేనని చెప్పారు. అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణయ్య

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

అద్దంకి, జనవరి17: శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని సీఐ కృష్ణయ్య అన్నారు. అద్దంకి పట్టణ సీఐగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నర్సరావుపేట రూరల్ సీఐగా పనిచేస్తూ బదిలీపై అద్దంకిసీఐగా వచ్చారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ అద్దంకి పట్టణంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు.

సంతమాగులూరు సీఐ బాధ్యతల స్వీకరణ

సంతమాగులూరు, జనవరి 17: సంతమాగులూరు సీఐగా కె. నరసింహారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన ప్రభాకరరావు వీఆర్‌కు బదిలీ కావడంతో నరసింహారావు సంతమాగులూరుకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే అద్దంకి వెళ్ళి వైసీపీ అద్దంకి ఇన్‌చార్జి పాణ్యం హనిమిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహారావు

సీకేఎస్ ఫౌండేషన్‌కు టీవీ బహూకరణ

పంగులూరు, జనవరి 17 : స్థానిక సీకేఎస్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న వృద్ధుల ఆశ్రమానికి గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావు టీవీని బహూకరించారు. రామారావు, భారతిల కుమారులు ప్రశాంత్, ప్రవీణ్‌ల జ్ఞాపకార్థం ఫౌండేషన్ యజమాని షడ్రక్‌కు బుధవారం టీవీని అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన కేబుల్ నెట్‌వర్క్ యజమాని గుర్రం ఆంజనేయులు దంపతులు ఆశ్రమంలోని వృద్ధ మహిళలకు చీరలు బహూకరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాయిణి ప్రమీల, ఆర్.వి.సుబ్బారావు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



టీవీ బహూకరిస్తున్న విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావు దంపతులు

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

అద్దంకి, జనవరి17: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా అద్దంకి పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటలకు కాకానిపాలెం లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారని పట్టణ తెలుగుయువత అధ్యక్షుడు వడ్డవల్లి పూర్ణచంద్రరావు, నందమూరి కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు మన్నం త్రిమూర్తులు, నాగినేని రామకృష్ణలు తెలిపారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఉదయ భాస్కర్ దంపతులు

పర్చూరు, జనవరి 17: విద్యాదాత దివంగత పాబోలు రాధాకృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో నిరుపేద వృద్ధులకు వారి కుమారుడు పాబోలు ఉదయ భాస్కర్, గిరిజా కుమారిలు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఉదయ భాస్కర్ మాట్లాడుతూ తన తండ్రి చేసిన సేవాకార్యక్రమాలను కొనసాగించే విధంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటి లింగేశ్వరరావు, కాసా అజయ్ కుమార్, పాబోలు తేజ, కొసనా వెంకటేశ్వర్లు, హనుమంతురావు, శ్రీరాం వెంకటసుబ్బారావు, కొత్తూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మండలంలో కులగణన సర్వే


పంగులూరు, జనవరి 17 : మండలంలో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు కుల గణన సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామాంజనేయులు తెలిపారు. మండలంలోని 14 సచివాలయాల పరిధిలో గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సంయుక్తంగా ఈ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. మండల అధికారులను సర్వే నిర్వహణపై పర్యవేక్షణ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. ఈ సర్వే యాప్‌లో నమోదు పరచిన డేటాను కేవలం క్యాస్ట్ సర్వేకు మాత్రమే ఉపయోగిస్తారని ఎంపీడీవో తెలిపారు. మండల ప్రజలు ఈ కులగణనకు సహకరించాలని కోరారు.

ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు

మార్టూరు, జనవరి 17: మండలంలోని వలపర్ల గ్రామంలో టీడీపీ,జనసేన పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ పోటీలలో మొదటి బహుమతిగా రూ. 5 వేల నగదును దామర్ల లక్ష్మీ సాయి దుర్గ, రెండవ బహుమతిగా రూ. 3 వేలు నగదును కూర్మాల రమ్యకృష్ణ , మూడవ బహుమతిగా రూ. 2 వేలు నగదును యంశ్రావణి గెలుచుకున్నారు. వారికి టీడీపీ నాయకులు కంభం పాటి హనుమంతరావు, మాలపాటి రాఘవయ్య, జనసేన పార్టీ నాయకులు అందజేశారు.

ఎస్మాపై అంగన్‌వాడీల నిరసన


వేటపాలెం(చీరాల), జనవరి 17 : తమపై ఎస్మా ప్రయోగాన్ని ఎత్తివేయాలని, న్యాయబద్ధంగా హక్కుల సాధన కోసం చేపట్టిన దీక్షపై ఎస్మా ప్రయోగమనేది ప్రభుత్వ నియంత చర్యగా అంగన్‌వాడీలు అభివర్ణించారు. ప్రభుత్వం చర్యలపై వారు మండిపడ్డారు. స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఎర్రటి అగ్గిలో నిరసన వ్యక్తం చేస్తూ బైఠాయించారు. అందులో ఓ అంగన్‌వాడీ కార్యకర్త చంటిబిడ్డతో నిరసనలో పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించేవరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారికి సీఐటీయూ బాధ్యులు ఎం. వసంతరావు, ఎన్.బాబూరావులు సంఘీభావం తెలిపారు.



సీడీపీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


అంగన్‌వాడీలకు బీఎస్పీ సంఘీభావం

అద్దంకిటౌన్ : అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఎస్పీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు పారి యోహాను డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన అంగన్‌వాడీల ధర్నాకు బీఎస్పీ నాయకులు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. నాయకులు మందా జోసఫ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు, పొనకా రామాంజనేయులు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు జి. శారద పాల్గొన్నారు.



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం, 18 జనవరి 2024



సంక్రాంతి సెలవుల పొడిగింపు

● 22న పాఠశాలల పునః ప్రారంభం

నెల్లూరు (విద్య), జనవరి 17: సంక్రాంతి సెలవులను ఈనెల 22వతేదీ వరకు పొడిగిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో గంగాభవాని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు మరో మూడు రోజులు సెలవులు పొడిగించారన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఈనెల 22న పునః ప్రారంభించాలని ఆదేశించారు. తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఏటి పండుగలో జన సందోహం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన



ఏటి సంబరం

- పెన్నా తీరాన ఘనంగా గొబ్బెమ్మల పండుగ
- భక్తిశ్రద్ధలతో గౌరమ్మ ఓలలాడింపు
- ఆశీస్సులు అందించిన దేవతామూర్తులు
- ఆట, పాటలతో చిన్నాపెద్దా సందడి
- ఉత్సాహంగా పతంగుల ఎగురవేత



పోయిరావమ్మా..: పెన్నాలో గౌరమ్మను నిమజ్జనం చేస్తూ...

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 17: నెల్లూరు నగరంలోని పెన్నాతీరం బుధవారం సాయంత్రం ఏటి పండుగకు తరలివచ్చిన భక్తులతో జనసంద్రంలా మారింది. సంక్రాంతి సంబరాల్లో నాలుగోరోజు ఏటి పండుగను నిర్వహిస్తారు. ఈ పండుగలో ఆధ్యాత్మిక, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను రూపొందించారు. కులమతాలకు అతీతంగా నగరవాసులు తరలివచ్చారు. సంక్రాంతి ఉత్సవాల్లో మొదటి రోజైన భోగినాడు ముత్తైదువులు గౌరమ్మలను ప్రతిష్ఠించారు. కనుమ వరకు గౌరీ వ్రతాలు, పూజలు నిర్వహించారు. కనుమ తర్వాత రోజు ముక్కనుమ నాడు పెన్నానదిలో గౌరమ్మలను నిమజ్జనం చేశారు. ఓలలాడించే సమయంలో గౌరమ్మను పాటలతో కొలిచి ధూపదీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఇంటి నుంచి తెచ్చుకున్న ప్రసాదాలను ఆరగించి, రకరకాల ఆటపాటలతో గడిపారు. ఈ కార్యక్రమాలను సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతకు పతంగులు (గాలి పటాలు) పంపిణీ చేశారు. గాలి పటాలను ఎగురవేసి ఎమ్మెల్యే ఏటి పండుగను ప్రారంభించారు. యువత కేరింతలతో పతంగులను ఎగురవేశారు. యువతులు, మహిళలు కూడా పోటీ పడి గాలిపటాలు ఎగురవేశారు.

జానీ జోష్



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): గొబ్బెమ్మల పండుగలో ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సందడి చేశారు. జనసేన నాయకులు, వీర మహిళలతో కలిసి పండుగలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గునుకుల కిషోర్, చిరంజీవి యువత నాయకులు వై రవి, గుర్రం కిషోర్ పాల్గొన్నారు.



చల్లగ చూడమ్మా..: నిమజ్జనానికి ముందు గొబ్బెమ్మకు పూజ

ఆకట్టుకున్న కేరళ వాయిద్యాలు

ఈ సంవత్సరం ఏటి పండుగలో సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు కేరళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్యాలతో కళాకారులు అలరించారు. నగర పాలక సంస్థ తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మైక్ సిస్టమ్, పారిశుధ్యం వంటి వసతులు కల్పించింది. పోలీసు శాఖ, ట్రాఫిక్, బందో బస్తుతోపాటు పిట్‌ప్యాకెట్, చైన్‌స్నాచర్స్ జరగకుండా భక్తులకు రక్షణ, భద్రత కల్పించారు. ఈ కార్యక్రమాల్లో తల్పగిరి రంగనాథస్వామి ఆలయం చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



ఆలయాల నుంచి తరలివచ్చిన దేవతలు

జిల్లాలోని వివిధ ఆలయాలకు చెందిన అమ్మవార్లు, స్వామివార్లు, ఏటి పండుగకు తరలివచ్చారు. వారి చల్లని చూపులు జిల్లా, నెల్లూరు నగరంపై ఉండాలని, అందరూ సుఖశాంతులతో జీవించేలా చూడాలని దేవతలకు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పూజలు చేశారు. పెన్నా తీరంలో కొలువు దీరిన వారిలో ఇరుకళల పరమేశ్వరి, వెంగమాంబ పేరంటాళ్ల (నర్రవాడ) శ్రీదేవి,భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామి, జొన్నవాడ కామాక్షమ్మ, వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి, మూలాపేట మూలస్థానే శ్వరుడు, రాజరాజేశ్వరి అమ్మవార్లు ఉన్నారు. కార్యక్రమాలను జిల్లా సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ వెంకట శ్రీనివాసులురెడ్డి, వీ గిరికృష్ణ, ఈవోలు ఆరంబాకం వేణుగోపాల్, ఉష, బీ మల్లికార్జున్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

ఒకే కుటుంబం నుంచి 67 మంది హాజరు

నెల్లూరులో పుట్టి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన జంగా కుటుంబం నుంచి ఏటి పండుగలో 67 మంది సభ్యులు పాల్గొన్నారు. బెంగుళూరు నుంచి రెండు కుటుంబాలు, హైదరాబాద్ నుంచి ఆరు కుటుంబాలు, విజయవాడ నుంచి ఆరు కుటుంబాలు, చెన్నై నుంచి రెండు కుటుంబాలు, అహ్మదాబాద్ నుంచి రెండు కుటుంబాల వారు నెల్లూరుకి తరలివచ్చారు. వీరంతా సంక్రాంతికి వచ్చి ముక్కనుమ రోజున ఏటి పండుగలో గౌరమ్మలను నిమజ్జనం చేసి తమ తమ ప్రాంతాలకు తిరిగి వెళతారు. ఈ సందర్భంగా వారు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు.

సార్వత్రిక సమరానికి

సన్నద్ధం

- ఎన్నికల ఏర్పాట్లలో యంత్రాంగం
- పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్న సెక్టోరల్ ఆఫీసర్లు
- అధికారుల బదిలీలు ప్రారంభం.. ఇప్పటికే తహసీల్దార్లకు స్థానచలనం
- ఎప్పటికప్పుడు ప్రగతిని సమీక్షిస్తున్న ఈసీ

నెల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సన్నాహాలు ఊపందుకున్నాయి. కొన్ని నెలల నుంచి ఓటర్ల జాబితా తయారీపై కసరత్తు చేసిన అధికార యంత్రాంగం ఇప్పుడు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఫిబ్రవ రిలో నోటిఫికేషన్ వెలువడుతుందన్న అంచనాల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, మౌలిక సదుపాయాల ఏర్పాటు, బీఎల్‌ఏల నియామకం, ఎన్నికల సిబ్బందికి విధుల కేటాయింపు, అధికారుల బదిలీలు.. ఇలా అనేక కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. ఓటరు క్లయిమ్‌ల పరిష్కారం పూర్తికావడం తో ఇప్పుడు రెవెన్యూ సిబ్బంది మొత్తం పోలింగ్ ఏర్పాట్లలో బిజీబిజీగా గడుపుతున్నారు. కలెక్టర్ నుంచి వీఆర్వో వరకు ప్రతి ఒక్కరూ ఈ విధుల్లో భాగస్వాములై ఉన్నారు. మరోవైపు ఎన్నికల బాధ్యతల్లో ఉన్న ఇతర శాఖల అధికారులు, ఉద్యోగుల్లో కూడా హడావిడి కనిపిస్తోంది. కొందరు శిక్షణ తీసుకుంటుండగా, మరికొందరు క్షేత్రస్థాయి పనిలో నిమగ్నమయ్యారు.

● బదిలీల ప్రక్రియ షురూ..

ఇక ఎన్నికల సమయంలో కీలకమైనది అధికారులు, ఉద్యోగుల బదిలీల ప్రక్రియ. ఇప్పుడు అది కూడా ప్రారంభమైంది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్దిష్ట మార్గదర్శకాలను జారీ చేసింది. అందులో ఎవరెవరిని బదిలీ చేయాలన్నది స్పష్టంగా తెలియజేసింది. సొంత జిల్లాల్లో పనిచేస్తున్న జిల్లా అధికారులు, సొంత జిల్లాలో కీలకమైన ఎన్నికల విధులు నిర్వహిస్తున్నవారు, మూడేళ్లకుపైగా ఒకే జిల్లాలో పనిచేస్తున్న వారు, గత ఎన్నికల్లో పనిచేసిన వారు.. ఇలా అనేక మార్గదర్శకాలను జారీ చేయగా దానికి అనుగుణంగా బదిలీల ప్రక్రియ మొదలైంది. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న శాఖలన్నింటి నుంచి ఆ వివరాలు జిల్లా కలెక్టర్‌కు చేరాయి. అక్కడి నుంచి రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపగా అక్కడ ఎవరెవరిని బదిలీ చేయాలన్నది నిర్ణయిస్తున్నారు. రెవెన్యూ శాఖలో తొలుతగా 15 మంది అడహక్ తహసీల్దార్లను బదిలీ చేసి, వారి స్థానాల్లో ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో మూడేళ్లకు పైగా పనిచేస్తున్న తహసీల్దార్లను నియమించారు. అలానే జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లను కూడా మరికొన్ని రోజుల్లోనే ప్రకాశం, గుంటూరు జిల్లాలకు బదిలీ చేయనున్నారు. ఈ నెల 22న ఓటర్ల ముసాయిదా తుది ప్రచురణ జరగనుంది. ఆ వెంటనే ఏఈ ఆర్‌వోలుగా ఉన్న తహసీల్దార్ల బదిలీ జరుగుతుందని చెబుతున్నారు. అలానే ఎంపీడీవోలు కూడా బదిలీ కానున్నారు. దాదాపుగా ఇప్పటికే అన్ని శాఖల్లో బదిలీల జాబితా సిద్ధమైంది. ఈ నెలాఖరులోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నేపథ్యంలో రానున్న పది రోజుల్లో భారీగా బదిలీలు జరిగే అవకాశముంది.

● ఇప్పటికే దిశానిర్దేశం

వారం క్రితం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో విజయవాడలో సమావేశమై దిశానిర్దేశం చేశాక ఎన్నికల ప్రక్రియలో మరింత వేగం కనిపిస్తోంది. జిల్లా కలెక్టర్, ఎస్పీలు పూర్తిగా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఉదయం, సాయంత్రం ఆర్‌వోలు, ఏఈఆర్‌వోలతో టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే కీలకమైన సెక్టోరల్ అధికారులను నియమించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించే బాధ్యతలు వీరికి అప్పగించారు. వారి నుంచి క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదికను తెప్పించుకుంటున్నారు. అవసరమైన చోట్ల జిల్లా అధికారుల చేత కోఆర్డినేషన్ చేయిస్తున్నారు. మరోవైపు అన్ని రాజకీయ పార్టీల నుంచి బూత్ లెవల్ ఏజెంట్ల వివరాలను కూడా తెప్పించుకుంటున్నారు. అదే సమయంలో ఎన్నికల సంఘం అధికారులతోపాటు జిల్లా అబ్జర్వర్లు కూడా ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

తుది జాబితా ప్రచురణకు

ముందస్తు చర్యలు తీసుకోండి

● జిల్లా రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 17: ఈనెల 22న ఓటర్ల తుది జాబితా ప్రచురించేందుకు అవసరమైన అన్నీ ముందస్తు



చర్యలు తీసుకోవాలని జిల్లా రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో బుధవారం ఆయన ఓటర్ల తుది జాబితా ప్రచురణ, ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, ఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణ అంశాలకు సంబంధించిన రికార్డులు పక్కాగా నిర్వహించాలని చెప్పారు. రాజకీయ పక్షాలు, వ్యక్తుల నుంచేకాక మీడియాలో ఏవైనా ఫిర్యాదులు వస్తే వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారానికి ఒకసారి రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించాలన్నారు. ఓటర్ల తుది జాబితా ప్రచురితం అయ్యాక రాజకీయ పార్టీలకు ఆ జాబితాను ఇవ్వాలన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలుగా వినియోగించే పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మౌలిక వసతులైన తాగునీరు, టాయ్‌లెట్లు, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు తదితర సౌకర్యాలను ఈనెల 25లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ రోణంకి కూర్మనాథ్, డీఆర్వో లవన్న, ఈఆర్వోలు విద్యాధరి, మలోల, శీనానాయక్, మధులత, బాపురెడ్డి, ఓబులేసు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టువీడని అంగన్‌వాడీలు

చిన్నారులతో కలిసి ఆందోళన

నెల్లూరు (వైద్యం) జనవరి 17: జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె బుధవారం నాటికి 37వరోజుకు చేరుకుంది. జిల్లాలోని ఐసీడీఎస్ కేంద్రాల వద్ద పట్టు విడవకుండా వారు ధర్నా చేస్తున్నారు. నెల్లూరు నగరంలోని కలెక్టరేట్ వద్ద గత ఏడాది డిసెంబరు 28 నుంచి రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం చిన్నారులు కూడా ఈ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. 37 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా నేటికీ ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా ఎస్మాను ప్రయోగించటం దుర్మార్గమని పేర్కొన్నారు. పాలకులు అంబానీ, అదానీల సేవలో తరలిస్తున్నారేగాని అంగన్‌వాడీల సమస్యలను పట్టించు కోవటంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రులు, సలహాదారులు కేవలం చర్చలతో కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా, నగర కార్యదర్శులు అజయ్‌కుమార్, నాగేశ్వరరావు , నగర, రూరల్ అధ్యక్షుడు అత్తిమూరు శ్రీనివాసులు, కొండా ప్రసాద్, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు రజిని, సంపూర్ణమ్మ, సుమతి, రత్నమ్మ, వెంకటకుమారి, మల్లమ్మ పాల్గొన్నారు.



ఉదయగిరి : విధుల్లో చేరుతున్నట్లు సీడీపీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీలు

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

ఉదయగిరి రూరల్, జనవరి 17: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బుధవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సీడీపీవో పచ్చవ లావణ్య మాట్లాడుతూ ఉదయగిరి ప్రాజెక్టు పరిధిలోని సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో 208 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. షోకాజ్ నోటీసులు తీసుకున్న, తీసుకోని వారు ఇప్పటివరకు 113 మంది విధుల్లో చేరి కేంద్రాలను తెరిచారన్నారు.



ఒంటిపై పెట్రోలు పోసుకున్న రవిపై నీళ్లు పోస్తున్న సిబ్బంది

పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తారా... చచ్చిపొమ్మంటరా?

- వరికుంటపాడు తహసీల్దార్ గది ఎదుట ఎస్టీ దంపతుల ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న సిబ్బంది

వరికుంటపాడు, జనవరి 17: 'ఏళ్ల తరబడి పూరి గుడిసెలో నివాసం ఉంటున్నాం. ఎస్టీ వర్గానికి చెందిన తమకు పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారు. ఇప్పటికైనా పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తారా... లేక చచ్చి పొమ్మంటరా' అని స్థానిక తహసీల్దారు గది ఎదుట రవి దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన బుధవారం వరికుంటపాడు తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు, వరికుంటపాడు ఎస్టీ కాలనీకి చెందిన ఇట్ల రవి, తన భార్య, ముగ్గురు పిల్లలతో కలసి పూరి గుడిసెలో కాపురం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తనకు పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని అధికారుల చుట్టూ ఐదేళ్లుగా తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో బుధవారం మరోసారి కార్యాలయానికి వచ్చిన రవి దంపతులు అధికారుల తీరును నిరసిస్తూ తహసీల్దారు గది బయట సీసాలో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒక్కసారిగా ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అక్కడ ఉన్న ఉద్యోగులతోపాటు ప్రజలు భయందోళనకు గురయ్యారు. వెంటనే అతడిపై నీరు పోసి పెట్రోలు సీసాను విసిరివేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తమపై కక్ష సాధింపు చర్యలతోనే వీఆర్వో తీవ్ర అన్యాయం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికే తమపై అక్రమ కేసులు సైతం బనాయించాడని వాపోయాడు. అయితే రవి కుటుంబం ఉన్న స్థలం ఇతరుల పట్టాభూమి అని, పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు వీలు పడదని, ప్రస్తుతం ఈ విషయం కోర్టు పరిధిలో ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు. అంతేకాక రవి దంపతులకు హౌసింగ్ శాఖ నుంచి నివాసం మంజూరు అయినట్లు జాబితాలో కూడా పేరు లేదని, దీంతో పొజిషన్ ఇచ్చేందుకు అవకాశం లేకుండా పోయిందని వారు తెలిపారు. అనంతరం రికార్డులు పరిశీలించిన తహసీల్దారు మల్లికార్జున రవి దంపతుల నుంచి వినతిపత్రం స్వీకరించారు.ఈ విషయమై సమగ్ర విచారణ చేపట్టి తప్పక న్యాయం చేస్తానని వారికి హామీనిచ్చారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న రవి దంపతులు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

● యూటీఎఫ్ నేతల సంఘీభావం ● జగనన్నకు చెబుదాం...కోటి సంతకాల సేకరణ ప్రారంభం



కావలిటౌన్: సంఘీభావం తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు



ఆత్మకూరు : నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కావలిటౌన్, జనవరి 17: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె బుధవారం 37వ రోజుకు చేరింది. యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు రమాదేవి, శ్రీదేవి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బెజవాడ రవికుమార్ జగనన్నకు చెబుదాం అనే కోటి సంతకాల కార్యక్రమాన్ని తొలి సంతకం చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు పెంచలయ్య, మాల్యాద్రి, యూనియన్ నేతలు రఘురావమ్మ, సుభాషిణి, విజయలత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె 37వ రోజుకు చేరింది. బుధవారం వారు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అంగన్‌వాడీలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి రోజుల తరబడి అంగన్‌వాడీల సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ నిర్లక్ష్యాన్ని వీడి మంత్రివర్గ సమావేశం నిర్వహించి పాదయాత్రలో ఇచ్చిన హామీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫరుద్దీన్‌బాషా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వరికుంటపాడు: విరాళం అందజేస్తున్న మధుసూదనరావు

● అంగన్‌వాడీలకు విరాళం

వరికుంటపాడు: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలకు బుధవారం టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు ఆధ్వర్యంలో నాయకులు మద్దతుగా నిలిచి సంఘీభావం ప్రకటించారు. వారితోపాటు ఆందోళన చేపట్టారు. అనంతరం తమవంతు దాతృత్వంగా రూ. 20వేల నగదును అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు షేక్ రజియాకు అందజేశారు. కార్యక్రమంలో చంద్ర ఉమామహేశ్వరరావు, ముజ్జె లక్ష్మీనారాయణ, చంద్ర వెంకయ్య, పోలిబోయిన శ్రీకాంత్ పోకా మహేష్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షితల పంపిణీ



అక్షితలు పంపిణీ చేస్తున్న నేతలు

ఆత్మకూరు, జనవరి 17 : అయోధ్యలో శ్రీరామ మందిరం ఈనెల 22న అంగరంగ వైభవంగా ప్రారంభమవుతున్న సందర్భంగా అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను ప్రతి ఇంటికీ చేర్చే కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని గిరిజన కాలనీలో ప్రతి ఇంటికీ బీజేపీ నేతలు వెళ్లి అందజేశారు. ముందుగా బీజేపీ నేతలు, రామ భక్తులు, కాలనీవాసులు కోదండరామాలయం వద్ద పూజలు నిర్వహించి అనంతరం అక్షితల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, సోమవరపు యానాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల ప్రారంభం

సీతారామపురం, జనవరి 17: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల స్థాయిలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో భార్గవి పర్యవేక్షణలో క్రీడాకారులకు ఆటల పోటీలు నిర్వహించారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన క్రీడా మైదానాలలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, రామనాథ్ రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ రమేష్, ఖలీల్ పాల్గొన్నారు.

క్రీడలు ఐక్యతకు దోహదం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ షకీల

ఆత్మకూరు, జనవరి 17 : క్రీడలు ఐక్యతకు దోహదపడతాయని బీఎస్‌ఆర్ వైద్యశాల అధినేత డాక్టర్ షకీల తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీలు బుధవారం ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని క్రికెట్, షటిల్ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంటా లక్ష్మీపతి, కొప్పోలు డేవిడ్‌రాజు, సీఐటీయు జిల్లా నాయుకుడు జి శివప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, రెడ్‌క్రాస్ చైర్మన్ సాధిక్‌హుస్సేన్, డీవైఎఫ్ఐ నాయకులు నందా శ్రీను, పొడమేకల శ్రీనివాసులు, శ్రీకాంత్, అళ్ల హజరత్తయ్య, యూటీఎఫ్ నాయకులు మురళీకృష్ణ, హరికృష్ణ, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం



కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహేంద్ర రెడ్డి

కావలిటౌన్, జనవరి 17: మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా నెహ్రూ యువకేంద్రం పనిచేస్తుందని ఆ కేంద్రం యూత్ అధికారి మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. మీకోసం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ముసునూరు ఇందిరమ్మ కాలనీలో కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. సంస్థ అధ్యక్షుడు దిలీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహేంద్రరెడ్డి మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధి కోసం అనేకం అవకాశాలు ఉన్నాయని, వాటిలో ఒకటి ఎన్నుకుని స్వచ్ఛంద సంస్థల ద్వారా అందించే ఉచిత శిక్షణ కార్యక్రమాల్లో శిక్షణ పొంది స్వయంగా ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ మాకినేని అరుణ, విశ్రాంత తహసీల్దారు సిరాజ్ మొగల్, చేవూరి చిన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల మూతతో చిన్నారుల అవస్థలు



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య

ఆత్మకూరు, జనవరి 17: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమ్మెతో కేంద్రాలు మూతపడడంతో చిన్నారులు అవస్థలు పడుతున్నారని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణుల పరిస్థితి దారుణంగా తయారైందని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాల్టీ పరిధిలోని వెంకట్రావుపల్లి గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కాలనీవాసులతో మాట్లాడారు. ఉదయాన్నే పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో వదిలి పనికివెళ్లి మధ్యాహ్నం వచ్చే వరకు పిల్లలకు మంచి ఆహారం అందిస్తూ రక్షణగా ఉండేవారని ప్రస్తుతం అంగన్‌వాడీలు సమ్మెలో ఉండడంతో పిల్లలను కేంద్రాలకు పంపడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ

ఉదయగిరి రూరల్, జనవరి 17: స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డిజిటల్ సహాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలకు రెండు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఈశ్వరమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు తయారు చేసుకుని అమలుపర్చాలన్నారు. పంచాయతీల్లో సమన్వయంతో ప్రణాళికలు రూపొందించుకుని 25వ తేదీన గ్రామసభలు నిర్వహించాలన్నారు. 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, ఏవో సీహెచ్ రేణుకా, ఎంసీవో గాజుల ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్



ఉదయగిరి రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

ఉదయగిరి రూరల్, జనవరి 17: మండలంలోని జీ.చెర్లోపల్లి, జీ.చెరువుపల్లి గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఈశ్వరమ్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు ఎంఈవో టీ శ్రీనివాసులు, వినీత, తేజశ్విని, ఖాజారంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం: కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలని మండల విద్యాశాఖాధికారి-2 ఆనందరావు అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రను అధికారులు బుధవారం చింతలదీవిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదవారికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నసీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్‌కు మహిళ బలి

● సంఘటనా స్థలాన్ని సందర్శించిన డీఎస్పీ



మృతి చెందిన కొండమ్మ

లింగసముద్రం, జనవరి 17 : అక్రమంగా విద్యుత్ వాడుతూ, విద్యుత్ సరఫరా ఉన్న ఓ కేబుల్‌ను నిర్లక్ష్యంగా పడేయడంతో, దానిని పక్కకు తీసే క్రమంలో ఓ మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని మొగిలిచెర్ల ఆదిఆంధ్ర కాలనీ ఎదురుగా ఉన్న పొలాల్లో బుధవారం జరిగింది. ఆ కాలనీకి చెందిన యనదాసరి కొండమ్మ (55) మృతి చెందింది.కందుకూరు డీఎస్పీ ఏ రామచంద్ర సమాచాం మేరకు.. అదే గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు తమ పొగాకు పైరుకు సాగునీటి కోసం ఆదిఆంధ్ర కాలనీ ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అక్రమంగా కేబుల్ తగిలించి, వారి బావి వద్ద ఉన్న విద్యుత్ మోటారుకు కనెక్షన్ ఇచ్చి నీరు పారించుకున్నారు. అయితే నీరు పారించుకున్న తరువాత మోటారు నుంచి కేబుల్‌ను తీసి పక్కన ఉన్న కొండమ్మ పొలంలో వేసి, ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి కేబుల్ కనెక్షన్ తీయకుండా వెళ్లిపోయారు. అయితే కొద్దిసేపటి తరువాత కొండమ్మ తన పొలంలో వేసిన జొన్నమేత పైరుకు మందు చల్లేందుకు వచ్చి చేలో ఉన్న కేబుల్‌ను పక్కకు తీయబోగా, కేబుల్‌కు ఉన్న కొక్కెం మెడకు తగిలి విద్యుదాఘాతానికి గురై పెద్దగా కేకలు వేసింది. అయితే ఆమె కుమారుడు చిన్న, కుమార్తె లుధియాలు ఆమెను కాపాడబోగా కరెంటు షాక్ తగిలింది. అయితే అక్కడే ఉన్న కొందరు కేబుల్‌ను తప్పించారు. అప్పటికే కొండమ్మ మృతి చెందింది. ఈ సంఘటనతో కొండమ్మ కుమారులు, కుమార్తె కన్నీరు మున్నీరుగా విలపించారు. కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు ఆ ఇద్దరు రైతులపై కొండమ్మ కుమార్తె కంచుపాటి లుధియా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సాయంత్రం కందుకూరు డీఎస్పీ ఏ రామచంద్ర, ఇన్‌చార్జ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్రనాయక్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. సంఘటనకు గల కారణాలను పరిశీలించి, కొండమ్మ బంధువులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం కొండమ్మ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై ఎస్సీ ఎస్టీ కేసు కూడా నమోదు చేసినట్టు డీఎస్పీ రామచంద్ర చెప్పారు.

నేడు వినికిడి యంత్రాల పంపిణీ

కందుకూరు, జనవరి 17: రామయ్య ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని వృద్ధులకు ఇటీవల పరీక్షలు నిర్వహించి వినికిడి యంత్రాలు కోసం ఎంపిక చేసిన వారికి గురువారం ఉదయం వాటిని పంపిణీ చేయనున్నట్లు ట్రస్టు అధ్యక్షురాలు, టీడీపీ నాయకురాలు ఉన్నం నళినీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో స్క్రీనింగ్ టెస్టుకు హాజరై పేర్లు నమోదు చేసుకున్నవారంతా వచ్చి వినికిడి యంత్రాలు తీసుకెళ్లాలని ఆమె కోరారు.

తైక్వాండో జిల్లా జట్టుకు నేడు ఎంపికలు

కందుకూరు, జనవరి 17: నెల్లూరు జిల్లా సబ్‌జూనియర్ తైక్వాండో బాలబాలికల పోటీలు ఈనెల 18న స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంటు, మాస్టర్ ఎస్కే అబ్దుల్ సలాం, జిల్లా కార్యదర్శి పి.అఖిల్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు నేరుగా పోటీలకు హాజరుకావచ్చని, పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులు ఈనెల 20, 21 తేదీలలో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

24న వాహనాల బహిరంగ వేలం

కావలి రూరల్, జనవరి 17: కావలి ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డ వాహనాలకు ఈ నెల 24వ తేది ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు ఆర్టీవో వై.సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మండవ వెంకట్రావుకు సేవా పురస్కారం



మండవ వెంకట్రావును సత్కరిస్తున్న విశ్రాంత డీజీపీ

కావలిటౌన్, జనవరి 17: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండవ కుటింబీకులు ప్రతిఏటా విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా బుధవారం కావలికి చెందిన దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ నాయకుడు మండవ వెంకట్రావును ఉత్తమ సేవాపురస్కారంతో సత్కరించారు. విశ్రాంత డీజీపీ మండవ విష్ణువర్ధన్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మండవ కుటుంబ సభ్యుల అధ్యక్షుడు మండవ ప్రభాకర్ తదితర ప్రముఖులు మండవ వెంకట్రావు దివ్యాంగులకు అందిస్తున్న సేవలను కొనియాడి సత్కరించి అభినందించారు.

రంగా విగ్రహ ప్రతిష్ఠకు స్థల పరిశీలన

కావలి, జనవరి 17: వంగవీటి మోహన్ రంగా విగ్రహ ప్రతిష్ఠకు కాపు నాయకులు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డితో కలిసి బుధవారం సాయంత్రం స్థల పరిశీలన చేపట్టారు. పట్టణంలోని రైతు బజారు వద్ద శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి ఎదురుగా రంగా విగ్రహం ఏర్పాటు చేయాలని కాపులు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాపులతా కలిసి రంగా విగ్రహ ప్రతిష్ఠకు సహకరించాలని ఇటీవల తనను కలిసి కోరారన్నారు. దీంతో ఈ రోజు వారితో కలిసి స్థల పరిశీలన చేశామన్నారు. అయితే రైతు బజారు ఎదురు రద్దీ ప్రదేశం కావటంతో ఎవరికి ఇబ్బందులు లేకుండా ఇక్కడ విగ్రహ ప్రతిష్ఠకు అధికారులు అనుమతులు ఇచ్చే విధంగా తన వంతు సహకరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు దేవరకొండ శ్రీనివాసులు, దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు, మండలి కృష్ణారావు, నాగిశెట్టి మాలకొండయ్య, వెంకటేశ్వర్లు, అళహరి చిట్టిబాబు, బండారు మహేష్, నున్నా మురళీ, సుదాకర్, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గురువులు, పూర్వ విద్యార్థులు

మర్రిపాడు, జనవరి 17: స్థానిక హైస్కూల్ ఆవరణలో 2007-08 బ్యాచ్‌కి చెందిన 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వచ్చి గురువులను ఆహ్వానించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు సుధాకర్, చలమయ్య, ఈశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, సుధాకర్, గురునాథం, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల మంజూరు

వరికుంటపాడు, జనవరి 17: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జీ.కొండారెడ్డిపల్లి, జీ.కొత్తపల్లి, నేలటూరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. అంబేడ్కర్, వైఎస్‌ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహమ్మద్, కన్వీనర్ తిరుపతినాయుడు, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, సర్పంచ్ కుమ్మిత ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ దేవనబోయిన మధు, మాగంటి. సిద్ధయ్య, ఎంపీడీవో శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సహకరించాలి

ఉదయగిరి రూరల్ : మండలంలోని పుల్లాయపల్లి గ్రామంలో బుధవారం వైసీపీ నాయకులతో నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బెంగళూరు, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో ఉన్నవారు స్వగ్రామానికి రావడంతో వారిని కలిసి జరగనున్న ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, మండల వైసీపీ కన్వీనర్లు జీ ఓబులరెడ్డి, సీహెచ్ సుబ్బారెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, సొసైటీ అధ్యక్షుడు కల్లూరి రమణారెడ్డి, నాయకులు కంభాల భాస్కర్‌రెడ్డి, మూలె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పైపులైన్ పగిలి వృథాగా పోతున్న నీరు!



పెంట్రాల ఎస్సీ కాలనీ వద్ద పైపులైన్ పగిలి వృథాగా పోతున్న నీరు

లింగసముద్రం, జనవరి 17 : మండలంలోని పెంట్రాల ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు పక్కనే ఉన్న మంచినీటి పైపులైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతోంది. వారం రోజుల క్రితం ఈ పైపులైన్ పగిలిందని స్థానికులు అంటున్నారు. మొగిలిచెర్లలోని చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకానికి సంబంధించిన మంచినీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

సోమశిలలో 29.639 టీఎంసీల నీరు

అనంతసాగరం, జనవరి 17: సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, బుధవారం నాటికి 29.639 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. డెల్టాకు 2,350, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వారు తెలిపారు.

జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు



పోకూరులో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు

వలేటివారిపాలెం, జనవరి 17 : జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ తెలిపారు. మండలంలోని పోకూరులో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని బుధవారం రాత్రి 8 గంటలకు ఆవిష్కంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో తెలుగు వారికి గుర్తింపు తెచ్చింది ఎన్టీఆర్ అన్నారు. రాష్ట్రంలో మళ్లీ రామరాజ్యం రావాలంటే చంద్రబాబును సీఎం చేసుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల యుద్ధంలో రాక్షస సంహారం జరగాలన్నారు. టీడీపీని స్థాపించి ఎంతో మందికి రాజకీయ అవకాశాలు కల్పించింది ఎన్టీఆర్ అని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ ప్రభుత్వం పనితీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక గజదొంగకు ఒక్క చాన్స్ ఇవ్వడమే పెద్ద తప్పు అని దాని ఫలితమే ఇప్పుడు అనుభవిస్తున్నామని, మరోసారి జగన్‌కు ఓటు వేస్తే మనలను మనమే మోసం చేసుకున్నట్లు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరావు, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కనిగిరి, కందుకూరు మాజీ ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, డాక్టర్ దివి శివరాం, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, చీరాల ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం. రాజేష్, నాయకురాలు ఉన్నం నళినీదేవి, ఎం.లక్ష్మీనరసింహం, ఆర్. సుబ్బారావు, జే నాగరాజు డీ నాగమల్లేశ్వరావు, ఎస్ రోశయ్య, జీ చెంచురామయ్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మధుసూదనరావు

వరికుంటపాడు, జనవరి 17: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన సాగుతోందని టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు అన్నారు. బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీ పీకి బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం వైసీపీకి చెందిన మాజీ సర్పంచు గుంటుపల్లి అనురాధ, వెంగమనాయుడు దంపతుల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన కార్యకర్తలను పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే తిమ్మారెడ్డిపల్లికి చెందిన ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ చేవూరి రవితేజ, ముస్లీం మైనార్టీ నాయకులు రసూల్ తదితరులు స్వచ్ఛందంగా పార్టీలో చేరి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర వెంకయ్య, పోకా మహేష్, పాలకొల్లు విజయభాస్కర్‌రెడ్డి, మానం కొండలరావు, ముజ్జె లక్ష్మీనారాయణ, పోలిబోయిన శ్రీకాంత్, గోళ్ల వెంగళరావు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ విద్యార్థుల కోసం ఆర్థిక సహాయం



డైరీ ఆవిష్కరిస్తున్న రజక విద్యా సేవా సంఘం ప్రతినిధులు

కందుకూరు, జనవరి 17: చదువుకోవాలన్న ఆసక్తి ఉన్నా కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా చదువు మధ్యలోనే ఆపేసిన విద్యార్థులను తిరిగి చదువుకునేలా ప్రోత్సహించడం కోసం రజక విద్యా సేవాసంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. పట్టణంలోని చాకలిపాలెం రామాలయం వద్ద గురువారం సంఘం డైరీని విశ్రాంత ఎంపీడీఓ కె. మాలకొండయ్య, బీజేపీ నాయకుడు కె.మోహనరావు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక కారణాలతో చదువు మానేసిన వారు ఎవరైనా విద్య కొనసాగింపునకు ఆసక్తి చూపితే వారి వివరాలు తెలపాలన్నారు. అలాగే పదవ తరగతిలో మంచిమార్కులు సాధించిన రజక విద్యార్థులకు రూ.5వేల ప్రోత్సాహక బహుమతిని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.యలమంద, కేవై కోటయ్య, కె.వెంకటేశ్వర్లు, మంచికలపాటి వెంకటేశ్వర్లు, కె.రవి, కె.మాలకొండయ్య, పి.బ్రహ్మయ్య, బీవీ కాశీరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపునకు కారణమైన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

● తహసీల్దారుకి టీడీపీ, జనసేన నేతల వినతి



తహసీల్దారుకి వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

సీతారామపురం, జనవరి 17 : ఉదయగిరి నియోజకవర్గం సీతారామపురం మండల పరిధిలోని నెమళ్లదిన్నె గ్రామ పంచాయతీలో పోలింగ్ బూత్ నెంబర్- 19లో ఓ వైసీపీ నాయకుడు ఫామ్ -7 ఉపయోగించి టీడీపీ, జనసేన మద్దతుదారులైన సుమారు 52 ఓట్లు తొలగించటానికి ప్రయత్నించడాన్ని ఖండిస్తూ అతనిపై చర్య తీసుకోవాలని మండలంలోని టీడీపీ, జనసేన నాయకులు మండల తహసీల్దారుకి వినతిపత్రం అందజేశారు. దీంతో తహసీల్దారు స్పందిస్తూ ఓట్లు తొలగింపునకు కారణమైన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయడం జరిగిందని, పోలీసుల విచారణ జరుగుతోందని తెలిపారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ ఉదయగిరి నియోజకవర్గ నాయకుడు బోగినేని కాశీరావు, టీడీపీ మండల కన్వీనర్ కప్పు ప్రభాకర్‌రాజు, నెమళ్లదిన్నె గ్రామపంచాయతీ సర్పంచ్ తోకల రామచంద్ర, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి పాలిశెట్టి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి అల్లూరి రవీంద్ర, పోకలపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల వద్ద పెద్దమొత్తంలో నగదు స్వాధీనం?

● నామమాత్రంగా చూపించి, కేసులు నమోదు చేసిన పోలీసులు

కందుకూరు, జనవరి 17: సంక్రాంతి పర్వదినం సందర్భంగా కందుకూరు ప్రాంతంలోని వివిధ ప్రాంతాల్లో జూదరులపై పోలీసులు జరిపిన దాడుల సందర్భంగా భారీగా చేతివాటం ప్రదర్శించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా పలు ప్రాంతాలలో జూదం ఆడటంతో పాటు వలేటివారిపాలెం మండలం శాఖవరం వద్ద పేకాట స్థావరం, కందుకూరు పట్టణంలోని ఓ హోటల్‌లో, ఏకలవ్యనగర్, మండలంలోని పలుకూరులలో కూడా పేకాటస్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. అయితే శాఖవరం వద్ద నిర్వాహక పేకాట కావడంతో కందుకూరు పరిసర ప్రాంతాలతో పాటు గుడ్లూరు, కొండపి తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో కోతముక్క పేకాటరాయుళ్లు అక్కడకు చేరి జూదం ఆడుతుండగా పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. అక్కడ రమారమి 40 మంది వరకు జూదరులు పోలీసులు దాడి చేసిన సమయంలో ఉండగా పదిమంది మాత్రమే పట్టుబడ్డారు. మిగిలిన వారిలో కొందరు పోలీసుల నుంచి తప్పించుకునేందుకు డబ్బులు విసిరేసి పరారైనట్లు తెలిసింది. సంక్రాంతి పర్వదినం రోజున పోలీసులు దాడిచేసినప్పటికీ సమాచారం మంగళవారం వెలుగులోకి వచ్చింది. అయితే మొత్తంగా అక్కడ పది లక్షల రూపాయలకు పైగా పట్టుబడగా పోలీసులు కేవలం లక్షా 90వేల రూపాయలు మాత్రమే దొరికినట్లు చూయించటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దొరికిన మొత్తంలో నాలుగోవంతు కూడా చూయించలేదని చెబుతున్నారు.

'గడప గడప'కు పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే

కావలి, జనవరి 17: కావలి పట్టణంలో గడపగడప కార్యక్రమంలో గుర్తించిన పనులకు నిధులు మంజూరైన పనులు ఎట్టి పరిస్థితిలోనూ పూర్తి చేయాల్సిందేనని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గడపగడప పనుల పురోగతిపై బుధవారం సాయంత్రం ఆయన మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు, వైసీపీ వార్డు ఇన్‌చార్జీలతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో గడపగడప కార్యక్రమం పూర్తి అయిందని, ఆ కార్యక్రమంలో మున్సిపాల్టీలోని 28 సచివాలయాల పరిధిలో రూ.12 కోట్లు మంజూరు చేయడమే కాక వాటికి అనుమతులు కూడా వచ్చాయన్నారు. ఇప్పటి వరకు ఎన్ని పనులు చేపట్టారు వాటిలో ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి వాటిని ఎప్పుడు పూర్తి చేస్తారని ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. అలాగే విజయవాడలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని అద్భుతంగా నిర్మించారని, దానిని ఈ నెల 19వ తేదీన ప్రారంభించనున్నందున ఈ కార్యక్రమానికి కావలి నియోజకవర్గం నుంచి ప్రజలు తరలి రావాలన్నారు.